బుధవారం
11-10-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 111
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఇజ్రాయిల్ 'రసాయన' ఆయుధాలు?

పలస్తీనా ఉగ్రవాద గ్రూపు హమాస్ తన భూభాగాలపై సంచలనాత్మక భూ-సముద్ర-వాయు దాడి తర్వాత గాజాలో లక్ష్యాలను ఛేదించడం ఇజ్రాయిల్ కొనసాగిస్తోంది. ఇజ్రాయిల్ రక్షణ దళం (ఐడీఎఫ్) జనసాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో నిషేధించబడిన తెల్ల భాస్వరం బాంబులను ఉపయోగిస్తోందని ఆరోపిస్తూ సామాజిక మాధ్యమాల్లో వీడియోలు వ్యాపించాయి.

2 లో

రక్తపుటేర్లు

నాల్గవ రోజుకు ఇజ్రాయిల్.. హమాస్ పోరు

- గాజాలో 788 మంది మృతి... 4 వేల మందికి గాయాలు
- వెయ్యికి పెరిగిన ఇజ్రాయిల్ మృతుల సంఖ్య

ఇజ్రాయిల్, హమాస్ ఉగ్రవాదుల మధ్య భీకర పోరు మంగళవారం నాల్గవ రోజుకు చేరుకుంది. ఇజ్రాయిల్ సైనిక దళాలు హమాస్ నియంత్రణలో ఉన్న 140 చదరపు మైళ్ల జనసాంద్రత కలిగిన గాజాపై అధిక సంఖ్యలో వైమానిక దాడులు చేశాయి. గాజాలో బందీలకు ప్రాణహాని జరిగితే హమాస్ దారుణ పరిస్థితిని ఎదుర్కొంటుందని ఇజ్రాయిల్ సైన్యం హెచ్చరికలు జారీ చేసింది.

2 లో

ఇజ్రాయిల్‌కు భారత్ అండ

- నెతన్యాహుకు మోదీ హామీ
- ఉగ్ర దాడులకు ఖండన

అప్పుల్లో అదరహో!

- ఏడు నెలల్లో రూ.67,500 కోట్ల రుణ సేకరణ
- తాజాగా ఆర్బీఐ వద్ద రూ.450 కోట్లు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: అప్పులు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం రికార్డు సృష్టిస్తోంది. అతి తక్కువకాలంలో ఎక్కువ రుణాలు సేకరించడంలో ముందు వరుసలో ఉంది. కేవలం ఏడు నెలల వ్యవధిలో రూ.67,500 కోట్ల అప్పులు తీసుకొచ్చి ఏపీ ప్రభుత్వం రికార్డు సృష్టించింది. రిజర్వుబ్యాంకులో బాండ్ల వేలం ద్వారా రూ.44,500 కోట్లు తీసుకురాగా, మరో రూ.23 వేల కోట్లు వివిధ కార్పొరేషన్‌ల ద్వారా అప్పు తెచ్చింది. మళ్లీ కొత్త రుణ పరిమితి ఇస్తేనే ఏపీ ప్రభుత్వానికి బాండ్ల వేలానికి అనుమతి ఉంటుంది. మంగళవారం తాజాగా తెచ్చిన రూ.450 కోట్ల అప్పుతో పెంచిన ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితి కూడా పూర్తయింది. రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియాలో బాండ్ల వేలం ద్వారా 15 సంవత్సరాలకుగాను 7.67 శాతం వడ్డీ చెల్లింపు షరతుతో రాష్ట్ర ప్రభుత్వం అప్పు తీసుకుంది. ఈ అప్పుతో ఇప్పటివరకు ఎఫ్‌ఆర్‌బీఎం కింద ఏపీ రుణం రూ.44,500 కోట్లకు చేరింది. విచిత్రమేమిటంటే మంగళవారాన్ని అప్పుల వారంగా మార్చి ప్రతివారం క్రమం తప్పకుండా ఆర్బీఐ వేలంలో పాల్గొంటూ ఇంత పెద్దమొత్తంలో తీసుకొస్తున్నా ఈనెల ఇంతవరకు చాలామంది ప్రభుత్వ ఉద్యోగులకు జీతాల చెల్లింపు ప్రక్రియ పూర్తి కాలేదు. అక్టోబర్ 10వ తేదీ వచ్చినా తమ ఖాతాల్లో ఇంకా జీతాలు పడలేదని ఉద్యోగులు, పెన్షనర్లు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికే ఏపీ ప్రభుత్వం రిజర్వ్ బ్యాంక్ వద్ద ఓడీ, వేస్ అండ్ మీన్స్ కింద రూ.5 వేల కోట్లు అప్పు జేసింది. కేంద్రం అదనపు అప్పులు ఇచ్చినా దానికిందే జమ అయింది. జీతాలు, పెన్షన్ల కోసం ఏపీ ప్రభుత్వం అప్పుల వేట కొనసాగిస్తోంది. ఉద్యోగుల వేతనాలు, పెన్షనర్లకు పెన్షన్ల కోసం ప్రతి నెల రూ.5,500 కోట్లను ప్రభుత్వం వెచ్చిస్తోంది. నేటివరకు రూ.3,500 కోట్లు మాత్రమే జగన్ సర్కార్ జమ చేసింది. దీంతో చాలామంది పెన్షనర్లకు, ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు, పెన్షన్లు పడలేదు. తాజాగా ఆర్బీఐ వద్ద బాండ్ల వేలం ద్వారా సేకరించిన రూ.450 కోట్లు బుధవారం నాటికి ప్రభుత్వ ఖజానాలో జమ అయినప్పటికీ పెన్షనర్లు, ఉద్యోగులందరికీ పూర్తిస్థాయిలో చెల్లింపులు చేసే అవకాశం లేదు.

రైతులకు నష్టదాయకంగా మోదీ తీరు

హామీల అమలుకు ఉద్యమం

8 లో

- విద్యుత్ సంస్కరణలు ఉపసంహరించాలి
- బెంగళూరు సదస్సులో రావుల వెంకయ్య డిమాండ్



పొత్తు ఓకే... సీట్ల సంఖ్య తేలలేదు

కాంగ్రెస్‌తో అవగాహనపై నారాయణ

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీతో రాజకీయ అవగాహన కుదిరిందని, ఇంకా సీట్ల పంపిణీపై ఒప్పందం కుదరలేదని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ తెలిపారు. ఊహాగానాలు నమ్మవద్దని, చర్చలు ఆశాజనకంగా ఉన్నాయని, అవి పరిష్కారమవుతాయని విశ్వసిస్తున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ మగ్దూంభవన్‌లో సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా, కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పల్లా వెంకటరెడ్డి, ఈటీ నర్సింహతో కలిసి నారాయణ మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చెరి ఐదు సీట్లు కోరుతూ కాంగ్రెస్ పార్టీకి సీపీఐ, సీపీఎం జాబితా అందజేసినట్లు నారాయణ తెలిపారు. దీనిపై జాతీయ నాయకత్వాలు మాట్లాడుతున్నాయని చెప్పారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, అజీజ్ పాషా, తాను మాట్లాడామని వివరించారు. ఇక్కడ కూడా సీపీఐ, సీపీఎంతో కాంగ్రెస్ విడివిడిగా చర్చలు జరుపుతోందని నారాయణ

- మిగతా 2 లో

క్వాష్ పిటిషన్‌పై వాడీవేడిగా వాదనలు

స్కిల్‌పై సుప్రీం విచారణ 13కు వాయిదా

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు దాఖలు చేసిన క్వాష్ పిటీషన్‌పై సుప్రీంకోర్టులో రెండోరోజూ వాడివేడిగా వాదనలు కొనసాగాయి. వాదనలు ఇంకా పూర్తికాకపోవడంతో విచారణను సుప్రీం

- మిగతా 2 లో

ఇన్నర్ రింగ్‌రోడ్డు కేసులో

లోకేశ్‌ను విచారించిన సీఐడీ

- తొలిరోజు 50 ప్రశ్నలు
- నేడు మళ్లీ రావాలంటూ నోటీసులు

2 లో

ఇదీ లోకం!

మార్చిలో ఎన్నికలంటే... ఎండలకి కార్యకర్తల బీర్లకే కోట్లలో అవుతుంది సార్..ఆలోచించండి!

యదేచ్ఛగా బియ్యం పక్కదారి

- అధికారులు దాడులు చేస్తున్నా... ఆగని దందా
- కార్డుదారును మోసగించి కొంటున్న వైనం

విశాలాంధ్ర-లింగపాలెం: రేషన్ దుకాణాల ద్వారా పేదలకు పంపిణీ చేస్తున్న బియ్యం పక్కదారి పడుతూనే ఉంది. అధికారులు నామమాత్రపు దాడులు చేస్తున్నప్పటికీ అక్రమార్కుల దందా అడ్డూ అదుపు లేకుండా మూడుపువ్వులు ఆరుకాయలుగా సాగుతూనే ఉంది. ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి ఉచితంగా బియ్యాన్ని పంపిణీ చేస్తుంటే... అక్రమార్కులు అవి మంచి బియ్యం కాదని లబ్ధిదారులలో అపోహ కలిగించిన కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం కిలోకి రూ.41లు ఖర్చు పెట్టి బియ్యం సరఫరా చేస్తుంటే అక్రమ వ్యాపారుల వలలో పడి వీటిని వినియోగించుకోకుండా అమ్మేసుకోవటం విడ్డూరంగా ఉంది. వారి మాటలు నమ్మి చాలావరకు కార్డుదారులు ఉచితంగా వచ్చిన పోషకాలతో కూడిన బియ్యాన్ని కిలో రూ.10కి అమ్మేసుకుని బహిరంగ మార్కెట్‌లో రూ.35 నుంచి రూ.50ల వరకు పాలిష్ పట్టిన బియ్యాన్ని కొనుక్కుంటున్న పరిస్థితి నెలకొంది. ఇదేమి అమాయకత్వమనే చర్చ సాగుతోంది. దీని వల్ల ప్రభుత్వం ఖర్చు పెడుతున్న నిధులు నిరుపయోగం అవుతుండటంతో పాటు కార్డుదారులు అదనపు భారాన్ని కొని తెచ్చుకుంటున్నారు. ఈ పరిస్థితి అక్రమ వ్యాపారులకు వరంగా మారి కోట్లాది రూపాయలను గడిస్తున్నారు. గ్రామ స్థాయి నుంచి జరిగే అక్రమ వ్యాపారానికి పెద్ద నెట్‌వర్క్ ఉంది. రేషన్ బియ్యం అక్రమ వ్యాపారానికి హద్దేలేదంటూ విశాలాంధ్రలో గత నెల 21న కథనం ప్రచురితమవడంతో అధికారులు దృష్టి పెట్టి దాడులు చేస్తున్నారు. ఇటీవల చేసిన దాడుల్లో టి.నరసాపురం, ధర్మాజీగూడెం, తడికలపూడిలో దాదాపు రూ.13 లక్షల విలువ గల 33 వేల కిలోల బియ్యాన్ని సీజ్ చేశారు. ఇదిలా ఉంటే ఒక్క ఏలూరు జిల్లాలో రెండు నెలల కాలంలో దాదాపు రూ. 28 లక్షలు విలువ చేసే 70 వేల కిలోల బియ్యాన్ని పట్టుకున్నారు. 50 మందిపై కేసులు పెట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా పరిశీలిస్తే లక్షల కిలోల బియ్యం పట్టుబడ్డాయి. విస్తృతంగా దాడులు జరుగుతున్నా ... అక్రమ వ్యాపారులు తగ్గేదేలే.. అన్నట్టుగా వ్యాపారాలు చేస్తున్నారు. కోట్ల ఆదాయం వచ్చే ఈ వ్యాపారాన్ని అక్రమ వ్యాపారులు వదులుకోవటంలేదు. రకరకాల ఎత్తుగడలతో వ్యాపారాలు సాగిస్తున్నారు. వీరిపై దాడులు చేసి కేసులు పెడుతున్నా అక్రమార్కులు ఏ మాత్రం ఖాతరు చేయటంలేదు. దీంతో పట్టుకుంటున్న కొద్దీ బియ్యం పట్టుబడుతున్నా అక్రమార్కులు వెనక్కి తగ్గటంలేదు.

అవగాహన లేకపోవటం వల్లే...

రేషన్ బియ్యంలో పోషకాలు ఉన్నాయనే దానిపై కార్డుదారుల్లో సరైన అవగాహన లేదు. దీనిపై ప్రభుత్వాధికారులు చేస్తున్న ప్రచారం కంటే అక్రమ వ్యాపారులు ఇవి మంచి బియ్యం కాదని క్షేత్రస్థాయి నుంచి చేస్తున్న ప్రచారం బలంగా ఉంటోంది. దీంతో కార్డుదారులు వీరి ప్రచారాన్నే నమ్ముతున్నారని... దీనివల్లే అక్రమ వ్యాపారం హద్దు లేకుండా సాగుతుందనే వాదనలు ఉన్నాయి. అయితే 1955లో నిత్యావసర సరుకుల చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టినా... 2018లో రాష్ట్ర ప్రభుత్వం చట్టం తెచ్చినా అక్రమ వ్యాపారులను ఈ చట్టాలు ఏమీ చేయలేకపోతున్నాయనే చర్చ సాగుతోంది. పీడీయాక్టు అమలులో ఉన్నప్పటికీ ఏలూరు జిల్లాలో అక్రమ బియ్యం వ్యాపారులపై ఇటువంటి కేసులు పెట్టలేదని అధికారులే అంటున్నారు. ఈ పరిస్థితిని అక్రమ వ్యాపారులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. చట్టాలను కఠినంగా అమలు చేస్తే ప్రభుత్వ పథకానికి న్యాయం జరుగుతుందని, పేదలపై ఆర్థిక భారం ఉండదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

బియ్యం విలువ తెలుసుకోవాలి: డీఎస్ఓ

ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న

- మిగతా 2 లో

ఆటో కార్మికులపై

ఉక్కుపాదం

- సీఎం కార్యాలయం ముట్టడిని అడ్డుకున్న పోలీసులు
- నేతల అరెస్టు, పోలీసు స్టేషన్‌కు తరలింపు

విశాలాంధ్ర-విజయవాడ: ఆటో కార్మికుల ఉద్యమంపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఆటో కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరుతూ ఆటో కార్మికసంఘాల ఐక్యకార్యాచరణ పిలుపు మేరకు ముఖ్యమంత్రి కార్యాలయ ముట్టడికి వెళుతున్న ఆటోకార్మికులను పోలీసులు మంగళవారం అడ్డుకున్నారు. దాసరి భవన్ నుంచి ర్యాలీగా సీఎం కార్యాలయానికి బయలుదేరిన విజయవాడ ఆటో వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ నాయకులు, టీఎన్‌టీయూసీ నాయకులు, ఆటో కార్మికులను అరెస్టు చేసి స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా విజయవాడ ఆటోవర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు దోనేపూడి శంకర్ మాట్లాడుతూ ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఆటోరంగాన్ని పరిశ్రమగా గుర్తించాలని, కార్మికులకు గుదిబండగా మారిన జీవో 21, జీవో 31లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఆటోకార్మికులకు వైఎస్ జగన్ అనేక హామీలు ఇచ్చారని గుర్తు చేవారు. వాహనమిత్ర పేరుతో రూపాయి ఇచ్చి పది రూపాయలు గుంజుకుంటున్నారని విమర్శించారు. నిరుద్యోగుల ఉపాధికి మార్గంగా ఉన్న ఆటో రంగాన్ని పరిశ్రమగా గుర్తించాలని కోరారు. ఆటో కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, బీమా వంటి అన్ని వసతులు కల్పించి కార్మికుల జీవితానికి భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వాహనమిత్ర పథకం పేరుతో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ జాతర జరిపారని చెప్పారు. ఆయన అనుచరులే యూనిఫారం వేసుకుని వాహనమిత్ర ప్రయోజనాలు పొందారని ఆరోపించారు. హామీలు నెరవేర్చమని ముఖ్యమంత్రిని అడిగేందుకు వెళుతున్న ఆటోకార్మికులపై పోలీసులు అణచివేత చర్యలకు పాల్పడటం దారుణమన్నారు. ఆటో కార్మికుల ఆందోళనను భగ్నం చేయడానికి

- మిగతా 2 లో

పత్రికా స్వేచ్ఛపై దాడిని ఖండిస్తూ

ఢిల్లీలో కమ్యూనిస్టుల ప్రదర్శన

- జర్నలిస్టుల అక్రమ అరెస్టులకు నిరసన
- ఢిల్లీ పోలీసుల దుర్మార్గపు చర్య: అమర్‌జిత్ కౌర్ విమర్శ

న్యూఢిల్లీ: పత్రికా స్వేచ్ఛపై దాడిని ఖండిస్తూ ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం భారీ ప్రదర్శన జరిగింది. న్యూస్‌క్లిక్‌పై ఇటీవల జరిగిన దాడులను, జర్నలిస్టుల అక్రమ అరెస్టులను నిరసిస్తూ ప్రదర్శకులు దిక్కులు పిక్కటిల్లేలా నినాదాలు చేశారు. ఈ ర్యాలీలో కమ్యూనిస్టు పార్టీ శ్రేణులు, ప్రజాసంఘాల కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రదర్శకులనుద్దేశించి సీపీఐ జాతీయ కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ మాట్లాడుతూ, న్యూస్‌క్లిక్ వ్యవస్థాపకులలో ఒకరైన ప్రబీర్ పురకాయస్థ, అమిత్ చక్రవర్తిని అరెస్టు చేయడం దారుణమని ఖండించారు. 46 మంది ప్రముఖులైన ఇండిపెండెంట్ జర్నలిస్టుల ఇళ్లపైన, వివక్షతో దాడి చేశారనీ వీరిలో 8మంది మహిళా జర్నలిస్టులున్నారని చెప్పారు. మోదీ ప్రభుత్వ అధీనంలో ఉన్న ఢిల్లీ పోలీసులు ఈ దారుణానికి ఒడిగట్టారని చెప్పారు. అత్యంత దుర్మార్గమైన యూఏపీఏని వీరిపై ప్రయోగించారు. వాస్తవాలను, నిజాలను ప్రజలకు తెలియజేసే గొంతుకలను నొక్కివేసేందుకే ఈ చర్యలను ప్రభుత్వం తీసుకుంటోందన్నారు. ఈ జర్నలిస్టులంతా అత్యంత

- మిగతా 2 లో

ఇజ్రాయిల్ 'రసాయన' ఆయుధాలు?

గాజాలో హమాస్ ఉగ్రవాదులపై తెల్ల భాస్వరం వినియోగం

గాజా స్ట్రిప్: పలస్తీనా ఉగ్రవాద గ్రూపు హమాస్ తన భూభాగాలపై సంచలనాత్మక భూ-సముద్ర-వాయు దాడి తర్వాత గాజాలో లక్ష్యాలను ఛేదించడం ఇజ్రాయిల్ కొనసాగిస్తోంది. ఇజ్రాయిల్ రక్షణ దళం (ఐడీఎఫ్) జనసాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో నిషేధించబడిన తెల్ల భాస్వరం బాంబులను ఉపయోగిస్తోందని ఆరోపిస్తూ సామాజిక మాధ్యమాల్లో వీడియోలు వ్యాపించాయి. గాజాలోని పౌరులపై ఇజ్రాయిల్ దళాలు తెల్ల భాస్వరం ప్రయోగిస్తున్నాయని సామాజిక మాధ్యమంలో అనేక ఫోటోలు, వీడియోలు, వాదనలు ఆరోపించాయి. ఇజ్రాయిల్ దిగ్బంధనంలో ఉన్న పాలస్తీనా భూభాగమైన గాజా స్ట్రిప్ చాలా సంవత్సరాలుగా హమాస్ అధ్వర్యంలో ఉంది. గాజా స్ట్రిప్‌లో 362 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో 20 లక్షల మందికి పైగా ప్రజలు నివసిస్తున్నారు.

తెల్ల భాస్వరం ప్రభావం ఏమిటి?

తెల్ల భాస్వరం ఒక మైనపు, పసుపు నుంచి స్పష్టమైన రసాయనం. ఇది ఘాటైన, వెల్లుల్లి లాంటి వాసనతో ఉంటుంది. ఇది చాలా మండే రసాయనం, ఇది గాలికి గురైనప్పుడు త్వరగా, ప్రకాశవంతంగా కాలిపోతుంది. ఇది అమెరికాతో సహా ప్రపంచవ్యాప్తంగా ఉన్న సైన్యంచే దాహక ఆయుధాలను రాత్రి సమయంలో లక్ష్యాలను ప్రకాశవంతం చేయడం లేదా శత్రువులకు నష్టం కలిగించడం వంటి వివిధ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తారు. ఈ రసాయన ప్రతిచర్య తీవ్రమైన వేడిని (సుమారు 815 డిగ్రీల సెల్సియస్), కాంతి, దట్టమైన తెల్లటి పొగను ఉత్పత్తి చేస్తుంది. ఇది సున్నిత ప్రాంతాలలో పొగ తెరలను సృష్టించడానికి సైనిక దళాలు ఉపయోగిస్తుంటాయి. తెల్ల భాస్వరం భూమిపై వేగంగా వ్యాపించడంతో పాటు విస్తృతమైన మంటలను కలిగిస్తుంది. ఒకసారి మండించిన తర్వాత పదార్థాన్ని బయటకు తీయడం చాలా కష్టం. ఎందుకంటే ఇది చర్మం, దుస్తులతో సహా అనేక ఉపరితలాలకు అతుక్కుంటుంది. ఇది పౌరులకు చాలా ప్రమాదకరమైనది. ఎందుకంటే ఇది కణజాలం, ఎముకలలోకి లోతుగా చొచ్చుకుపోయే తీవ్రమైన కాలిన గాయాలకు కారణమవుతుంది. చికిత్స తర్వాత కూడా ఇది మళ్లీ ప్రేరేపిస్తుంది.

ఇంతకుముందే యుద్ధాలు... దాడుల్లో వినియోగం

1800లలో ఫెనియన్ లేదా ఐరిష్ జాతీయవాదులు బ్రిటీష్ దళాలకు వ్యతిరేకంగా ఉపయోగించినప్పుడు సైనిక యుద్ధాలలో తెల్ల భాస్వరం మొట్టమొదటి ఉపయోగాలలో ఒకటని నివేదించబడింది. ఐరిష్ రిపబ్లికన్లు ఉపయోగించిన సూత్రీకరణ 'ఫెనియన్ ఫైర్' అని పేర్కొన్నారు. బ్రిటీష్ సైన్యం రెండు ప్రపంచ యుద్ధాలలో దీనిని ఉపయోగించింది. ఇరాక్‌పై దాడి చేసిన తర్వాత అమెరికా దళాలు ఫలూజా నగరంలో తిరుగుబాటు దారులపై రసాయన ఆయుధాన్ని ఉపయోగించాయి. ఇక ఇజ్రాయిల్ ఈ ఆరోపణల గురించి తెలియనిది కాదు. 2006 లెబనాన్ యుద్ధంలో హిజ్బుల్లాతో జరిగిన యుద్ధంలో భాస్వరం గుండ్లు ఉపయోగించినట్లు అంగీకరించింది. అనేక మానవ హక్కుల సంఘాలు ఇజ్రాయిల్ రక్షణ దళాలు (ఐడీఎఫ్) 2008-09 గాజా యుద్ధంలో పౌరులకు వ్యతిరేకంగా తెల్ల భాస్వరంను ఉపయోగించిందని ఆరోపించాయి. దీనిని 'ఆపరేషన్ కాస్ట్ లీడ్' అని కూడా పిలుస్తారు. బషర్ అల్-అస్సాద్ నేతృత్వంలోని సిరియా ప్రభుత్వం సిరియా సంక్షోభం సమయంలో తెల్ల భాస్వరంతో సహా రసాయన ఆయుధాలను ఉపయోగించిందని అంతర్జాతీయ సమాజంలోని పెద్ద వర్గం ఆరోపించింది. ఇటీవల, ఉక్రెయిన్‌పై జరుగుతున్న యుద్ధంలో రష్యా సైన్యం తెల్ల భాస్వరం బాంబులను ఉపయోగించిందని ఆరోపించారు.

ఐక్యరాజ్యసమితి నిషేధించింది

1972లో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ దాహక ఆయుధాలను 'ఆయుధాల వర్గం భయానకంగా చూడటం' గా పేర్కొంటూ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. 'దాహక ఆయుధాలు అనేది నాపామ్ లేదా తెల్ల భాస్వరం వంటి మండే పదార్థం రసాయన ప్రతిచర్య ఫలితంగా జ్వాల, వేడి లేదా వాటి కలయిక ద్వారా వస్తువులకు నిప్పు పెట్టడానికి లేదా ప్రజలకు మంటలు లేదా శ్వాసకోశ గాయాలు కలిగించడానికి రూపొందించిన ఆయుధాలు' అని ఐరాస పేర్కొంది. 1980లో పౌరులకు ఎక్కువ నొప్పి లేదా హాని కలిగించే కొన్ని ఆయుధాల వినియోగాన్ని నిషేధించడానికి లేదా పరిమితం చేయడానికి ప్రపంచం అంగీకరించింది. ఈ ఒప్పందం ప్రోటోకాల్-3 ప్రకారం మండే గుణం కలిగిన ఆయుధాల వినియోగాన్ని పరిమితం చేస్తుంది.

హమాస్ ఉగ్రవాదులు 1,500 మంది హతం

ఇజ్రాయిల్ సైన్యం వెల్లడి

గాజా స్ట్రిప్: గాజా స్ట్రిప్ చుట్టూ ఇజ్రాయిల్‌లో దాదాపు 1,500 మంది హమాస్ ఉగ్రవాదుల మృతదేహాలు లభ్యమయ్యాయని సైన్యం మంగళవారం తెలిపింది. వైమానిక దాడులతో పలస్తీనా భూభాగాన్ని దెబ్బతీసింది. 'గాజా స్ట్రిప్ చుట్టూ ఇజ్రాయిల్‌లో సుమారు 1,500 మంది హమాస్ ఉగ్రవాదుల మృతదేహాలను గుర్తించాము' అని సైనిక ప్రతినిధి రిచర్డ్ హెచ్ట్ విలేకరులతో అన్నారు. భద్రతా దళాలు గాజాతో 'సరిహద్దుపై ఎక్కువ లేదా తక్కువ నియంత్రణను పునరుద్ధరించాయి' అని తెలిపారు. 'నిన్న రాత్రి నుంచి ఎవరూ లోపలికి రాలేదని మాకు తెలుసు. కానీ చొరబాట్లు ఇంకా జరుగుతూనే ఉంటాయి. సరిహద్దు చుట్టూ ఉన్న అన్ని వర్గాల తరలింపును సైన్యం 'దాదాపు పూర్తి చేసింది' అని ఆయన అన్నారు. శనివారం ఉదయం రాకెట్ కాల్పులతో సరిహద్దు కంచె గుండా హమాస్ ఉగ్రవాదులు ఇజ్రాయిల్ లోపలకు ప్రవేశించారు. ఉగ్రవాదుల దాడిలో 900 మందికి పైగా మరణించడంతో ఇజ్రాయిల్ అల్లాడిపోతోంది. ప్రతిస్పందనగా, ఇజ్రాయిల్ గాజా స్ట్రిప్‌లోని హమాస్ లక్ష్యాలపై భారీ వైమానిక, ఫిరంగి బాంబు దాడులను నిర్వహిస్తోంది. ఇది తీరప్రాంత భూభాగంలో ఇప్పటివరకు కనీసం 687 మందిని చంపింది.

విశాలాంధ్ర ప్రపంచం

ఆటో కార్మికులపై ఉక్కుపాదం

(మొదటిపేజీ తరువాయి)

సోమవారం నుంచి నగరంలోని కమ్యూనిస్టు పార్టీ నాయకులు, టీడీపీ నాయకులు, ఆటోకార్మిక సంఘాల నాయకులను గృహనిర్బంధం చేశారని ఆరోపించారు. అరెస్టులు, బెదిరింపులతో ఉద్యమాన్ని ఆపలేరని స్పష్టం చేశారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామ కృష్ణం రాజు మాట్లాడుతూ పది లక్షల మంది ఆటో కార్మికులకు బాసటగా నిలిచేందుకు టీఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, ఆటో కార్మిక జేఏసీ ఉద్యమానికి సిద్ధమయ్యాయని చెప్పారు. వాహనమిత్ర పథకం ద్వారా 2 లక్షల మందికి మాత్రమే 10 వేల రూపాయలు ఇచ్చి 8 లక్షల మందిని మోసం చేస్తున్నా రని విమర్శించారు. ఆటో కార్మికులు టెర్రరిస్టులు కాదన్నారు. రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో సీపీఐ కార్యాలయం దాసరి భవన్ వద్ద పోలీసు బలగాలను భారీగా మోహరించారు. ముందు రోజు నుంచే నాయకులను గృహనిర్బంధం చేయటంతో పాటు ఏఐటీయూసీ కార్యాలయం వద్దకు ఎవరూ రాకుండా అడ్డుకున్నారు. దాసరి భవన్‌కు వెళ్లే రహదారు వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయటంతో స్థానిక కార్యాలయాల్లో పనిచేసే వారు, వ్యాపారస్తులు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. కాగా, అరెస్టు అయిన వారిలో దోనేపూడి శంకర్, కొట్టు రమణరావు, కేవీ భాస్కరరావు, గూడెల జనార్ధన్, వెంకచ్చి, పి.లక్ష్మణరావు, కె.విజయకుమార్, ఎర్ర రాములు, చారి, కొండ, వినోద్, బాషా. గొట్టుముక్కల రఘురామకృష్ణం రాజు, జి.చిన్న, జి.గోవింద్, బొలిశెట్టి శేషుబాబు, పాల కేశవ, సూర్యకుమార్, జోసెఫ్, చరణ్‌సాయి యాదవ్ ఉన్నారు. నాయకులను సాయంత్రం విజయవాడ కోర్టులో హాజరు పర్చగా సొంత పూచీకత్తుపై మేజిస్ట్రేట్ విడుదల చేశారు.

రామకృష్ణ ఖండన

అరెస్టు అయి...వన్‌టైన్ పోలీసు స్టేషన్‌లో ఉన్న నాయకులను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, కార్యదర్శి వర్గసభ్యులు జి.ఈశ్వరయ్య పరామర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ తీరును, పోలీసుల దుర్మార్గాలను తీవ్రంగా ఖండించారు. ఆటోకార్మికుల శాంతియుత ఆందోళనను అడ్డుకోవడం, నాయకులను గృహనిర్బంధం చేయడం, పోలీసు స్టేషన్‌లకు తరలించడాన్ని వ్యతిరేకించారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఆటోకార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికుల ఉద్యమానికి మద్దతు ప్రకటించారు.

రక్తపుటేర్లు

జెరూసలేం: ఇజ్రాయిల్, హమాస్ ఉగ్రవాదుల మధ్య భీకర పోరు మంగళవారం నాల్గవ రోజుకు చేరుకుంది. ఇజ్రాయిల్ సైనిక దళాలు హమాస్ నియంత్రణలో ఉన్న 140 చదరపు మైళ్ల జనసాంద్రత కలిగిన గాజాపై అధిక సంఖ్యలో వైమానిక దాడులు చేశాయి. గాజాలో బందీలకు ప్రాణహాని జరిగితే హమాస్ దారుణ పరిస్థితిని ఎదుర్కొంటుందని ఇజ్రాయిల్ సైన్యం హెచ్చరికలు జారీ చేసింది. మరోవైపు, గాజాపై యుద్ధం చేస్తే మాత్రం బందీలను చంపేస్తామని హమాస్ ప్రకటించింది. గాజాలో ఇజ్రాయిల్ దాడులతో భారీగా ప్రాణనష్టం సంభవించినట్లు పలస్తీనా అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటి వరకు 788 మరణించగా, మరో 4 వేల మంది గాయపడినట్లు తెలిపారు. అటు హమాస్ జరిపిన రాకెట్ దాడుల్లో మృతుల సంఖ్య వెయ్యికి పెరగగా, దాదాపు 3 వేల మంది ఇజ్రాయిల్ పౌరులు గాయపడినట్లు ఆ దేశ ఆరోగ్య శాఖ వెల్లడించింది. ఈ భీకర పోరులో 1,37,000 మందికి పైగా నిరాశ్రయులయ్యారు.

గాజా మరణాల సంఖ్య 788

మరోవైపు, గాజాలో మరణించిన వారి సంఖ్య 788 కు పెరగగా, మరో 4 వేల మంది గాయపడ్డారని గాజాలోని పలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ మంగళవారం తెలిపింది. కాగా, ఇంటర్‌నెట్ అంతరాయాలు మరణాల సంఖ్య నవీకరణలను ప్రభావితం చేస్తున్నాయని ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇదిలాఉంగా, శనివారం తెల్లవారుజామున ప్రారంభమైన హమాస్ దాడుల్లో కనీసం 123 మంది ఇజ్రాయిల్ సైనికులు మరణించారని ఇజ్రాయిల్ రక్షణ దళాల ప్రతినిధి రియర్ అడ్మ్ డేనియల్ హగారి తెలిపారు. ఇజ్రాయిల్ సైన్యం గతంలో నివేదించిన 900 మందికి పైగా మరణించిన వారి సంఖ్యలో ఆ 123 మంది ఉన్నారు. 50 మంది ఇజ్రాయిల్ బందీల కుటుంబాలను భద్రతా బలగాలు సంప్రదించాయని హగరీ తెలిపారు. ఇజ్రాయిల్ సైనిక అధికారులతో సహా 100 మందికి పైగా బందీలుగా ఉన్నారని హమాస్ పేర్కొంది.

బీరీ వద్ద రక్తపు మడుగులు

గాజా సమీపంలోని 1,000 మంది నివాసితులతో కూడిన స్వయం నిరంతర వ్యవసాయ సంఘం అయిన ఇజ్రాయెలీ కిబ్బట్జ్ బీరీలో 100 కంటే ఎక్కువ మృతదేహాలను గుర్తించారు. శనివారం తెల్లవారుజామున సరిహద్దు దాటి ఇజ్రాయిల్‌లోకి ప్రవేశించిన ఉగ్రవాదులు లక్ష్యంగా చేసుకున్న మొదటి ప్రదేశాలలో బీరీ ఒకటి. ఇజ్రాయిల్ అధికారులు, సీఎన్‌ఎన్ నివేదించిన, ధ్రువీకరించిన వీడియోల ప్రకారం అక్కడి పౌరులు చంపబడ్డారు లేదా బందీలుగా ఉన్నారు. హమాస్ జరిపిన దాడుల్లో ఎక్కువ మంది విదేశీ బాధితులు ఉన్నట్లు కథనాలు వెలువడ్డాయి. ఫ్రాన్స్, రష్యా, థాయ్‌లాండ్ పౌరులతో సహా మంగళవారం ఎక్కువ మంది విదేశీ పౌరులు మరణించినట్లు నివేదికలు వచ్చాయి.

సరిహద్దు వద్ద నియంత్రణ

వారాంతంలో జరిగిన ఉల్లంఘన తర్వాత గాజాతో సరిహద్దు కంచెపై ఇజ్రాయిల్ సైన్యం 'ఎక్కువ లేదా తక్కువ' పూర్తి నియంత్రణను పునరుద్ధరించిందని ఐడీఎఫ్ ప్రతినిధి హెచ్ట్ మంగళవారం చెప్పారు. ఇజ్రాయిల్ తన వైమానిక దాడులను కొనసాగించగా, గాజా సరిహద్దుకు దగ్గరగా ట్యాంకుల భారీ వరుస కనిపించింది. ఐక్యరాజ్య సమితిలోని ఇజ్రాయెల్ రాయబారి సీఎన్‌ఎన్ వార్తా సంస్థతో మాట్లాడుతూ 'హమాస్ ఉగ్రవాద సామర్థ్యాలను నిర్మూలించడమే దేశం ప్రాధాన్యత. రాత్రి వేళ ఇజ్రాయిల్ రక్షణ దళం (ఐడీఎఫ్) ఉగ్రవాద కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని మరో 200 దాడులను ప్రారంభించింది' అని తెలిపారు. ఇదిలాఉండగా, హెచ్చరిక లేకుండా వైమానిక దాడులు కొనసాగితే తమ వద్ద బందీలుగా ఉన్న పౌరులను చంపుతామని, మరణశిక్షలను ప్రత్యక్ష ప్రసారం చేస్తామని హమాస్ బెదిరిస్తోంది. ఇజ్రాయిల్ సైనికాధికారులతో సహా 100 మందికి పైగా బందీలను కలిగి ఉన్నట్లు ఈ బృందం పేర్కొంది. బందీలుగా ఉన్నవారి సంఖ్య 150 వరకు ఉంటుందని ఇజ్రాయిల్‌కు చెందిన ఐరాస రాయబారి తెలిపారు. కాగా, హమాస్ దాడుల్లో ఇజ్రాయిల్ మృతుల సంఖ్య 1,000కు పైగా పెరిగిందని అమెరికాలోని ఇజ్రాయిల్ రాయబార కార్యాలయం తెలిపింది. మృతుల సంఖ్య 1,008 గా ఉందని, 3,418 మంది గాయపడినట్లు సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో పేర్కొంది.

నలుగురు ఫ్రెంచ్ పౌరుల మృతి

ఇజ్రాయెల్‌లో హమాస్ దాడుల్లో మరణించిన వారిలో నలుగురు ఫ్రెంచ్ పౌరులు ఉన్నారని ఫ్రెంచ్ విదేశాంగ మంత్రిత్వ శాఖ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. మరో 13 మంది కూడా ఆచూకీ తెలియడం లేదని పేర్కొంది. వారి ఆచూకీపై మంత్రిత్వ శాఖకు ఎటువంటి సమాచారం లేదు. ఆ ప్రకటనలో పరిస్థితి 'చాలా ఆందోళనకరంగా ఉంది', ఎందుకంటే గుర్తించబడని వారిలో కొందరు అపహరణకు గురైఉంటారు' అని తెలిపింది.

హమాస్ దాడిలో రెండో రష్యా జాతీయుడి మృతి

శనివారం హమాస్ జరిపిన దాడిలో కనీసం ఇద్దరు రష్యన్ పౌరులు మరణించినట్లు ధ్రువీకరించబడిందని రష్యా రాయబారి అనటోలీ విక్టోరోవ్ రష్యా టెలివిజన్‌లో తెలిపారు. తాజాగా బాధితురాలి బంధువులను రాయబార కార్యాలయం ఇంకా సంప్రదించలేదని విక్టోరోవ్ తెలిపారు. చనిపోయినట్లు నివేదించబడిన మొదటి వ్యక్తి ఇజ్రాయెల్-రష్యన్ ద్వంద్వ పౌరసత్వం కలిగిన 'యువకుడు' అని, ఆయన గతంలో ప్రభుత్వ-ఛానల్ వన్ టెలివిజన్ స్టేషన్‌తో చెప్పాడు. వీరిద్దరిలో ఒకరు కాలినిన్‌గ్రాడ్ ప్రాంతంలో జన్మించిన 47 ఏళ్ల రష్యన్ పౌరుడని, 1992లో ఇజ్రాయిల్‌కు వెళ్లారని రష్యా ప్రభుత్వ మీడియా రియా నోవస్తి నివేదించింది. కాగా, నలుగురు రష్యన్లు తప్పిపోయినట్లు పేర్కొంది. అయితే ఇజ్రాయిల్‌లోని రష్యా దౌత్య మిషన్‌కు దాని పౌరులను హమాస్ బందీలుగా ఉంచుతున్నారా అనే దానిపై సమాచారం లేదని విక్టోరోవ్ తెలిపారు. ఇదిలాఉండగా, అమెరికా పౌరులను బందీలుగా చేసుకున్న విషయమై ఇంకా స్పష్టత రానప్పటికీ, అమెరికా ఈ విషయాన్ని చాలా తీవ్రంగా పరిగణిస్తోందని జాతీయ భద్రతా మండలి ప్రతినిధి జాన్ కిర్బీ చెప్పారు. ఈ సందర్భంగా హమాస్ వద్ద బందీలను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు ఇజ్రాయిల్‌కు నైపుణ్యంతో పాటు ఇంటెలిజెన్స్ సమాచారాన్ని అందిస్తున్నట్లు వివరించారు.

బందీలను క్షేమంగా విడుదల చేయాలి: రెడ్‌క్రాస్

ఇజ్రాయిల్, గాజాలో హింస 'నాటకీయంగా పెరిగే అవకాశం ఉంది' అని ఇంటర్నేషనల్ కమిటీ ఆఫ్ రెడ్ క్రాస్ (ఐసీఆర్‌సీ) మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించింది. బందీలను సురక్షితంగా విడుదల చేయాలని సంస్థ అధ్యక్షుడు పిలుపునిచ్చారు. ఐసీఆర్‌సీ అధ్యక్షులు మిర్జానా స్పోల్జారిక్ అంతర్జాతీయ మానవతా చట్టం ప్రకారం బందీలందరినీ 'తక్షణమే క్షేమంగా విడుదల చేయాలని' ప్రకటనలో పేర్కొన్నారు.

బందీలకు హాని చేస్తే... హమాస్‌ను వదలబోం

గాజాలో బందీలకు ప్రాణహాని జరిగితే హమాస్ దారుణ పరిస్థితిని ఎదుర్కొంటుందని ఇజ్రాయిల్ హెచ్చరించింది. ఇజ్రాయిల్ దళాల ప్రతినిధి రిచర్డ్ మాట్లాడుతూ 'బందీలుగా ఉన్న వారిలో ఒక్క వృద్ధురాలికైనా... ఒక్క పసికందుకైనా వారు హాని చేస్తే... అది హమాస్ పరిస్థితిని మరింత దిగజారుస్తుంది. ఈ విషయం వారికీ తెలుసు' అని హెచ్చరించారు. అంతేకాదు... తాము ఎటువంటి హెచ్చరికలు లేకుండా బాంబింగ్ చేయమని వెల్లడించారు. ఇజ్రాయల్ రక్షణ దళాలు (ఐడీఎఫ్) దాడికి ముందు సోషల్ మీడియాలో పోస్ట్ చేసి లేదా వార్నింగ్ షాట్స్ పేల్చి హెచ్చరికలు జారీ చేస్తుందని అన్నారు. సామాన్య ప్రజలు కూడా ఆ ప్రదేశాల నుంచి వెళ్లిపోవాలని సూచిస్తామన్నారు. గాజాలోని పౌర, ప్రభుత్వ, సైనిక భవనాలను ఇజ్రాయిల్ దళాలు గుర్తించి దాడి చేస్తున్నాయా? అన్న ప్రశ్నకు ఐడీఎఫ్ ప్రతినిధి స్పందిస్తూ... 'అక్కడ ప్రజలు ఉండే భవనాల్లోనే ఆయుధాలు ఉంచడంతో పాటు హమాస్ నాయకులు కూడా దాక్కొంటున్నారు' అని రిచర్డ్ వెల్లడించారు. మరోవైపు, ఇజ్రాయిల్ దళాలు పూర్తి స్థాయిలో గాజాపై నియంత్రణ సాధించే దిశగా అడుగు వేయడంతో హమాస్ హెచ్చరికలు జారీ చేసింది. ఆ సంస్థ ప్రతినిధి అబు ఉబైద మాట్లాడుతూ తాము ఇప్పటి వరకు ఇస్లాం ప్రకారం బందీలను సురక్షితంగా ఉంచామని తెలిపాడు. అయితే ఇజ్రాయిల్ జరిపే ప్రతి ఒక్క బాంబింగ్‌కు ఒక పౌరుడిని హత్య చేస్తామని హెచ్చరించాడు.

కనిపిస్తే కాల్చేయండి: ఇజ్రాయిల్

హమాస్ ఉగ్రవాదులు మళ్లీ దేశంలోకి చొరబడకుండా ఇజ్రాయిల్ కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోంది. సరిహద్దులు దాటేందుకు ఎవరైనా ప్రయత్నిస్తే కాల్చి వేయాలని దళాలను ఆదేశించింది. హమాస్ ఉగ్రవాదులపై ఇజ్రాయిల్ దాడులను మరింత తీవ్రతరం చేసింది. గాజా వెంబడి సరిహద్దులను ఇజ్రాయిల్ సైన్యం దాదాపు తమ అధీనంలోకి తీసుకుంది. అయితే, ఉగ్రవాదుల చొరబాట్లకు ఇంకా ముప్పు పొంచి ఉన్న వేళ... సరిహద్దుల్లోని దళాలకు కీలక ఆదేశాలు అందాయి. గాజా వైపు నుంచి ఎవరైనా సరిహద్దులను దాటే ప్రయత్నం చేస్తే వారిని కాల్చేయాలని చెప్పింది. ఈ మేరకు ఇజ్రాయిల్ రక్షణ దళాలకు 'షూట్ ఆన్ సైట్' ఆదేశాలు జారీ అయ్యాయి. మరోవైపు, గాజాలోని హమాస్ స్థావరాలపై వైమానిక దాడులు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో అక్కడి సామాన్య పౌరులు ఆ ప్రాంతాన్ని విడిచి వెళ్లిపోవాలని ఇజ్రాయిల్ దళాలు సూచించాయి. అయితే, గాజా స్ట్రిప్‌లోని పౌరులు ఈజిప్టుకు వెళ్లాలని ఇజ్రాయిల్ సూచించినట్లు వచ్చిన వార్తలను ఐడీఎఫ్ తిరస్కరించింది.

దిల్లీలో కమ్యూనిస్టుల ప్రదర్శన

(మొదటిపేజీ తరువాయి)

గౌరవనీయమైన పేరు ప్రతిష్ఠలు కలిగిన వారు. గోదీ మీడియాకు చెందిన వారుకాదని చెప్పారు. హోం మంత్రి అమిత్ షా కనుసన్నలో పనిచేసే దిల్లీ పోలీసుల దుర్మార్గ చర్యను అమర్‌జిత్ కౌర్ ఖండించారు. కేంద్రంలో పాలించే బీజేపీ, ఈ పార్టీని నడిపే ఆర్‌ఎస్‌ఎస్ మోసపు రాజకీయాన్ని అనుసరిస్తున్నాయని విమర్శించారు. సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకారత్, ఏఐఎఫ్‌బీ ప్రధాన కార్యదర్శి జి. దేవరాజన్ తదితరులు మాట్లాడారు. ప్రదర్శన సందర్భంగా నిర్వహించిన సభకు సీపీఐ దిల్లీ రాష్ట్ర సమితి తాత్కాలిక కార్యదర్శి శంకర్‌లాల్ అధ్యక్షతవహించారు. సీపీఐ జాతీయ సమితి సభ్యులు కేఎం తివారీ, సీపీఐఎంఎల్ కార్యదర్శి రబీరాయ్, ఆర్‌ఎస్‌పీ కార్యదర్శి ఆర్‌ఎస్ దగ్గర్, ఏఐఎఫ్‌బీ కార్యదర్శి ధర్మేంద్ర కుమార్ వర్మ, సీజీపీఐ నాయకులు బ్రిజూ నాయక్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

క్వాష్ పిటిషన్‌పై వాడీవేడిగా వాదనలు

(మొదటిపేజీ తరువాయి)

ధర్మాసనం ఈనెల 13వ తేదీకి వాయిదా వేసింది. చంద్రబాబు తరపున సుప్రీంకోర్టు న్యాయవాది హరీశ్ సాల్వే, సీఐడీ తరపున ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. రాజకీయ ప్రతీకార చర్యలు లేకుండా ఉండడం కోసం. గత ప్రభుత్వాలపై వేధింపులు లేకుండా ఉండేందుకే చట్టసవరణ జరిగి 17ఏ అమలులోకి వచ్చిందని, దీనిపై కేంద్ర ప్రభుత్వం స్టాండర్ట్ ఆపరేషన్ ప్రొసీజర్‌ను రాష్ట్రాలకు జారీ చేసిందని సాల్వే కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. పబ్లిక్ సర్వెంట్లపై ఆరోపణలు చేయాలంటే తప్పనిసరిగా అధీకృత అధికారి నుంచి సమ్మతి అవసరం. ఉద్యోగులనైనా, ప్రజాప్రతి నిధులైనా ఎలాంటి పద్ధతి అనుసరించాలన్న దానిపై ఎస్‌ఓసీలో పేర్కొన్నారు. ప్రతీకార చర్యలకు పాల్పడిన సందర్భాలు ఉన్నందునే చట్టానికి సవరణ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. 17ఏ ప్రకారం ప్రజాప్రతినిధులపై ఏ తరహా విచారణ చేయాలన్నా పోలీసులు అనుమ తులు పొందాల్సిందేనని హరీశ్ సాల్వే వాదించగా, చంద్రబాబుకు 17ఏ వర్తించదని, ఈ చట్టం అవినీతి చేసిన వారిని రక్షించడానికి కాదని సీఐడీ తరపున ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. ఏఏ కారణాల చేత చంద్రబాబుకి ఈ సెక్షన్ వర్తించదో రోహత్గీ ఉదాహరించారు. తొలుత వాదనలకు విరామమిస్తూ మధ్యాహ్నం 2గంటలకు తిరిగి విచారణ ప్రారంభ మవుతుందని ప్రకటించిన ధర్మాసనం, తర్వాత ఈ రోజు వాదనలు పూర్తయ్యే అవకాశం లేనందున శుక్రవారానికి వాయిదా వేస్తున్నట్లు వెల్లడించింది.

ఇన్నర్ రింగ్‌రోడ్డు కేసులో లోకేశ్‌ను విచారించిన సీఐడీ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో మాజీమంత్రి నారా లోకేశ్‌ను సీఐడీ మంగళవారం సుదీర్ఘంగా ప్రశ్నించింది. అధికారులు చెప్పిన సమయం కంటే ముందే లోకేశ్ తాడేపల్లి సిట్ కార్యాలయానికి చేరుకున్నారు. ఉదయం 10 గంట లకు ప్రారంభమైన విచారణ సాయంత్రం వరకు కొనసాగింది. వాస్తవానికి అక్టోబరు 4నే విచారణకు హాజరు కావాలని లోకేశ్‌కు సీఐడీ నోటీసులు పంపింది. అయితే హైకోర్టు ఆదేశాలతో విచారణ 10వ తేదీకి వాయిదా పడింది. ఇన్నర్‌రింగ్‌రోడ్డు ఎలైన్‌మెంట్ మార్పులకు సంబంధించి జరిగిన ప్రక్రియపై సీఐడీ అధికారులు లోకేశ్‌ను 50 ప్రశ్నలు అడిగారు. వాటన్నింటికీ లోకేశ్ సమాధానమిచ్చారు. అయినప్పటికీ మరింత సమాచారం రాబట్టాల్సి ఉందంటూ బుధవారం మరోసారి విచారణకు రావాలని లోకేశ్‌కు 41ఏ నోటీసులు ఇచ్చారు.

కక్షపూరితమే: లోకేశ్

దాదాపు ఆరున్నర గంటలపాటు ఇన్నర్ రింగ్ రోడ్డుతో సంబంధం లేని 50 ప్రశ్నలు తనను అడిగారని, ఇందులో 49 ప్రశ్నలకు గూగుల్‌లో కొడితే సమాధానాలు వచ్చేవేనని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తెలిపారు. సీఐడీ విచారణ అనంతరం లోకేశ్ మీడియాతో మాట్లాడారు. మీరు ఏం చేస్తుంటారు? హెరిటేజ్‌లో పని చేసినప్పుడు మీ హోదా ఏమిటి? ప్రభుత్వంలో మీరు ఏ బాధ్యతలు నిర్వహించారు? ఇటువంటి ప్రశ్నలు అడిగినట్లు చెప్పారు. తన ముందు ఈ కేసుకి సంబంధించిన ఎలాంటి ఆధారాలు పెట్టలేదని స్పష్టం చేశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ప్రతిపక్షమైనా, ప్రజలనైనా కక్ష సాధించడం అలవాటుగా మారిందన్నారు. పోలవరం ఎందుకు పూర్తి చేయలేదని, యువతకి ఉద్యోగాలు ఎందుకు కల్పించలేదని నిలదీసినందుకే ఆధారాలు లేని కేసులో అక్రమ అరెస్టు చేసి చంద్రబాబుని జైలులో వేశారన్నారు. యువగళం పాదయాత్ర ద్వారా అరాచక సర్కారుపై ప్రజల్ని చైతన్యపరుస్తుంటే తనపైనా తప్పుడు కేసులు బనాయించారని మండిపడ్డారు. తాము ప్రజల్లోకి వెళ్లకుండా అడ్డుకోవడానికే ఈ కేసులని వ్యాఖ్యానించారు. ఇంకేమైనా ప్రశ్నలు ఉన్నా...ఎంత సమయమైనా ఉంటానని చెప్పానని, మళ్లీ రేపు రమ్మని 41ఏ నోటీసు ఇచ్చారని, ఉదయం 10 గంటలకు హాజరవుతానని తెలిపారు.

యదేచ్ఛగా బియ్యం పక్కదారి

(మొదటిపేజీ తరువాయి)

పోషకాలు ఉన్న బియ్యం విలువ గురించి కార్డుదారులు తెలుసుకుంటే వీటి అమ్మకాలు జరగవు. బియ్యం అక్రమ వ్యాపారాన్ని నిరోధించేందుకు కఠిన చర్యల్లో భాగంగా విస్తృతంగా దాడులు చేస్తున్నాం. వ్యాపారలు రేషన్ బియ్యం కొనుగోలు చేయటం ఎంత నేరమో అమ్మటం కూడా అంతే నేరం. అమ్మకాలు చేసే వారిని గుర్తించి వారి కార్డులు రద్దు చేస్తాం. ప్రైవేటు మార్కెట్‌లో విక్రయించే బియ్యం కంటే ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఉచిత బియ్యం మేలైనవి. నాణ్యత, పోషకాలు కలిగి ఉన్నాయి. ఉచితంగా వస్తున్నాయనే చిన్నచూపును ప్రతీ కార్డుదారుడు విడనాడాలి. నాణ్యమైన రేషన్ బియ్యాన్ని కార్డుదారులు ఆరోగ్యపరమైన ఆహారంగా వినియోగిస్తే అక్రమ వ్యాపారం సాగదు. పేదలు ఆర్థికంగా, ఆరోగ్యంగా బాగుంటారు.

పొత్తు ఓకే... సీట్ల సంఖ్య తేలలేదు

(మొదటిపేజీ తరువాయి)

వెల్లడించారు. ఉభయకమ్యూనిస్టు పార్టీలు ప్రతిపాదించిన స్థానాలకు సంబంధించి ఎలాంటి వివాదం లేదని, ఇద్దరిని కలిపి చర్చలు జరిపితే బాగుండేదని అభిప్రాయపడ్డారు. జాతీయస్థాయిలో ఇండియా కూటమిలో కాంగ్రెస్, వామపక్షాలు కలిసే ఉన్నాయని, రాష్ట్రాలలో కొన్ని చోట్ల కలిసి, కొన్ని చోట్ల విభేదించుకుంటున్నామని తెలిపారు. కేరళ, పశ్చిమబెంగాల్‌లో ఇండియా కూటమి భాగస్వాములు వేర్వేరుగా పోటీ చేసినా దేశస్థాయిలో మాత్రం బీజేపీకి వ్యతిరేకంగా ఒక్కటిగా ఉన్నాయని స్పష్టం చేశారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలలో భాగంగా చత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతంలో ఏడు, ఇతర ప్రాంతాలలో ఏడు స్థానాలు కలిపి మొత్తం 14 చోట్ల సీపీఐ పోటీ చేస్తున్నదని, సీపీఎం, సీపీఐ కలిసి 40-45 స్థానాలలో పోటీ చేస్తున్నాయని నారాయణ తెలిపారు. మధ్యప్రదేశ్‌లోనూ సీపీఐ 15, సీపీఎం 14 స్థానాలలో ఉమ్మడిగా పోటీ చేస్తున్నాయన్నారు. రాజస్థాన్‌లో సీపీఐ 14, సీపీఎం 15 స్థానాలలో పోటీ చేస్తున్నాయన్నారు. అక్కడ కాంగ్రెస్‌తో అవగాహన లేదని, తెలంగాణలో మాత్రం రాజకీయ అవగాహన ఉన్నదని నారాయణ వెల్లడించారు.

ఇజ్రాయిల్‌కు భారత్ అండ

న్యూదిల్లీ: హమాస్ మిలిటెంట్లపై ఇజ్రాయిల్ సైన్యం భీకర పోరు కొనసాగిస్తున్న వేళ ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు భారత ప్రధాని నరేంద్రమోదీకి ఫోన్ చేసి మాట్లాడారు. అక్కడి పరిస్థితులను వివరించారు. ఈ సందర్భంగా ఇజ్రాయిల్‌కు అన్ని విధాలా అండగా ఉంటామని ప్రధాని మోదీ హామీ ఇవ్వడంతో పాటు ఉగ్రదాడుల్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. 'ఇజ్రాయిల్ - హమాస్ మధ్య ఘర్షణలు, అక్కడి తాజా పరిస్థితుల గురించి నెతన్యాహు ఫోన్ చేసి తెలియజేశారు. ఈ విపత్కర పరిస్థితుల్లో ఇజ్రాయిల్‌కు యావత్ భారతావని అండగా నిలుస్తుంది. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా సరే.. దాన్ని భారత్ నిస్సందేహంగా, తీవ్రంగా ఖండిస్తుంది' అని మోదీ మంగళవారం 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. ఇజ్రాయిల్‌పై హమాస్ (పలస్తీనా మిలిటెంట్ గ్రూపు) చేసిన మెరుపుదాడిని ప్రధాని మోదీ ఇదివరకే ఖండించిన విషయం తెలిసిందే. హమాస్ దాడి చేసిందన్న విషయం తెలిసిన కొన్ని గంటల్లోనే ఆయన 'ఎక్స్' మాధ్యమంగా స్పందించారు. ఈ దాడి తనను బాధించిందని, ఈ క్లిష్ట సమయంలో తాము ఇజ్రాయిల్‌కి అండగా ఉంటామని తెలిపారు. ఇందుకు ఇజ్రాయిల్ మంత్రి కృతజ్ఞతలు కూడా తెలిపారు. తాజాగా ప్రధాని మోదీ ఇజ్రాయిల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహుతో ఫోన్‌లో మాట్లాడారు. నెతన్యాహు మంగళవారం తనకు ఫోన్ చేశారని.. హమాస్‌తో జరుగుతున్న యుద్ధం గురించి తనతో చర్చించారని ప్రధాని మోదీ తెలిపారు. ఇజ్రాయిల్‌కు భారత్ అన్ని విధాలుగా మద్దతు ఇస్తుందని నెతన్యాహుకు తాను హామీ ఇచ్చానని అన్నారు. అమెరికా, బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ దేశాలు ఇజ్రాయిల్‌కు తమ మద్దతు తెలియజేస్తూ... హమాస్ ఉగ్రవాద చర్యల్ని ఖండిస్తూ ఒక ప్రకటన విడుదల చేసిన క్రమంలో ప్రధాని మోదీకి ఇజ్రాయిల్ ప్రధాని నుంచి ఈ ఫోన్ కాల్ వచ్చింది. ఇజ్రాయిల్‌తో పాటు పలస్తీనాకు భారత్ మిత్రదేశమని... ప్రస్తుత సంక్షోభాన్ని పరిష్కరించడంలో సహాయం చేయడానికి తప్పనిసరిగా ముందుకు రావాలని భారత్‌లోని పలస్తీనా రాయబారి వ్యాఖ్యలు చేసిన క్రమంలో మోదీ, నెతన్యాహు మధ్య జరిగిన ఈ సంభాషణ ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే పలస్తీనా విషయంలో భారత్ నుంచి ఎలాంటి సానుకూల స్పందన లేదు. హమాస్ దాడిని వ్యతిరేకిస్తూ ఇజ్రాయిల్‌కు మద్దతుగా నిలిచింది. కాగా తమ దేశంలోకి చొరబడి మారణహోమం సృష్టించిన హమాస్ మిలిటెంట్లను తుడిచిపెట్టేందుకు ఇజ్రాయిల్ గాజాలోని హమాస్ స్థావరాలపై వైమానిక దాడులు చేస్తోంది. మరోవైపు తమ భూభాగంలోకి చొరబడిన దాదాపు 1500 మంది హమాస్ మిలిటెంట్లను హతమార్చినట్లు ఇజ్రాయిల్ సైన్యం ప్రకటించింది. హమాస్‌తో యుద్ధం నేపథ్యంలో దేశ ప్రజలను ద్దేశించి నెతన్యాహు మాట్లాడారు. తమ దేశంపై దాడి చేసి హమాస్ ఘోర తప్పిదం చేసిందని... అందుకు మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ యుద్ధాన్ని తాము మొదలు పెట్టలేదని... కానీ ముగించేది మాత్రం తామేనని అన్నారు. తమ ప్రతిదాడి హమాస్‌తో పాటు, ఇజ్రాయిల్ శత్రు దేశాలకు దశాబ్దాలపాటు గుర్తుండిపోతుందని నెతన్యాహు హెచ్చరించారు. శనివారం ఉదయం భూమి, జల, వాయు మార్గాల ద్వారా హమాస్ ఒక్కసారిగా దాడి చేయడంతో ఇజ్రాయిల్ సైన్యం ఖంగుతింది. హమాస్ ఈ తరహా దాడులు చేస్తుందని ఆ దేశం ఊహించలేకపోయింది. అయితే.. ఆ వెంటనే తేరుకొని ఎదురు దాడులకు దిగింది. ఇప్పటికే హమాస్ ఉగ్రవాదులు ఆక్రమించిన కొన్ని భూభాగాల్ని తిరిగి స్వాధీనం చేసుకోగలిగింది. అంతేకాదు... హమాస్‌కు ఇదే ఆఖరి యుద్ధం చేయాలన్న ఉద్దేశంతో గాజాపై అన్ని విధాలుగా ఆంక్షలు విధించింది. విద్యుత్, ఆహారం, ఇంధన సరఫరాల్ని నిషేధించింది. లక్ష మంది సైన్యాన్ని రంగంలోకి దింపి.. గాజాని ఆక్రమించాలని ప్రయత్నిస్తోంది.

దసరా ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

అధికారులు సమన్వయంతో ఉత్సవాలను జయప్రదం చేయాలి

దేవాదాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కరికల్‌వలవెన్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఇంద్రకీలాద్రిపై వేంచేసియున్న కనకదుర్గమ్మవారి ఆలయంలో ఈనెల 15వ తేదీ నుంచి 23 వరకు నిర్వహించనున్న దసరా శరన్నవ రాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. మంగళవారం దేవదాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్ కరికల్ వలవెన్, కలెక్టర్ ఎస్ డిల్లీరావు, నగరపోలీస్ కమిషనర్ కాంతి రానా టాటా, ఆలయ ఈవో భ్రమరాంబ... అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా అమ్మవారి దర్శనానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చే భక్తులకు ఇబ్బంది కలగకుండా చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కరికల్ వలవెన్ మాట్లాడుతూ... దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర నలుమూలల నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి ప్రతి రోజు దాదాపు 50 నుండి 60 వేల మంది భక్తులు అమ్మవారి దర్శనానికి వస్తారన్నారు. 20వ తేదీన మూల నక్షత్రం రోజు లక్షా యాభై నుంచి 2 లక్షల మంది భక్తులు అమ్మవారి దర్శనానికి తరలిరానున్నారని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. గత ఏడాది అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాది మరింత పకడ్బందీగా ఉత్సవాలను నిర్వహించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కెనాల్ రోడ్డులోని వినాయకుడి గుడి నుండి, కుమ్మరిపాలెం సెంటర్ హెడ్ వాటర్ వర్క్స్ నుండి క్యూ లైన్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గతంలో కెనాల్ రోడ్డులోని వినాయక గుడి నుండి మోడల్ గెస్ట్ హౌస్ ఎదురుగా కొండ పక్క నుంచి టోల్‌గేట్ మీదుగా ఇంద్రకీలాద్రిపై కి భక్తులు చేరుకునేలా గతంలో క్యూలైన్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇటీవల కొండ చరియలు విరిగిపడినందున ఈసారి క్యూలైన్‌లను మోడల్ గెస్ట్ హౌస్ వద్ద ఎడమ వైపుకు మళ్లించి ఫ్లై ఓవర్ కింద నుండి ఫుట్ ఓవర్ బ్రిడ్జి పై నుండి ఘాట్ రోడ్డు మీదుగా కొండపైకి చేరుకునేలా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అలాగే కుమ్మరిపాలెం నుండి కొండపైకి చేరుకునే క్యూలైన్‌లను కూడా టోల్ గేట్ వద్ద కుడి వైపుకు మళ్లించి ఫుట్ ఓవర్ బ్రిడ్జి పై నుంచి ఘాట్ రోడ్డు మీదుగా క్యూ లైన్‌లో కొండపైకి చేరుకునేలా రెండు ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జిల కింద నుండి కేవలం అత్యవసర వాహనాలు, ఉత్సవ విగ్రహాల ఊరేగింపులను మాత్రమే అనుమతించడం జరుగుతుందని మిగిలిన వాహనాలు ఫ్లై ఓవర్ మీదగా కుమ్మరిపాలెం వైపు నుండి గాలి గోపురం ఘాట్ రోడ్డు మీదుగా కొండ పైకి చేరుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సుమారు గంట నుండి గంటన్నర లోపు భక్తులు అమ్మవారి దర్శనం పూర్తి చేసుకునేలా అధికారులు తగు ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా క్యూలైన్‌లలో ప్రత్యేక దర్శన టికెట్ల విక్రయం కల్పిస్తున్నామని, క్యూలైన్‌లలో తాగునీటి సరఫరాకు 30 లక్షల వాటర్ ప్యాకెట్లను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. క్యూలైన్‌లలోని చిన్నారులకు బిస్కెట్లు, పాలను అందించేలా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. భక్తుల సౌకర్యార్థం ఎప్పటికప్పుడు ప్రసాదాలు అందుబాటులో ఉండేలా 12 ప్రసాదం కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కొండ దిగువన కనకదుర్గ నగర్‌లో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తున్నామని... భక్తులు పుణ్య స్నానాలను అంచరించేందుకు సీతమ్మవారి పాదాలు, దోభిఘాట్, పున్నమి ఘాట్, భవానీ ఘాట్, దుర్గా ఘాట్ జల్లు స్నానా ఘట్టాలు ఏర్పాటు చేయడంతో పాటు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక రూమ్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. భక్తుల తలనీలాలు సమర్పించుకునేందుకు 250 మంది నాయి బ్రాహ్మణులతో ప్రత్యేక కేశఖండనశాలను ఏర్పాటు చేస్తున్నామని... కొండపైన, దిగువున, ఘాట్ల వద్ద వైద్య ఆరోగ్య శాఖ ద్వారా 15 మెడికల్ క్యాంపులు నెలకొల్పుతున్నట్లు తెలిపారు. అన్ని ఘాట్‌ల వద్ద గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయనున్నామని... 1500 మంది పారిశుధ్య కార్మికులను నియమించి ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మోడల్ గెస్ట్ హౌస్ వద్ద కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, దేవాదాయ, తదితర శాఖల అధికారులతో నిరంతరం పర్యవేక్షించి ఎప్పటికప్పుడు తగు సూచనలు జారీ చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

నైపుణ్యాభివృద్ధి కేంద్రాల ఆధునికీకరణ

16న విశాఖలో శ్రీకారం చుట్టనున్న సీఎం జగన్

విశాలాంధ్రబ్యూరో-అమరావతి: నైపుణ్యాభివృద్ధి శిక్షణను కొత్త పుంతలు తొక్కించేలా, యువత ఉపాధికి మరిన్ని బాటలు వేసేలా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వివిధ కార్యక్రమాలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈనెల 16న విశాఖపట్నంలో శ్రీకారం చుట్టనున్నారు. వంద కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టనున్న నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాల ఆధునికీకరణ పనులను ప్రారంభించటంతో పాటు, వివిధ వృత్తులలో శిక్షణ పూర్తి చేసుకున్న దాదాపు 5 వేల మంది అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాలను సీఎం అందజేస్తారు. నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలకు సంబంధించి స్కిల్ యూనివర్స్ ఒక ఏకీకృత పరిష్కార వేదికగా ఉంటుందని నైపుణ్యాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాల ఆధునికీకరణ, యువతకు మరింత మెరుగైన శిక్షణ కార్యక్రమాల నిర్వహణ కోసం వివిధ భారీ పరిశ్రమలు, ఏపీ స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఈ సందర్భంగా అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోనున్నాయి. వాటితో పాటుగా, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ రూపొందించిన 'స్కిల్ యూనివర్స్' ప్రత్యేక వెబ్ సైట్, మొబైల్ యాప్ లను సీఎం ఆవిష్కరిస్తారు. నైపుణ్య శిక్షణ తీసుకోదలచిన వారితో పాటు శిక్షణ పూర్తి చేసుకుని ఉద్యోగ అవకాశం కోసం చూస్తున్నవారంతా ఈ స్కిల్ యూనివర్స్ లో తమ వివరాలు నమోదు చేసుకోవచ్చు. ఉద్యోగ అవకాశాలు కల్పించే సంస్థలు కూడా ఈ యాప్ లో తమ వివరాలు నమోదు చేసుకునే వెసులుబాటు తొలిసారి కల్పిస్తున్నారు. రానున్న రోజులలో ఈ యాప్ ను భారత ప్రభుత్వ స్కిల్ ఇండియా తదితర వెబ్ సైట్లతో అనుసంధానిస్తారు. నైపుణ్య శిక్షణ కార్యక్రమాల నిర్వహణలో 2004 నుంచి దేశంలో అగ్రగామి రాష్ట్రంగా ఉన్న ఆంధ్రప్రదేశ్, 2019 జూన్-2023 సెప్టెంబర్ మధ్య కాలంలో 14,26,515 మంది అభ్యర్థులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చింది. వారిలో 3,40,816 మంది వివిధ కంపెనీలలో ఉపాధి పొందారు.

మత్స్యకారులను దెబ్బతీస్తున్న పాలకులు

రామాంజనేయులు విమర్శ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సముద్రతీర ప్రాంతాల్లో చేపలు పట్టి జీవనం సాగిస్తున్న మత్స్యకార్మికుల ఉపాధిని దెబ్బతీసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై ఐక్యంగా ఉద్యమించాలని ఆంధ్రప్రదేశ్ చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు పిలుపునిచ్చారు. విజయవాడ దాసరి భవన్‌లో మంగళవారం జరిగిన ఆంధ్రప్రదేశ్ మత్స్య కార్మికసంఘం రాష్ట్ర సమితి సమావేశంలో ఆయన ప్రసంగించారు. మత్స్య కార్మికసంఘం రాష్ట్ర కన్వీనర్ పి. నాగాంజనేయులు అధ్యక్షత వహించారు. రామాంజనేయులు మాట్లాడుతూ మరబోట్లు, టాకులను ఉపయోగించి సముద్రంలో చేపలు పట్టడం ద్వారా మత్స్యసంపదను కొల్లగొట్టేందుకు కార్పొరేట్ సంస్థలకు అనుమతినిస్తూ మోదీ సర్కారు మత్స్యకారుల జీవనాన్ని దెబ్బతీస్తోందని విమర్శించారు. సముద్ర తీర ప్రాంతం నుంచి మత్స్యకారులను వెళ్లగొ ట్టేందుకు నిస్సిగ్గుగా ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. తరతరాలుగా చేపలవేట జీవనాధారంగా బతుకుతున్న మత్స్యకారుల ఉపాధిని దెబ్బతీసేలా వ్యవహరిస్తోందన్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వం నదీతీరంలో చేపలు పట్టడానికి ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశ పెట్టడం వల్ల అక్షరం ముక్కరాని మత్స్యకారుడు ఇబ్బందులకు గురవుతున్నాడని చెప్పారు. ధనవంతులు మాత్రమే వేలాన్ని దక్కించుకుంటున్నారని, దీనివల్ల వేటపై ఆధారపడిన మత్స్యకారులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న మత్స్యకారుల వ్యతిరేక విధానాలపై సంఘ టితంగా పోరాటం చేయడం ద్వారా హక్కులను కాపాడుకోవాలన్నారు.

విశాఖలో రాష్ట్ర మహాసభలు

ఈ ఏడాది డిసెంబర్ 22, 23 తేదీల్లో విశాఖపట్నం నగరంలో రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్లు మత్స్య కార్మికసంఘం కన్వీనర్ పి.నాగాంజనేయులు చెప్పారు. రాష్ట్ర మహాసభలకు ముందు అన్ని జిల్లా మహాసభలు నిర్వహించుకోవాలని కోరారు. సమావేశంలో చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొట్టుముక్కల బాలాజీ, మత్స్య కార్మికసంఘం నాయకులు జి.లక్ష్మణరావు, కె. రంగనాథ్, విజయ్ కుమార్, నాగభూషణం, కాశిబాబు పాల్గొన్నారు.

బస్సు యాత్ర విజయవంతం చేయాలి

ముగ్గురు నేతలకు బాధ్యతలు

ప్రాంతీయ సమన్వయకర్తల భేటీలో సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : దసరా పండుగ తర్వాత ఈనెల 26 నుంచి పార్టీ చేపట్టనున్న బస్సు యాత్ర విజయవంతానికి సన్నద్ధం కావాలని వైసీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఈ సమావేశాలు జరగాలని, రాష్ట్రంలోని మూడు ప్రాంతాల నుంచి ప్రతి రోజూ ఒక సభ చొప్పున మొత్తంగా మూడు సభలు నిర్వహించాలని పార్టీ నేతలకు సీఎం దిశానిర్దేశం చేశారు. తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో మంగళవారం వైసీపీ ప్రాంతీయ సమన్వయకర్తలతో సీఎం సమావేశం నిర్వహించారు. ఇది అత్యంత ముఖ్యమైన కార్యక్రమమని, దీనిని విజయవంతంగా జరిగేలా చూడాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే లేదా పార్టీ ఇన్‌ఛార్జి సహా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన నాయకులు ఈ సమావేశాల్లో మాట్లాడాలని సూచించారు. తమ ప్రభుత్వ 52 నెలల పరిపాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, నిరుపేద వర్గాలకు చేసిన మేలును ఈ సభల ద్వారా వివరించి ఆయా వర్గాలకు మరింత చేరువ కావాలని సూచించారు. వచ్చే ఎన్నికలు పేదవాడికి, పెత్తందారులకు మధ్య జరుగుతున్న యుద్ధం అని, కులాల వార్ కాదని, ఇది క్లాస్ వార్ అని స్పష్టం చేశారు. పేదవాడు మన పార్టీని సొంతం చేసుకోవాలని, వచ్చే రెండు నెలలపాటు ఈ బస్సు యాత్ర జరగాలన్నారు. నియోజకవర్గాల వారీగా సమావేశాలపై తేదీ, స్థలం సహా పక్కా ప్రణాళిక తయారు చేసుకోవాలని, సామాజిక న్యాయం, మహిళా సాధికారిత, పేదలకు, పెత్తందార్లకు మధ్య జరుగుతున్న యుద్ధం అంశాలను ప్రస్తావిస్తూ ఈ బస్సు యాత్ర కొనసాగాలని చెప్పారు. విజయవాడలో జరిగిన వైసీపీ మండల పార్టీ ప్రతినిధులు సమావేశంలో ప్రకటించిన కార్యక్రమాలపై నియోజకవర్గాల స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా జరిగే అవగాహన సమావేశంలో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వార్డు మెంబర్లు, ఎంపీటీసీలు, సర్పంచులు, వలంటీర్లు ఈ సమావేశాలకు హాజరయ్యేలా చూడాలని చెప్పారు. బస్సు యాత్ర సభల ఏర్పాట్లను సమన్వయ పరచడానికి ముగ్గురు పార్టీ నాయకులను నియమించినట్లు సీఎం వెల్లడించారు. జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను ప్రాంతీయ సమన్వయకర్తలు సందర్శించాలని, ఎమ్మెల్యేలతో కలిసి, ఈ కార్యక్రమం సమర్థవంతంగా జరిగేలా చూడాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ సమన్వయకర్తలు, పార్టీ నేతలు విజయసాయిరెడ్డి, పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, ఆళ్ల ఆయోధ్య రామిరెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బొత్స సత్యనారాయణ, చెవిరెడ్డి భాస్కరరెడ్డి, మర్రి రాజశేఖర్, ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డి, రామసుబ్బారెడ్డి, తలశిల రఘురామ్, లేళ్ల అప్పిరెడ్డి పాల్గొన్నారు.

రేపు సామర్లకోటకు సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 12 వ తేదీన కాకినాడ జిల్లా సామర్లకోటలో పర్యటించనున్నారు. జగనన్న కాలనీలో సామూహిక గృహప్రవేశాలను ప్రారంభించి... అనంతరం బహిరంగ సభలో ప్రసంగిస్తారు. సీఎం ఉదయం 9 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి హెలీకాప్టర్‌లో బయలుదేరి సామర్లకోటకు చేరుకుంటారు. కార్యక్రమాల అనంతరం మధ్యాహ్నం తాడేపల్లికి చేరుకుంటారు.

సమగ్ర దర్యాప్తుతోనే చంద్రబాబు అరెస్ట్

మంత్రి అంబటి రాంబాబు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: సమగ్ర దర్యాప్తుతోనే టీడీపీ అధినేత చంద్రబాబును ఏపీ స్కిల్ కుంభకోణం కేసులో సీఐడీ అరెస్టు చేసిందని, ఇందులో ఎలాంటి కక్షసాధింపు లేదని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు స్పష్టం చేశారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం మంత్రి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చట్టంలోని లొసుగులను అడ్డుపెట్టుకొని చంద్రబాబు తప్పించుకోవాలని చూస్తున్నారని అంబటి రాంబాబు మండిపడ్డారు. న్యాయస్థానాల్లో విచారణ దాకా వెళ్తే చంద్రబాబు దొరికిపోతాడని, ఆయన ఏనాడూ విచారణకు నిలబడిన దాఖలాలు లేవని నొక్కిచెప్పారు. ఎన్ని కోర్టులు తిరిగినా బెయిల్, క్వాష్ రాలేదంటే కేసులో బలముందనే అర్థమని స్పష్టం చేశారు. స్కిల్ కుంభకోణంలో చంద్రబాబు రిమాండ్‌కు వెళ్లిన క్షణం నుంచి టీడీపీ, వారి అనుచరుల వాదనలు చూస్తుంటే ఆశ్చర్యం వేస్తోందన్నారు. ఈ కుంభకోణం బయటకు వచ్చినప్పటి నుంచీ చంద్రబాబు నేరస్థుడు కాదని ఆయన న్యాయవాదులు మాత్రం వాదించడం లేదని, పీసీ యాక్ట్ 17ఏ ప్రకారం అరెస్టు జరగలేదంటున్నారని ఎద్దేవా చేశారు. విచారణ జరిగితే బండారం బయటపడుతుందనే భయంతో ముందుకు రావడం లేదని, ఏసీబీ కోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకూ అదే వాదన చేస్తున్నారని చెప్పారు. లోకేశ్‌కు మంత్రి పదవి ఇస్తే రింగ్ రోడ్ కుంభకోణంలో ఇరుక్కున్నాడని దుయ్యబట్టారు. మరిదిని కాపాడుకునేందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి తాపత్రయం పడుతున్నారని విమర్శించారు.

కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి

ఆశా వర్కర్స్ యూనియన్ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎన్ఆర్ హెచ్ ఎం స్కీం కింద పని చేయు ఆరోగ్య కార్యకర్తలు ఆశా వర్కర్లకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని కోరుతూ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్ శాంతి ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎస్ వెంకటసుబ్బయ్య, శ్రామిక మహిళా ఫోరం రాష్ట్ర కార్యదర్శి కె. శైలజ మంగళవారం డైరెక్టర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ రాష్ట్ర అధికారి నివాస్, డాక్టర్ మంజుల, డి హౌస్ మనీని కల్సి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు ఆశా కార్యకర్తలు రాష్ట్రంలో ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి న్యాయం చేయాలని కోరారు. ముఖ్యంగా ధరలకు అనుగుణంగా వేతనం పెంచాలని, కుష్ఠు, టీబీ బకాయిలు తక్షణమే చెల్లించాలని, రికార్డులు ప్రభుత్వమే సరఫరా చేయాలని, నాణ్యమైన యూనిఫామ్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఆశా కార్యకర్తలకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, పని ఒత్తిడి తగ్గించాలని, కొన్ని యాప్‌లను రద్దు చేయాలని కోరారు. ప్రభుత్వ సర్వేల అంశంలో ఆశ కార్యకర్తలను మానసిక వేదన గురి చేస్తున్నారని వారి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ఆశా వర్కర్లను మెడికల్ ఉద్యోగులుగా గుర్తించాలని, ఆశాలకు పది లక్షల ఉచిత బీమా ఇవ్వాలని, వారికిచ్చిన సెల్ ఫోన్లు 2జీ నుంచి 5జికి మార్చాలని, పదవీవిరమణ వయస్సు 60 సంవత్సరాల నుంచి 62 కు పెంచాలన్న డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.

నిరుద్యోగుల సంఖ్యపై శ్వేతపత్రం

లెనిన్‌బాబు డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టులపై రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టత లేకపోవడం సిగ్గుచేటని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కి లెనిన్‌బాబు విమర్శిం చారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టుల వివరాలను వలంటీర్ల ద్వారా సేకరించి...శ్వేతపత్రం విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కర్నూలు జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసులు అధ్యక్షతన స్థానిక సీఆర్ భవన్‌లో ఏఐవైఎఫ్ కర్నూలు జిల్లా సమితి సమావేశం, సీపీఐ జిల్లా కార్యాలయంలో జరిగిన ఏఐవైఎఫ్ నంద్యాల జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజి కార్యాలయాల్లో నిరుద్యోగుల వివరాలు ఉంటాయని, ఆ సమాచారం రాష్ట్ర ప్రభుత్వం సేకరించినట్లు కనిపించడం లేదని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుండి రాష్ట్రంలో కొత్తగా ఒక్క పరిశ్రమను ఏర్పాటు చేయలేదని, దీంతో నిరుద్యోగ యువకులు ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లవలసిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జాబ్ మేళాలు ప్రచార ఆర్భాటాలకే పరిమితమయ్యాయన్నారు. జాబ్ మేళా పేరుతో బోగస్ కంపెనీలు వచ్చాయని, నిరుద్యోగుల నుంచి రూ.5 వేలు-రూ.10 వేలు వసూలు చేసి ఉడాయించాయని లెనిన్‌బాబు గుర్తుచేశారు. గ్రూప్-1, 2 ఉద్యోగాల సంఖ్య పెంచి నోటిఫికేషన్ విడుదల చేయాలని, తక్షణమే మెగా డీఎస్సీ నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించేంత వరకూ ఉద్యమాలు సాగిస్తామని, అందుకు ఏఐవైఎఫ్ నాయకత్వం వహిస్తుందని చెప్పారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య మాట్లాడుతూ తనపై గల అవినీతి కేసుల నుంచి బయటపడటానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాష్ట్ర ప్రయోజనాలను బీజేపీకి తాకట్టు పెట్టారని విమర్శించారు. తెలంగాణలో రాజకీయ లబ్ధి కోసం మోదీ సర్కారు తాజాగా కృష్ణా జలాల పున:పంపిణీ అంశాలను తెరపైకి తీసుకొచ్చిందని మండిపడ్డారు. జిల్లాలో సరైన సాగునీటి ప్రాజెక్టులు లేక ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయని, ఫలితంగా పంటలు ఎండిపోయాయన్నారు. కరువు విలయతాండవం చేస్తున్నా జిల్లాకు చెందిన 14 మంది వైసీపీ ఎమ్మెల్యేలు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. కర్నూలును కరువు జిల్లాగా ప్రకటించడంతో పాటు బ్యాంకుల ద్వారా రైతులకు రుణాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. లేకపోతే పాలకులపై ఒత్తిడి తెచ్చేందుకు దశలవారీ ఉద్యమాలకు యువత కూడా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు జిల్లా కార్యదర్శి కారుమంచి, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న, షాబీర్ భాషా, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజీవ్, జిల్లా సహాయ కార్యదర్శి బిసన్న, జిల్లా సమితి సభ్యులు రమేశ్, రాజు, బాబయ్య, అనిమేషు, పెద్దయ్య, చంటి, జాఫర్, వినోద్, చిరంజీవి, రామాంజనేయులు, దస్తగిరి, శరత్ కుమార్, మునిస్వామి, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు. నంద్యాలలో జరిగిన సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, కార్యవర్గసభ్యులు సుంకన్న, ధనుంజయుడు, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నాగరాముడు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం తొలగింపునకు బ్రేక్

విచారణ లేకుండా ఎలా తొలగిస్తారు: హైకోర్టు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: బాపట్లలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం తొలగింపు వివాదాస్పదమైంది. నాలుగు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ప్రభుత్వం అక్రమంగా తొలగిస్తుందంటూ బాపట్ల జిల్లా జై భీమ్ నేత గురిందపల్లి సిద్ధార్థ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రోడ్ల ఆక్రమణ తొలగింపు అంటూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించటం అక్రమమని, ప్రభుత్వం ఏ నిబంధన పాటించకుండా తొలగిస్తుందని పిటిషన్‌లో పేర్కొన్నారు. పిటిషనర్ తరఫున ప్రముఖ న్యాయవాది జడ శ్రవణ్‌కుమార్ వాదనలు వినిపించారు. జీవో నంబర్ 53లో పొందుపరిచిన ఏ అంశాన్ని పాటించకుండా రాజ్యాంగ నిర్మాత విగ్రహాన్ని తొలగించడం చట్టవిరుద్ధమని వాదించారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులు పాటించకుండా విగ్రహాన్ని తొలగించడం సరికాదని శ్రావణ్ కుమార్ తెలిపారు. విచారణ జరపకుండా విగ్రహాన్ని ఎలా తొలగిస్తారని హైకోర్టు న్యాయమూర్తి ప్రశ్నించారు. విగ్రహాన్ని తొలగించకుండా రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం తాత్కాలిక ఉత్తర్వులు ఇచ్చింది. విచారణ గురువారానికి వాయిదా వేసింది. రికార్డులు తమ ముందు ఉంచాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది.

బీసీల ద్రోహి జగన్

ఏపీ హేట్స్ జగన్ అంటున్న జనం: అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: బీసీల నోరునొక్కడమే జగన్ రెడ్డి లక్ష్యమా అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజారపు అచ్చెన్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులుపై వరుస కేసులు బనాయించిన బీసీ ద్రోహి జగన్ రెడ్డి అని మండిపడ్డారు. బడుగు బలహీనవర్గాలపై అరాచకం సృష్టిస్తున్న జగన్‌రెడ్డిని ప్రశ్నిస్తున్నందుకు కాల్వ శ్రీనివాసులుపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని అన్నారు. వరుస కేసులు నమోదు చేస్తూ వేధింపులకు గురిచేస్తున్నారని, ఇది జగన్ పెత్తందారీ మనస్తత్వానికి నిదర్శన మని ఆరోపించారు. చంద్రబాబు అక్రమ అరెస్టుపై నిరసన తెలిపినందుకు అక్రమ కేసు పెట్టడం హేయమన్నారు. అన్ని కేసుల్లోనూ కాలవనే మొదటి ముద్దాయిగా పోలీసులు చేర్చారన్నారు. శాంతియుత నిరసనలపై పోలీసులు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారన్నారు. రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలను రెండు గంటల పాటు ట్రాఫిక్ జామ్ చేసి...చిందులేసిన వైసీపీపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. చట్టం అందరికీ సమానమైనప్పుడు ప్రతిపక్ష నాయకులపైనే కేసులెందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. ఆదివారం అర్ధరాత్రి రాయదుర్గం ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఉన్న టీడీపీ దీక్షా శిబిరాన్ని బలవంతంగా ఖాళీ చేయించా రన్నారు. ప్రతిపక్ష పార్టీలు ఎటువంటి కార్యక్రమానికి పిలుపునిచ్చినా వెంటనే నోటీసులు ఇవ్వడం పోలీసులకు పరిపాటిగా మారిందన్నారు. చట్టాన్ని జగన్ రెడ్డి చుట్టంలా వాడుకుంటూ కొంతమంది పోలీసులను వైసీపీ ప్రైవేటు సైన్యంలా మార్చుకొని అరాచకానికి పాల్పడుతున్నారని విమర్శించారు. జగన్ నిరంకుశ పాలనకు చరమగీతం పాడే తరుణం ఆసన్నమైందన్నారు. ఏపీ నీడ్స్ జగన్ కాదు... ఏపీ హేట్స్ జగన్ అని ప్రజలు పిలుపునిస్తున్నారన్నారు.

జాగిలాల సేవలు అపూర్వం

మంత్రి తానేటి వనిత

అబ్బురపరిచిన జాగిలాల సాహస విన్యాసాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సమాజంలో పెరుగు తున్న నేరాలకు అనుగుణంగా నేర పరిశోధనకు, నియం త్రణకు, తీవ్రవాద చర్యలను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి, ప్రముఖుల భద్రతకు అవసరమైన శిక్షణను జాగిలాలకు ఇవ్వడం సంతోషకరమని, వాటి సేవలు వినియోగించు కోవాలని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి తానేటి వనిత సూచించారు. మంగళవారం మంగళగిరి ఆరో బెటాలియన్ ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్‌లోని కెనైన్ ట్రైనింగ్ సెంటర్‌లో ఎనిమిది నెలల ప్రత్యేక శిక్షణ పూర్తిచేసుకున్న పాసింగ్ అవుట్ పెరేడ్‌లో 21వ బ్యాచ్‌కి చెందిన డాగ్ స్క్వాడ్(కెనైన్)తో ప్రదర్శన నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా మంత్రి వనిత హాజరై తిలకించారు. జర్మనీ షెఫర్డ్ ఇంగ్లీష్ కాకర్ స్పానియల్, గోల్డెన్ రిట్రైవర్, లాబ్రాడర్, బెల్జియన్ మెలినాయిస్ వంటి ఐదు జాతుల జాగిలాల విన్యాసాలను, పోలీసుల బిట్ పెరేడ్ మార్చ్‌ఫాస్ట్‌ను మంత్రి ఆసక్తిగా వీక్షించారు. అత్యంత శ్రమకోర్చి ఒక మామూలు జాగిలాన్ని పోలీసు జాగిలంగా తీర్చిదిద్ది సమాజసేవకు వాటిని అంకితం చేసిన పోలీసు అధికారుల కృషిని కొనియాడారు. రాష్ట్ర విభజనానంతరం ప్రతికూల పరిస్థితుల మధ్య రాష్ట్రంలో పోలీసు జాగిలాలకు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసి పోలీసు వ్యవస్థ అవసరాలకు అనుగుణంగా జాగిలాలకు శిక్షణ ఇచ్చి, విధులకు సన్నద్ధం చేస్తున్న సంబంధిత అధికారులను మంత్రి బహుమతులు, జ్ఞాపికలతో సత్కరించారు. జాగిలాల సేవలను సమర్థవంతంగా వినియోగించుకుంటూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. పోలీస్‌శాఖలో అనేక విభాగాలతో పాటు డాగ్ స్క్వాడ్ (కెనైన్) పాత్ర అత్యంత కీలకమైందని చెప్పారు. నేర విచారణలో, నేరస్తుల జాడ పసిగట్టే ప్రక్రియలో, మత్తు, పేలుడు పదార్థాలు గుర్తించడంలో, శాంతి భద్రతల పరిరక్షణలో జాగిలాల పాత్ర ప్రశంసనీయమన్నారు. కొత్తగా ఏర్పాటైన జిల్లాల అవసరాలకు అనుగుణంగా మరిన్ని జాగిలాలకు శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. అందుకనుగుణంగా ట్రైనింగ్ సెంటర్లను అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. 21వ బ్యాచ్‌లో రాష్ట్ర పోలీసు వ్యవస్థలోని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అవసరాలకు అనుగుణంగా తొలిసారిగా ఏడు జాగిలాలకు నార్కోటిక్ విభాగంలో శిక్షణ ఇచ్చామని వివరించారు. మరో 10 జాగిలాలకు ప్రమాదకరమైన నార్కోటిక్ పదార్థాలు గుర్తించడంలో శిక్షణ ఇచ్చామన్నారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా అసాల్ట్ డాగ్స్, రెడ్ సాండల్ డిటెక్షన్ డాగ్స్‌కు శిక్షణ ఇచ్చిన ఘనత కెనైన్ ట్రైనింగ్ సెంటర్, ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్‌కు దక్కుతుందని చెప్పారు. కార్యక్రమంలో హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హరీశ్‌కుమార్ గుప్తా, ఇంటెలిజెన్స్ డీజీపీ పీఎస్ఆర్ ఆంజనేయులు, అగ్నిమాపకశాఖ డీజీపీ పీవీ సునీల్‌కుమార్, ఏపీఎస్పీ అదనపు డీజీపీ అతుల్‌సింగ్, ఎస్ఐబీ ఐజీపీ వినీత్ బ్రిజ్‌లాల్, ఇంటెలిజెన్స్ డీఐజీ కె.రఘురామ్ రెడ్డి, ఏపీఎస్పీ డీఐజీ రాజకుమారి, ఏపీఎస్పీ డీఐజీ వెంకటేశ్వర్లు, స్పెషల్ సెక్యూరిటీ గ్రూప్ ఎస్పీ ఎ.బాపూజీ, ఏసీబీ ఎస్పీ అద్నాన్ అస్మి, ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్, ఎస్ఐబీ ఎస్పీ సుమిత్ సునీల్ గార్గ్, ఆరో బెటాలియన్ కమాండర్ సుబ్బారెడ్డి, పీటీవో ఎస్పీ శివారెడ్డి, ఐఎస్‌డబ్ల్యూ ఇంటెలిజెన్స్ అధికారులు, కుటుంబ సభ్యులు, పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

సంపాదకీయం

చేజారిన కలికి తురాయి

రాజ్య వ్యవస్థ పని తీరులో రాజ్యాంగం నిర్దేశించిన అధికారాల విభజన సూత్రాన్ని పాటించకపోతే ఎంతటి ప్రతిభావంతులు, సమర్థులు అయినా అత్యున్నత న్యాయస్థానం మెట్లెక్కకపోవచ్చు. ఆ మేరకు ఆణిముత్యాలు చేజారుతాయి. ఒరిస్సా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా దాదాపు ఒక నెలకింద పదవీ విరమణ చేసిన మురళీధర్ విషయంలో సరిగ్గా అదే జరిగింది. 2020 ఫిబ్రవరి 23న దిల్లీలో మత కలహాలు జరిగినప్పుడు మత కలహాలు జరుగుతున్న ప్రాంతంలో ఒక ఆసుపత్రి దగ్గర కొందరు రోగులను అక్కడి నుంచి సురక్షితంగా పంపించాలని అప్పుడు దిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న మురళీధర్ రాత్రి తన ఇంట్లోనే కోర్టు నిర్వహించి ఆదేశించారు. ఆయనకు ఉన్న న్యాయ పరిజ్ఞానం అపారమైంది. ఆయనకు సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పనిచేయడానికి అవకాశం వచ్చి ఉంటే న్యాయవ్యవస్థ కీర్తి కిరీటంలో మరో కలికితురాయి చేరేది. కానీ దిల్లీ మతకలహాల సమయంలో ఆయన జారీచేసిన రెండు ఉత్తర్వులూ కేంద్ర ప్రభుత్వాధినేతలకు నచ్చలేదు. ఆయన దిల్లీ మతకలహాల సందర్భంలో జారీచేసిన మరో ఉత్తర్వు ప్రభుత్వాధినేతలకు నచ్చలేదు. ఆ రెండు ఉత్తర్వులు జారీచేసిన రోజే ఆయనను పంజాబ్, హర్యానా హైకోర్టుకు బదిలీ చేశారు. అక్కడి నుంచి సువర్ణాక్షరాలతో లిఖించదగిన మద్రాస్ హైకోర్టుకు పంపించాలనుకున్నారు. అదీ కేంద్ర ప్రభుత్వం కుదరనివ్వలేదు. చివరకు ఒరిస్సా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించారు. ఆ హైకోర్టుకు అంత ఘనచరిత్రలేదు. దిల్లీ మతకలహాలు జరగడానికి ముందు బీజేపీ నాయకులు అనురాగ్ ఠాకూర్, ప్రవేశ్ వర్మ, కపిల్ మిశ్రా తమ ఉపన్యాసాల ద్వారా జనాన్ని రెచ్చగొట్టారు. "దేశ్ కే గద్దారోంకో..." అని అనురాగ్ ఠాకూర్ అంటే కిందనుంచి జనం "గోలీ మారో....."అని బదులిచ్చారు. రెచ్చగొట్టే ఈ తతంగం రెండు మూడుసార్లు జరిగింది. అలాంటి వ్యక్తిని బీజేపీ అధినాయకత్వం కేంద్ర మంత్రివర్గంలో చేర్చుకుని తాము ఆ రెచ్చగొట్టే ఉపన్యాసాలను సమర్థిస్తున్నామని నిస్సిగ్గుగా నిరూపించుకుంది. అప్పుడే దిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న మురళీధర్ వీరి మీద 24 గంటల్లోగా ఎఫ్.ఐ.ఆర్. నమోదు చేయడం గురించి నిర్ణయం తీసుకోవాలని ఆదేశం జారీచేశారు. ఇలాంటి రెచ్చగొట్టే ప్రసంగాలు చేసినట్టు తనకు తెలియదని ఆ పోలీసు అధికారి అన్నప్పుడు వాటికి సంబంధించిన వీడియోలను కోర్టులోనే చూపించాలని న్యాయమూర్తి మురళీధర్ సిబ్బందిని ఆదేశించారు. దిల్లీ పోలీసులు నేరుగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా కింద పనిచేస్తారన్న విషయం మరిచిపోకూడదు. ఈ విషయంలో కచ్చితమైన ఆదేశాలు జారీచేయడం కేంద్ర ప్రభుత్వ అధికారులకు నచ్చకపోవడంలో ఆశ్చర్యంలేదు. అందుకే రాత్రికి రాత్రి ఆయనను పంజాబ్, హర్యానా హైకోర్టుకు బదిలీ చేశారు.

కథ అక్కడితో ముగియలేదు. న్యాయమూర్తి మురళీధర్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమించాలని కొలీజియం చేసిన సిఫార్సును కేంద్ర ప్రభుత్వం ఆమోదించలేదు. ప్రస్తుత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి చంద్ర చూడ్ ప్రజాస్వామ్య పరిరక్షణా యత్నాలలో ఆఖరి కాంతిరేఖ అని పొగుడుతున్నారు. ఆయన నిఖార్సైన వ్యక్తిగా నిలబడుతున్నారన్న విషయంలో అనుమానంలేదు. కానీ మురళీధర్ ను సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా కొలీజియం ప్రతిపాదించినప్పుడు అందులో చంద్రచూడ్ కూడా సభ్యుడే. ఆ తరవాత స్వల్పకాలంలోనే ఆయన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అయ్యారు. కొలీజియంకు నాయకత్వం వహించేది ఆయనే. కానీ అంతటి రుజువర్తనుడు మళ్లీ న్యాయమూర్తి మురళీధర్ పేరును రెండవసారి ప్రతిపాదించలేదు. ఆయనకు ఆ అవకాశంఉన్నా వినియోగించుకోకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. అదే సందర్భంలో ప్రస్తుతం మన న్యాయకోవిదుల్లో అగ్రభాగాన నిలిచే ప్రసిద్ధ న్యాయవాది ఫాలీ నారిమన్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి మదన్ లోకూర్, శ్రీరాం పంచూ కలిసి ఒక పత్రికలో వ్యాసంరాసి చంద్రచూడ్‌ను ఇదే అంశంపై నిలదీశారు. తాము సిఫార్సు చేసిన పేర్లను ప్రభుత్వం అంగీకరించనప్పుడు అదే పేరును రెండవసారి సిఫార్సుచేస్తే ప్రభుత్వం ఆమోదించక తప్పదు. అదీ ఇప్పుడు అమలులో ఉన్న కొలీజియం విధానం. దీన్ని మార్చడానికి మోదీ అధికారంలోకి వచ్చిన తరవాత న్యాయమూర్తుల నియామకానికి ఒక చట్టం కూడా చేశారు. ఆ చట్టాన్ని సుప్రీంకోర్టు కొట్టేసింది. ఇటివలి కాలంలో బాధ్యతాయుతమైన ఉపరాష్ట్రపతి పదవిలో ఉన్న జగదీప్ ధన్‌కర్ తన ఉన్నత స్థాయిని సైతం విస్మరించి కొలీజియం మీద దండయాత్రకు దిగారు. మొన్నమొన్నటి దాకా కేంద్ర న్యాయశాఖ మంత్రిగా ఉన్న కిరణ్ రిజిజు అయితే అనునిత్యం న్యాయవ్యవస్థతో పేచీకి దిగేవారు. అలాంటి దశలోనే మీకు కావాలనుకుంటే మరో చట్టం చేయండి అని డి.వై. చంద్రచూడ్ గట్టిగానే చెప్పారు. కానీ మోదీ ప్రభుత్వం ఆ పని చేయలేదు కాని న్యాయవ్యవస్థతో కయ్యానికి దిగడం మాత్రం మానలేదు. న్యాయవ్యవస్థను లొంగదీసి గుప్పెట్లో పెట్టుకోవాలని మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తూనే ఉంది. న్యాయ వ్యవస్థ పరిధిలోకి జొరబడి అడ్డంకులు కల్పించడం 1971లో ఇందిరా గాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు మొదలైంది. ప్రతిభను, సీనియారిటీని లెక్క చేయకుండా ప్రధాన న్యాయమూర్తిని నియమించిన సందర్భాలు ఉన్నాయి. ఆ దశలోనే కొలీజియం వ్యవస్థ అమలులోకి వచ్చింది. చట్టాలుచేసే హక్కు పార్లమెంటుకు ఉందన్న మాట నిజమే. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు నియమోల్లంఘన జరిగితే ఇప్పుడు ఏకంగా న్యాయ వ్యవస్థను లొంగదీయాలనుకుంటున్నారు. స్పష్టమైన అధికార విభజనను రాజ్యాంగం నిర్దేశించిన తరవాత ఇలాంటి వ్యవహారం రాజ్యాంగాన్ని ఖాతరు చేయకపోవడమే. ఇటీవల బెంగళూరులో సౌత్‌ఫస్ట్ అనే సంస్థ "న్యాయ వ్యవస్థకు, కార్యనిర్వాహక వర్గానికి జరుగుతున్న ఘర్షణలో ఎవరు గెలుస్తారు, ఎవరు ఓడుతారు" అని ఒక సదస్సు నిర్వహించింది. అందులో సీనియర్ న్యాయవాది సంజయ్ హెగ్డే, మాజీ ఒరిస్సా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన మురళీధర్ కూడా పాల్గొన్నారు. ఆ సదస్సులో సంజయ్ హెగ్డే న్యాయమూర్తి మురళీధర్‌ను ఏకంగా చాగ్లాతో పోల్చారు. అక్కడే "మీరు దిల్లీ మతకలహాల మీద ఇచ్చిన ఆదేశాలలో మీరు సుప్రీంకోర్టు న్యాయమూర్తి కాలేకపోయారా?" అని ఒక వ్యక్తి అడిగారు. నా స్థానంలో ఎవరున్నా అదే ఆదేశించి ఉండేవారు అని మురళీధర్ చాలా సౌమ్యంగా సమాధానం ఇచ్చారు. ఎంత జ్ఞానంఉన్నా వినయంగానే ఉండడం ఆయన తత్వం. తాము ప్రతిపాదించేపేర్లు ప్రభుత్వం ఆమోదించదేమో అనుకున్నప్పుడు కొలీజియం సర్దుబాటు ధోరణి ప్రదర్శించడం కొత్తేమీ కాదు. కానీ మురళీధర్ పేరును రెండవసారి ప్రతిపాదించకపోవడం డి.వై. చంద్రచూడ్ వ్యక్తిత్వానికి తగిందనిపించుకోదు.

మోదీ ట్వీట్‌పై పశ్చిమాసియా కలవరం

నిత్య చక్రవర్తి

ఇజ్రాయిల్-పలస్తీనా మధ్య కొన సాగుతున్న వివాదంపై భారతదేశ వైఖరి పూర్తిగా మారిపోయింది. తాజాగా నాలుగు రోజులుగా పలస్తీనా మిలిటెంట్లు- ఇజ్రాయిల్ మధ్య పూర్తిస్థాయిలో యుద్ధం జరుగుతోంది. పలస్తీనాకు చెందిన హమాస్ ఇజ్రాయిల్‌పైన ఆకస్మికంగా దాడిచేసింది. ఇప్పుడు రెండు దేశాల మధ్య యుద్ధం తీవ్రతరమైంది. హమాస్ విషయం తెలిసినవెంటనే భారత ప్రధాని మోదీ ఇజ్రాయిల్‌కు సంఘీభావం తెలియజేస్తూ అక్టోబరు 7న ట్వీట్ చేశారు. ఈ ట్వీట్ పశ్చిమాసియా, దక్షిణార్థ భూగోళాన్ని కలవరపరచవచ్చు. పశ్చిమాసియా, ఆఫ్రికన్ యూనియన్‌లకు మోదీ భిన్న వైఖరి తీసుకున్నారు. ఇజ్రాయిల్-పలస్తీనాల మధ్య యుద్ధం తీవ్రతరమవుతుందని సూచనలు ఉన్నాయి. ఇజ్రాయిల్‌కు ఒకవైపు ధనికదేశాలు, వాటి మిత్ర దేశాలు అండగా నిలవగా, హమాస్‌కు ఇతర స్నేహ మిలిటెంట్లు మద్దతునిస్తున్నారు. పచ్చి మితవాది అయిన ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహుకు అమెరికా ఇతర పశ్చిమదేశాలు చిరకాలంగా మద్దతుగా నిలుస్తున్నాయి. ఐక్యరాజ్యసమితి ఈ యుద్ధంపై కొంతవరకు సమావేశంకావడం లేదా స్పందించడం జరగలేదు. గత రెండేళ్లకాలంగా రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం జరుగుతూనే ఉంది. తాజాగా ఇజ్రాయిల్-పలస్తీనా మధ్య భీకరయుద్ధం కొనసాగుతోంది. రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధానికి అంతం పలకాలని లెక్కలేనన్ని సమావేశాలు జరిగాయి. ప్రధానంగా దక్షిణార్థ భూగోళ దేశాలు యుద్ధం అంతానికి చర్చలు చేశాయి. జి20గ్రూపు దేశాలేకాకుండా ఇంకా అనేక బహుళపక్ష దేశాలు సమావేశమై చర్చించాయి. ఇంతవరకు ఎలాంటి పురోగతి జరగలేదు. ఈ యుద్ధంలో దాదాపు 10వేలమంది మరణించి ఉంటారు. అపారంగా ఆస్తులకు నష్టం జరిగింది.

గత నెల దిల్లీలో జి20 దేశాల శిఖరాగ్ర సమావేశం జరిగింది. జి20 గ్రూపు అధ్యక్షస్థానం మరొకరు తీసుకున్నప్పటికీ మోదీ ఇంకా అధ్యక్షస్థానంలోనే కొనసాగుతున్నారు. హమాస్ దాడుల సంగతి తెలిసినవెంటనే ఇజ్రాయిల్‌కు మద్దతు ప్రకటించారు. అమాయకపౌరులు మరణించడంపై సానుభూతి ప్రకటించినప్పటికీ యుద్ధం అంతంకావాలని పేర్కొనలేదు. దీర్ఘకాలంగా కొనసాగుతున్న పలస్తీనా సమస్యను ప్రస్తావించనేలేదు. పలస్తీనాపై భారత వైఖరి పూర్తిగా మారిపోయింది. ఈ విషయంపై మన విదేశాంగ మంత్రిత్వశాఖ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. విదేశాంగమంత్రి డాక్టర్ జయశంకర్ కేవలం ప్రధాని ట్వీట్‌ను విడుదల చేశారు. ప్రధాని వైఖరి విదేశాంగశాఖను కాస్త ఇరుకున పెట్టింది. దక్షిణార్థ భౌగోళిక దేశాల వైఖరికి పూర్తి భిన్నంగా ప్రధాని ట్వీట్ ఉంది. ఇలాంటి వైఖరి ఎందుకు తీసుకున్నదీ వివరించవలసి ఉంది. దిల్లీలో

జరిగిన జి20 శిఖరాగ్ర సమావేశంలో ప్రధాని చొరవతీసుకుని అరబ్ దేశాలతో సహా ఆఫ్రికన్ యూనియన్‌కి పూర్తిస్థాయి సభ్యత్వాన్ని ఇచ్చారు. పశ్చిమాసియాలో యుద్ధంపై కొన్ని పొరపాటు అంచనాలను సరిచేస్తూ ప్రధాని లేదా విదేశాంగమంత్రి వివరంగా ఒక ప్రకటన చేసినట్లయితే పరిస్థితి సర్దుకుంటుంది. ఈ వ్యవహారంపై తప్పనిసరిగా దక్షిణార్థ భౌగోళిక దేశాలు లేవనెత్తుతాయి. నవంబరులో వర్చువల్‌గా జరగనున్న జి20 దేశాల సమావేశాన్ని ఉద్దేశించి ప్రధాని మోదీ మాట్లాడతారు. జి20 గ్రూపు అధ్యక్షుడిగా చివరిసారి ప్రసంగిస్తారు. ఈ సమావేశంలో దక్షిణార్థ భౌగోళిక దేశాలనుంచి వివిధప్రశ్నలు వచ్చి మోదీని ఇబ్బందులకు గురిచేస్తాయి. ఉక్రెయిన్ యుద్ధం విషయంలో ప్రధాని దౌత్యపరంగా పొందిన విజయం హమాస్-ఇజ్రాయిల్ యుద్ధం విషయంలో ఆయన తీసుకున్న వైఖరిని చెల్లాచెదురు చేస్తుంది.

హమాస్ దాడిపై కాంగ్రెస్‌తన ప్రకటనలో దిగ్భ్రాంతిని తెలియజేసింది. అలాగే అమాయకపౌరుల మృతిపై సానుభూతిని తెలియజేస్తూ పలస్తీనా అంశంపై శాశ్వత పరిష్కారం కావలసిన అవసరం ఉందని వ్యాఖ్యానించింది. సీపీఐ జాతీయ కార్యదర్శివర్గం ఒక ప్రకటన జారీ చేసింది. అంతర్జాతీయ సమాజం, ఐక్యరాజ్యసమితి, భారత ప్రభుత్వం రెండుదేశాల ఏర్పాటు ద్వారా శాశ్వత శాంతిని నెలకొల్పేందుకు కృషిచేయాలని, 1967కు ముందు ఉన్న సరిహద్దులను తీసుకుని, పలస్తీనాకు తూర్పు జెరూసలేం రాజధానిగా చేయాలని సీపీఐ కోరింది. పశ్చిమదేశాలు, అంతర్జాతీయ మీడియా హమాస్ టెర్రరిస్టుల, దెయ్యాల గ్రూపు అని నిందిస్తున్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా ప్రత్యేకించి తాజాగా జరిగిన ఎన్నికల తర్వాత ఇజ్రాయిల్ ప్రధానిగా బెంజమెన్ నెతన్యాహు గెలుపొందిన తర్వాత గాజా ప్రాంతంపై ఇజ్రాయిల్ స్నిప్పర్లతో దాడులు పెంచింది. ఇజ్రాయిల్ చరిత్రలో అత్యంత మితవాద ప్రభుత్వానికి నెతన్యాహు నాయకత్వం వహిస్తున్నాడు. దేశంలోని కొన్ని ప్రతిపక్షాలు నెతన్యాహు ఒక ఫాసిస్టు అని విమర్శిస్తున్నాయి. కమ్యూనిస్టు పార్టీ సైతం నెతన్యాహును ఫాసిస్టుగానే పరిగణిస్తున్నది. ఆయన మంత్రివర్గంలోనే కొందరు కూడా ఫాసిస్టేనని అంగీకరిస్తున్నారు. ఆర్థికమంత్రి బెజల్లెల్ స్మోట్రిక్స్ సైతం నెతన్యాహు స్వలింగ సంపర్క ఫాసిస్టు అని వర్ణించారు. పలస్తీనా స్వతంత్రదేశంగా అంగీకరించడానికి ఇజ్రాయిల్ తిరస్కరిస్తూ వస్తున్నది. అలాగే చట్టవిరుద్ధంగా భూములను ఆక్రమించుకుని పలస్తీనా ప్రజలను ఒక పథకం ప్రకారం వేధిస్తున్నారు. ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్, మానవహక్కుల నిఘా సంస్థ ఇజ్రాయిల్‌ను జాతి వివక్ష దేశంగా అంగీకరించాయి. హమస్ దాడికిముందు 2023లోనే వందలాది పలస్తీనా ప్రజలను ఇజ్రాయిల్ సైనికులు చంపివేశారు. 2006 తర్వాత ఈ సంవత్సరం పలస్తీనాకు ప్రాణాంతకమైనదని ఐక్యరాజ్యసమితి ఇప్పటికే వ్యాఖ్యానించింది. ఇజ్రాయిల్ న్యాయవ్యవస్థను సంస్కరించే పేరుతో ఆ వ్యవస్థకు ఎలాంటి అధికారంలేకుండా చేసేందుకు నెతన్యాహు సిద్ధమయ్యారు. పలస్తీనా ప్రజలను భయభ్రాంతులను చేసేందుకు నేషనల్ గార్డ్సును ఏర్పాటుచేయనున్నట్లు అత్యంత జాతి వివక్షను ప్రదర్శించే రక్షణమంత్రి ఇటమార్ బెన్-జిబిర్ ప్రకటించాడు. గాజా స్ట్రిప్‌ను పూర్తిగా ఆక్రమించుకున్నారు. ఈ ప్రాంతంనుంచి ఎవరూ బైటకువెళ్లకుండా భూమార్గాన్ని, సముద్రమార్గాన్ని మూసివేశారు. పెద్దఎత్తున బాంబులను కురిపిస్తున్నారు. ఫలితంగా వందలాది ప్రజలు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. గాజా స్ట్రిప్ ప్రాంతంలో దాదాపు 20లక్షలమందిని బహిరంగ జైలును ఏర్పాటుచేసి ఖైదీలుగా నిర్బంధించారు. ఈ నేపథ్యంలో మోదీ చేసిన ట్వీట్ ఖచ్చితంగా ఇజ్రాయిల్‌ను సమర్థిస్తున్నది. నిర్ణయంపూర్తి తప్పు అని చరిత్రలో నిలిచిపోతుంది.

చరిత్ర సృష్టించిన మన క్రీడాకారులు

ఎం కోటేశ్వరరావు

చైనాలోని హాంగ్‌ఝౌలో శనివారం ముగిసిన పందొమ్మిదవ ఆసియాడ్‌లో భారత క్రీడాకారులు కొత్త చరిత్ర సృష్టించారు. పతకాల వేటలో గత 70 రికార్డును అధిగమించి వంద పతకాలను సాధిస్తామన్న ఆత్మవిశ్వాసంతోవెళ్లి 107 పతకాలతో తిరిగి వచ్చినందుకు యావత్ దేశం వారిని అభినందిస్తోంది. రానున్న రోజుల్లో మరిన్ని పతకాలను తెచ్చి దేశ కీర్తిపతాకను సమున్నతంగా ఎగురవేయాలని ఆశిస్తోంది. నాలుగేండ్లకు ఒకసారి జరుగుతున్న ఆసియా క్రీడలు చైనాలో కరోనా నిరోధ చర్యల కారణంగా 2022లో జరగాల్సినవి ఈ ఏడాది నిర్వహించారు. 2026లో జపాన్‌లోని ఇచి, నాగోయా నగరాల్లో జరగనున్నాయి. మన క్రీడాకారులు 28 బంగారు, 38 రజిత, 41 కాంస్య పతకాలను సాధించారు. వీటిలో కొన్ని అనూహ్య పతకాలు ఉన్నాయి. చైనా, జపాన్, దక్షిణ కొరియా తరువాత నాలుగవ స్థానంలో మన దేశం ఉంది. జనాభాతో, ఆర్థికంగా చైనాతో పోటీపడుతున్న మనం క్రీడల్లో ఎందుకు పోటీలో లేము అని ఎవరైనా అనుకోవచ్చు. దానికి ఏడున్నర దశాబ్దాలుగా దేశాన్ని పాలిస్తున్న పార్టీలు, వాటి నేతలు తప్ప క్రీడాకారులు కాదు. అధికారం నిలుపుకోవటం మీద ఉన్న యావ యువతలో ఉన్న నైపుణ్యాలను వెలికి తీయాలన్నదాని మీద ఏ మాత్రంలేదు. పోటీలకు ముందు రెజ్లర్స్ ఫెడరేషన్ బ్రిజ్ భూషన్ శరణ్ సింగ్ (బిజెపి ఎంపీ) నిర్వాకం, క్రీడాకారుల ఆందోళన గురించి తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం తన ఎంపీని కాపాడుకొనేందుకు ఇచ్చిన ప్రాధాన్యత పోటీల్లో పాల్గొనేవారి పట్ల చూపలేదు. అందుకే చివరికి ఫెడరేషన్ లేదు, జాతీయ శిక్షణా శిబిరాలు లేవు, అంతర్జాతీయ శిక్షకులు లేరు, అయినప్పటికీ తాజా క్రీడల్లో వారు ఒక వెండి, నాలుగు కాంస్య పతకాలను సాధించారు. మరికొన్ని క్రీడలకు సంబంధించిన వివాదాల కారణంగా చివరివరకు ఎంపికలు జరగలేదంటే మన యాజమాన్య నిర్వహణ ఎంత అసమర్ధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఉదాహరణకు ఈక్వెస్ట్రియన్ పోటీలో పాల్గొనాలంటే క్రీడాకారులతో పాటు గుర్రాలను కూడా తీసుకుపోవాల్సి ఉంటుంది. క్వారంటైన్ నిబంధనల కారణంగా భారత గుర్రాలను చైనా అనుమతించటం లేదనే కీలక అంశాన్ని తన దగ్గర దాచారని క్రీడాకారుడు గౌరవ్ పుందిర్ చెప్పాడు. తీరా తెలుసుకున్న తరువాత ఐరోపా, మరోచోట తగిన గుర్రాల కోసం వెళ్లేందుకు, శిక్షణ పొందేందుకు తనకు అవకాశం లేకుండా పోయిందని, ఎంపిక విధానాన్ని కూడా మార్చారని వాపోయాడు. పోటీలకు వెళ్లకుండా తనను అడ్డుకోవటమే ఫెడరేషన్ అధికారుల ఎత్తుగడగా కనిపించిందని ఆరోపించాడు. పతకాలు వచ్చిన వారికి బహుమతులు ఇచ్చి గొప్పలు చెప్పుకోవటం కాదు కావాల్సింది. ప్రతిభను గుర్తించి అవసరమైన శిక్షణ సౌకర్యాలు, క్రీడలనే ఆలంబనగా చేసుకున్నవారు జీవితంలో స్థిరపడేందుకు ఇచ్చే చేయూతనుబట్టే యువతరం ముందుకు వస్తుంది. ఇప్పుడు వచ్చిన పతకాలకీర్తి కూడా క్రీడాకారుల తపనకు, వారిని ప్రోత్సహించిన తలిదండ్రులకు తప్ప మరొకరికి దక్కదు. ఈ క్రీడల్లో కొన్ని అనూహ్య పతకాలను మన దేశానికి సాధించటం సంచలనం కలిగించింది.

1951లో మనదేశమే తొలి ఆసియాడ్‌కు ఆతిధ్యమిచ్చింది. నాడు 17 దేశాల వారు 489 మంది పాల్గొంటే ఇప్పుడు 41కి, పోటీలు 57 నుంచి 481 అంశాలకు పెరిగాయి. చైనా 1962 నుంచి మాత్రమే పాల్గొంటున్నది. ఇప్పటి వరకు వివిధ దేశాలు సాధించిన బంగారు పతకాల సంఖ్య ఇలా ఉంది. బ్రాకెట్లలో ఉన్నవి మొత్తం పతకాల సంఖ్య చైనా 1,674 (3,570), జపాన్ 1,084(3,240), దక్షిణ కొరియా 787 (2,425), ఇరాన్ 193 (611), భారత్ 183 (779). తొలి ఆసియన్‌గేమ్స్ జరిగినతీరు చూస్తే అసలు నిర్వాహకులు ఎంత ఇబ్బంది పడింది, అధికారంలో ఉన్నవారికి క్రీడలపట్ల శ్రద్దలేమి స్పష్టంగా కనిపించింది. నాటి నుంచి నేటి వరకు ఉత్సాహవంతులైన వారి చొరవే ప్రధానంగా కనిపించింది. తొలి క్రీడల్లో జపాన్ 24 బంగారు పతకాలతో మొత్తం 58 పొందగా, రెండవ స్థానంలో మన దేశం 15 స్వర్ణాలతో 51 పతకాలు సాధించింది. తరువాత 1962లో జపాన్ 73 స్వర్ణాలతో ముందుండగా పదింటితో రెండవ స్థానంలో మన దేశం ఉండటం తప్ప అప్పటినుంచి ఇప్పటి వరకు మన దేశం రెండవ స్థానానికి ఎదగలేదు. టెహరాన్ 1974 క్రీడలలో చైనా 32 స్వర్ణాలతో రెండవ స్థానంలోకి వచ్చింది. తరువాత 1982లో న్యూఢిల్లీలో జరిగిన ఆసియాడ్‌లో తొలిసారిగా 61 పతకాలతో జపాన్‌ను వెనక్కునెట్టి మొదటి స్థానానికి వచ్చిన చైనా అప్పటి నుంచి వెనక్కు తిరిగి చూడలేదు. 1990లో తొలిసారిగా చైనాలో ఆసియా క్రీడలు జరిగాయి. 183 బంగారు, మొత్తం 341 పతకాలతో చైనా క్రీడాకారులు అదరగొట్టారు. తాజా పోటీలలో 200 స్వర్ణ, 111 రజత, 71 కాంస్యాలతో మొత్తం 382 పతకాలను సాధించింది.

ఉగ్రవాదం అగ్ర రాజ్యాల చలువ

ఇజ్రాయిల్‌పై హమాస్ తీవ్రవాద సంస్థ దాడి, ఫలితంగా వందలాది పౌరులు ప్రాణాలు కోల్పోవడం,కొనసాగుతున్న ఇజ్రాయెల్ ప్రతిదాడిలో అంతే స్థాయిలో గాజా పౌరుల ప్రాణాలు పోవడం అత్యంత బాధాకరం. ఈ భీకరపోరు కేవలం ఆయా దేశాల మధ్యనున్న జాతి వైరానికి దర్పణం కాదు. అగ్రరాజ్యాల స్వార్థానికి, వారి స్వంత లాభాల కోసం ఉన్న మంటల్లో పోస్తున్న ఆజ్యానికి కొండ గుర్తు. ఏడు దశాబ్దాల క్రితం ఇజ్రాయిల్ పుట్టుక మొదలు పలస్తీనాతో సమరం మొదలైంది. పలస్తీనాను దశల వారీగా ఆక్రమిస్తూ, దాడి చేస్తూ ఇజ్రాయిల్ తన బలం నిలుపుకుంటుంది. అందుకు అమెరికా మద్దతు పుష్కలంగా ఉంది. దానికి వ్యతిరేకంగా పలస్తీనాలో హమస్ తీవ్రవాద సంస్థ పుట్టుకొచ్చింది. రక్షణ,ఆయుధ సంపత్తి, అగ్ర రాజ్యస్నేహాలు, అంతర్గత నిఘా వ్యవస్థ బలంగా ఉన్న ఇజ్రాయిల్‌పై ఈ స్థాయి దాడి చెయ్యడం హమాస్ కి దుస్సాహసం. అయితే అక్కడ ప్రస్తుతం నెలకొన్న రాజకీయ అనిశ్చితి, అధ్యక్షుడిపై దేశంలో కొనసాగుతున్న వ్యతిరేక వాతావరణం కారణంగా ఇదే సరైన సమయమని భావించి అమానుష దాడికి ఒడిగట్టింది. గత కొన్నేళ్లుగా తమ దేశంపై జరుగుతున్న ఆక్రమణలకు, దాడులకు ప్రతీకారంగా తలచింది. పైగా సౌదీ అరేబియాతో బలపడుతున్న స్నేహాన్ని తమకు ముప్పుగా భావిస్తూ వచ్చింది. మరోవైపు ఇదే అదనుగా ఇరాన్, లెబనాన్‌లు హమస్‌కు మద్దతుగా నిలిచాయి. అమెరికా ఇజ్రాయిల్‌కు బాసటగా నిలబడగా చైనా, రష్యాలు మౌనం వహిస్తాయి. కొండొకచో పలస్తీనా తరపున ఉన్నట్టు సంకేతాలు ఇస్తాయి. అగ్ర రాజ్యాలు తమ స్వంత లాభాలకు అనుకూలంగా మంటల్ని ఎగదోస్తుంటాయి.సమస్యల్ని చావనివ్వవు. మంటల్ని ఆరనివ్వవు. ఫలితంగా ప్రపంచ శాంతి ఒక భ్రాంతిగా మిగిలిపోతుంది. ఇజ్రాయిల్ పలస్తీనా సమస్య మూలాల్లోకి పోకుండా పైపైన పరిష్కారాలు సాధ్యం కావు. అణిచివేత, అతివాదం ఒక నాణేనికి రెండు వైపులు. దీర్ఘకాలిక పరిష్కారాలు వెదకాల్సిన సమస్యలు. ప్రపంచ దేశాలు ఏదో ఒక వైపు నుండి కాకుండా పైనుండి చూస్తేనే అసలు సమస్య అర్థమవుతుంది. ప్రపంచంలో ఏ మూల అశాంతి ఉన్నా అది అంతటికీ ప్రమాదమే.ఇ ప్పుడు చూస్తున్నది అదే.

డా. డి.వి.జి.శంకర రావు, మాజీ ఎంపీ, 94408 36931.

కార్పొరేట్ల వశమవుతున్న భూమి

దాక్టర్ కొల్లా రాజమోహన్

ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ యం.యస్.స్వామినాథన్ మరణం భారతదేశ రైతాంగానికి తీవ్రమైన విషాదం కలిగించింది. అధిక దిగుబడినిచ్చే గోధుమ, వరి విత్తనాలను అభివృద్ధిచేసి వ్యాప్తి చేయడంలో కీలకపాత్ర వహించిన డాక్టర్ స్వామినాథన్, భారత దేశం గర్వించదగ్గ వ్యవసాయ శాస్త్రవేత్త. ఇంటర్నేషనల్ బోర్డ్ ఫర్ జెనిటిక్ రీసెర్చ్, ఇక్రిసాట్ రూపకల్పన, యం.యస్. స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్‌లను స్థాపించారు. ఫిలిప్పీన్స్‌లో అంతర్జాతీయ వరి పరిశోధనా సంస్థను రాక్ ఫెల్లర్, ఫోర్డ్ ఫౌండేషన్ల సహాయంతో స్థాపించి, అధిక దిగుబడి వరి వంగడాలను కనుగొన్నారు. వరి, గోధుమ పంటలపై ఆయన చేసిన పరిశోధనల ఫలితంగా భారతదేశంలో ఆహారధాన్యాల ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. హరిత విప్లవ సృష్టికర్త స్వామినాథన్. అమెరికా షరతులను ఒప్పుకుని, పీ యల్ 480 నిధులద్వారా గోధుమలను దిగుమతి చేసుకున్న భారతదేశాన్ని, ఆహారాన్ని ఎగుమతిచేసే దేశంగా తీర్చిదిద్దారు.

జాతీయ రైతు కమిషన్ అధ్యక్షులుగా, భారత వ్యవసాయాన్ని పరిశోధించి 5 సంపుటాలను భారత జాతికి అంకితమిచ్చారు. రైతు అభివృద్ధికి కొన్ని ఫార్ములాలు రూపొందించి సిఫార్సులను చేశారు. అందులో మొట్టమొదటిది భూసంస్కరణలు. తర్వాత ప్రాధాన్యత నీరు. రైతు శ్రమ, రైతు పెట్టుబడి, భూమికౌలు, సమగ్ర వ్యవసాయఖర్చులు అన్నీ కలిపి దానికి 50శాతం చేర్చి, కనీస మద్దతు ధర వుండాలని సి2+50 ఫార్ములా రూపొందించారు. దీనిని అన్ని రాజకీయపార్టీలు, రైతుసంఘాలు ఆహ్వానించాయి. దీనికై ఢిల్లీ సరిహద్దులలో సంవత్సరంపైగా చారిత్రాత్మకంగా ఆందోళనలు చేశారు. కానీ ఇప్పటికీ కనీస మద్దతు ధరకు చట్టబద్దత కల్పించనందున రైతాంగ పోరాటం కొనసాగుతోంది.

జాతీయ రైతు కమిషన్

భారత ప్రభుత్వం నవంబరు 18, 2004న నియమించిన జాతీయ రైతు కమిషన్ ప్రొఫెసర్ ఎంఎస్ స్వామినాథన్ అధ్యక్షతన ఏర్పాటైంది. కమిటీలో రైతు నాయకులు అతుల్ కుమార్ అంజన్ సహా 8 మంది సభ్యులున్నారు. జాతీయ రైతు కమిషన్ (ఎన్‌సీఎఫ్) వరుసగా డిసెంబర్ 2004, ఆగస్టు 2005, డిసెంబర్ 2005, ఏప్రిల్ 2006లో నాలుగు నివేదికలను సమర్పించింది. సిఫారుసులతో కూడిన 5వ నివేదికను

అక్టోబర్ 4, 2006న సమర్పించింది. ఎన్‌సీఎఫ్ అధ్యయనానికి ప్రభుత్వం చేసిన సూచనలు.

1. ప్రధాన వ్యవసాయ పంటల ఉత్పాదకత, లాభదాయకత పెంపొందించడం. 2.ఆహార భద్రత, పోషకాహార భద్రత వ్యూహం. 3. రైతుల ఋణాలను పెంచడానికి విధాన సంస్కరణలు. 4. మెట్ట ప్రాంతాలు, నిస్సార భూములు, పోడు భూములు, కొండ, తీర ప్రాంతాల్లోని రైతులకు వ్యవసాయం కోసం ప్రత్యేక కార్యక్రమాలు. 5. వ్యవసాయ వస్తువుల నాణ్యత పెంచి, ధరలలో పోటీతత్వాన్ని పెంపొందించి, తద్వారా వాటిని ప్రపంచవ్యాప్త పోటీగా మార్చడం. 6. అంతర్జాతీయ ధరలు బాగా పడిపోయినప్పుడు దిగుమతుల నుండి రైతులను రక్షించడం. 7. స్థిరమైన వ్యవసాయం కోసం, పర్యావరణ పరిరక్షణకు, ఎన్నికైన స్థానిక సంస్థలకు అధికారం ఇవ్వడం

పరిష్కార సూచనలు : రైతుల కష్టాలకు, ఆత్మహత్యల పెరుగుదలకు కారణాలపై దృష్టి సారించి పరిష్కారాలను సూచించారు. వాటిలో మొదటిది భూ సంస్కరణలకు పూర్తి అమలుఇవ్వాలి. తరువాత నీటిపారుదల అసౌకర్యాలు, అందుబాటులోలేని వ్యవసాయ సాంకేతికత, సరైన సమయంలో సంస్థాగత రుణాలు ఇవ్వాలి. ప్రతికూల వాతావరణం, ప్రకృతి వైపరీత్యాలు. బీమా, సాంకేతిక పరిజ్ఞానం. మార్కెట్ సహా ప్రాథమిక వనరులపై రైతులకు భరోసా, నియంత్రణ ఉండాలన్నారు. రాజ్యాంగంలోని ఉమ్మడి జాబితాలో "వ్యవసాయం" చేర్చాలని సిఫార్సు చేసారు.

భూమి గురించి

1) దేశంలోని మొత్తం భూయాజమాన్యంలో దిగువనవున్న 50శాతం గ్రామీణ కుటుంబాల వాటా కేవలం 3శాతం మాత్రమే అని, ఎగువన వున్న 10 శాతం మంది చేతిలో 54శాతం భూమి వున్నదన్న గణాంకాలను నివేదికలో చూపించారు. వ్యవసాయ సంక్షోభ పరిష్కారానికి భూసంస్కరణలే కీలకమన్నారు. మిగులు భూముల, బంజరు భూముల పంపిణీనే పరిష్కారమన్నారు. 2) ప్రధాన వ్యవసాయ భూములను, అటవీ భూములను కార్పొరేట్ రంగానికి మళ్ళించటాన్ని నిరోధించాలన్నారు. 3) అడవిలోవున్న గిరిజనుల అటవీ హక్కులను రక్షించాలన్నారు. 4) భూమిని, వాతావరణాన్ని రక్షించటానికి జాతీయ భూమి వినియోగ కమిషన్‌ను ఏర్పరచామన్నారు. భూమి, నీరు, జీవన వనరులు, రైతుల ఆదాయం, బీమా, సాంకేతిక విజ్ఞాన నిర్వహణ, మార్కెట్ సహా ప్రాథమిక వనరులపై జాతీయ భూమి వినియోగ కమిషన్‌కు నియంత్రణ వుండాలన్నారు. 5) వ్యవసాయ భూమి పరిమాణం, వినియోగం, కొనుగోలుదారుల వర్గాన్నిబట్టి భూమి విక్రయం నియంత్రించాలన్నారు. డా.స్వామినాథన్ చేసిన ప్రధాన సిఫారసు అయిన భూసంస్కరణల సంగతి ఎత్తినవారే లేకపోవటం, వ్యవసాయ భూములను కార్పొరేట్ సంస్థలకు కట్టపెట్టటాన్ని ఎదుర్కోలేక పోవటం దేశ దౌర్భాగ్యానికి పట్టిన దుర్గతికి తార్కాణం. భూమి గురించి వ్యవసాయ కమిషన్ చేసిన సిఫారసులను రైతు సంఘాలు, జాతీయపార్టీలు విస్మరించాయి. వ్యవసాయ రంగం అభివృద్ధి చెందటానికి కీలకం భూసంస్కరణలు అని స్వామినాథన్ కమిషన్ నివేదిక మొదటి సిఫారసుగా పేర్కొంది. తెలిసి చేసినా తెలియక చేసినా, భూసంస్కరణల ఎజెండాను పక్కనపెట్టడం తీవ్రమైన పొరపాటు. పాలకవర్గ పార్టీల అవినీతి వ్యవహారాలన్నీ భూమి చుట్టూ తిరుగుతున్న విషయాన్ని గ్రహించాలి. భూసంస్కరణలకు భూమి ఎక్కడుందంటూనే వేల ఎకరాలను కార్పొరేట్లకు అప్పగిస్తున్నారు.

నల్లమడ రైతు సంఘం, ఫోన్ నెం: 9000657799.

ప్రజాస్వామ్య హక్కులు పునరుద్ధరించాలి

జమ్ములో విపక్ష పార్టీల నిరసన

జమ్ము: కేంద్ర పాలిత ప్రాంతంలో ప్రజాస్వామ్య మరియు రాజ్యాంగ హక్కులను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్, పీడీపీతో సహా జమ్మకశ్మీర్‌లోని ప్రధాన ప్రతిపక్ష పార్టీలు మంగళవారం దాదాపు మూడు గంటల పాటు ఇక్కడ ధర్నా నిర్వహించాయి. 2019లో జమ్మకశ్మీర్‌కు ప్రత్యేక హోదా రద్దు చేసిన తర్వాత ఇక్కడ జరుగుతున్న మొదటి పెద్ద నిరసన ఇది. జమ్ము నడిబొడ్డున ఉన్న మహారాజా హరి సింగ్ పార్క్ వద్ద జరిగిన నిరసనకు నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా నాయకత్వం వహించాల్సి ఉంది. కానీ అనారోగ్యం కారణంగా ఆయన చేయలేకపోయాడు. అయితే ప్రాంతీయ అధ్యక్షుడు రత్తన్ లాల్ గుప్తా నేతృత్వంలోని పార్టీ సీనియర్ నాయకులు నిరసనలో పాల్గొన్నారు. అలాగే, పీడీపీ అధ్యక్షురాలు, మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ కూడా నిరసనలో పాల్గొనలేదు. జమ్ములో పార్టీ ఉపాధ్యక్షుడు అబ్దుల్ హమీద్ చౌదరి, మాజీ ఎమ్మెల్సీ ఫిర్దౌస్ తక్‌తో సహా దాదాపు అందరు సీనియర్ నాయకులు నిరసనలో పాల్గొన్నారు. నేషనల్ కాన్ఫరెన్స్ ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా సోమవారం మాట్లాడుతూ జమ్మకశ్మీర్ అసెంబ్లీకి ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించకపోవడం, ఎన్నుకోబడిన ప్రభుత్వాన్ని కలిగి ఉండటానికి ప్రజలను వీధుల్లోకి నెట్టగలదని అన్నారు. మధ్య ప్రదేశ్, చత్తీస్‌గఢ్, రాజస్థాన్, మిజోరం, తెలంగాణ ఐదు రాష్ట్రాలకు ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించిన కొద్దిసేపటికే సోమవారం శ్రీనగర్‌లో విలేకరులతో అబ్దుల్లా మాట్లాడుతూ 'మన ప్రజాస్వామ్య హక్కుల కోసం కూడా నిరసన తెలిపే పరిస్థితికి మనం నెట్టబడుతున్నట్లు కనిపిస్తోంది' అని తెలిపారు. సీపీఎం, నేషనల్ పాంథర్స్ పార్టీ (ఎన్‌పీపీ), అవామీ నేషనల్ కాన్ఫరెన్స్, శివసేన (యూబీటీ), అవామీ నేషనల్ కాన్ఫరెన్స్, సామాజిక సంస్థలతో పాటు వివిధ పార్టీలకు చెందిన వందలాది మంది నాయకులు, కార్యకర్తలు నిరసనకు తరలివచ్చారు. 'రాష్ట్ర హోదా, ప్రజాస్వామ్య, రాజ్యాంగ హక్కులను తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేసేందుకు ప్రతిపక్ష పార్టీలు ఒక్కటయ్యాయి' అని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు వికార్ రసూల్ వానీ అన్నారు. 'ప్రజల హక్కుల కోసం, వారి ప్రయోజనాలను కాపాడటం కోసం మేము మా నిరసనను కొనసాగిస్తాము' అని ఆయన అన్నారు. డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ ఆజాద్ పార్టీ, అప్నీ పార్టీ వంటి దాని మిత్రపక్షాలతో కలిసి ఎన్నికల పోరులో ఓటమిని ఎదుర్కోవాల్సి వస్తుందని పూర్తిగా తెలిసినా, బీజేపీ ఉద్దేశపూర్వకంగా ఎన్నికలను ఆలస్యం చేస్తోందని వానీ ఆరోపించారు. సీపీఎం నేత ఎం.వై.తరిగామి మాట్లాడుతూ బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అబద్ధమని తేలిందని, దాని నుంచి తమకు ఎలాంటి ఆశ లేదని అన్నారు. జమ్మకశ్మీర్ ప్రజలకు ఈ ఉమ్మడి నిరసన 'సానుకూల సంకేతం' అని పీడీపీ నాయకుడు తక్ పేర్కొన్నారు. 'ఈ వేదిక నుంచి దేశానికి సందేశం ఏమిటంటే, 'లౌకికవాదం, 'భారతదేశం ఆలోచన'ను కాపాడటానికి ప్రస్తుత పాలనలోని 'విభజన రాజకీయాలకు' వ్యతిరేకంగా అన్ని ప్రతిపక్షాలు నిలబడాలి' అని అన్నారు.

ఎన్‌సీపీ అధినేతను నేనే: అజిత్ పవార్

ముంబై: నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ(ఎన్‌సీపీ) చీలికపై ఈసీఐ విచారణ జరుపుతున్న వేళ...తానే ఎన్‌సీపీ జాతీయ అధ్యక్షుడినని తిరుగుబాటు వర్గం నేత అజిత్ పవార్ చెప్పుకున్నారు. తమ వర్గం మహారాష్ట్రలో ఏక్‌నాథ్ శిండే ప్రభుత్వంతో చేతులు కలపడాన్ని పూర్తిగా సమర్థించుకున్నారు. రాష్ట్ర రాజకీయ చరిత్రలో మహామహ రాజకీయ నాయకులు భిన్నాభిప్రాయాలు కలిగి ఉండటం అందరం చూస్తున్నామని చెప్పారు. అజిత్ పవార్ జులై 2వ తేదీన మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు. దీనికి ముందు ఆయన మరో 8 మంది ఎన్‌సీపీ ఎమ్మెల్యేలతో కలిసి శివసేన-బీజేపీ ప్రభుత్వంతో చేతులు కలిపారు. అజిత్ పవార్ ఉపముఖ్యమంత్రిగా ప్రమాణం చేసి మంగళవారానికి 100 రోజులు అయింది. ఈ సందర్భంగా అజిత్ పవార్ మీడియాతో మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు ఆర్థిక సాధికారత కల్పించేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ఈ లక్ష్యం సాధించేందుకు ఎన్‌సీపీ కష్టపడుతోందన్నారు. సమాజంలోని అన్ని వర్గాలకు ఉద్యోగ, ఉపాధి, ఆర్థిక సాధికారత, విద్య, ఆరోగ్యం, సంక్షేమ పథకాలన్నీ సక్రమంగా అమలు చేయడం తమ ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలని అజిత్ పవార్ చెప్పారు. 'అధికారం ఉపయోగించుకోవడం ద్వారా ఈ లక్ష్యాలు సాధించడానికి ఎన్‌సీపీ కట్టుబడి ఉంది. విమర్శలనేవి ప్రతి రాజకీయ నాయకుడి జీవితంలో భాగం. నిర్మాణాత్మక విమర్శలను నేను సానుకూలంగా తీసుకుంటాను. సానుకూల, అభివృద్ధి రాజకీయాలపై నాకు అపార నమ్మకం ఉంది. నేను నమ్మిన పద్ధతిలో ప్రజల జీవన ప్రమాణాలు మార్చేందుకు కష్టపడి పని చేస్తాను' అని అజిత్ పవార్ చెప్పారు. ఛత్రపతి శివాజీ మహరాజ్, మహాత్మాపూలె, సాహు మహరాజ్, డా.బీఆర్ అంబేద్కర్, యశ్వంతరావు చవాన్ ఆశయాలను ఎన్‌సీపీ విశ్వసిస్తోందన్నారు. తన నాయకత్వంలో పార్టీ ఈ వారసత్వాన్ని కొనసాగిస్తుందని చెప్పారు. మహారాష్ట్ర రాజకీయ చరిత్రలో అనేకమంది అగ్రనేతలు భిన్న రాజకీయ వైఖరులు ప్రదర్శించారని, ప్రస్తుత రాజకీయ, సామాజిక పరిస్థితులకు అనుగుణంగా ఏ రాజకీయ నాయకుడైనా నిర్ణయాలు తీసుకుంటాడన్నారు. జులై 2న తాను కూడా అలాంటి నిర్ణయమే తీసుకున్నానని చెప్పారు. రైతులు, యువత, మహిళల కోసం ఎన్‌సీపీ పనిచేస్తుందని అజిత్ పవార్ చెప్పారు. సమాజంలోని విభిన్న వర్గాల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు.

అందుకే బ్రహ్మచారిగా ఉన్నా...

పెళ్లిపై రాహుల్‌గాంధీ వివరణ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీకి పనిచేయడం కోసమే తాను బ్రహ్మచారిగా ఉన్నానని, పెళ్లి వల్ల అనేక చికాకులు ఉంటాయని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ చెప్పారు. జైపూర్‌లోని మహారాణి కాలేజీలో విద్యార్థినులతో రాహుల్ ఇష్టాగోష్టిగా మాట్లాడారు. విద్యార్థులతో సంభాషణల వీడియోను తన సోషల్ మీడియా వేదికగా రాహుల్ మంగళవారం పోస్టు చేశారు. రాహుల్‌గాంధీ వివాహం, ఆయన ఇష్టాలు, అయిష్టాలు వంటి అనేక అంశాలపై విద్యార్థినులు ప్రశ్నలు అడిగి రాహుల్ నుంచి సమాధానాలు రాబట్టారు. కులగణన, స్వాతంత్ర సమయంలో మహిళల పాత్ర వంటి అంశాలపై చర్చించారు. మహిళలకు ఆర్థిక సాధికారత వంటి అంశాలపై పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నారు. 'మీరు చూడటానికి చాలా అందంగా ఉంటారు. తెలివిగా ఉంటారు. వివాహం అనే ఆలోచన మీకు ఎందుకు రాలేదు' అని విద్యార్థినులు ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ కోసం తాను పనిచేస్తున్నానని, ఇందులో తనకు ఎలాంటి చికాకులు ఉండకూడదనే పెళ్లి చేసుకోవడం లేదని రాహుల్ వివరించారు. 'మాకు ఏ తరహా వంటకాలు ఇష్టపడతారు' అని విద్యార్థులు ప్రశ్నించగా కాకరకాయ, బఠానీ, బచ్చలికూర మినహా అన్ని వంటలు ఇష్టంగా తింటానని రాహుల్ సమాధానమిచ్చారు. 'మీకు ఇష్టమైన ప్రదేశం ఏమిటి' అని అడుగగా కొత్త కొత్త ప్రాంతాలు చూడటం తనకు ఇష్టమని చెప్పారు. మీ చర్మ సౌందర్య రహస్యమేమిటని అడుగగా తన ముఖానికి ఏనాడు క్రీములు లేదా సబ్బులు వాడలేదని, కేవలం నీటితో ముఖం శుభ్రంగా కడుక్కుంటానని నవ్వుతూ చెప్పారు. స్వాతంత్ర్య సంగ్రామంలో పురుషులకు ఏమాత్రం తీసిపోని విధంగా మహిళలు పాల్గొన్నారని, అయినా మహిళలకు సంపూర్ణ హక్కులు ఎందుకు లేవని రాహుల్ ప్రశ్నించారు. మహిళలకు ఆర్థిక స్వయంప్రతిపత్తి గురించి రాహుల్ సుదీర్ఘ ప్రసంగం చేశారు. సమాజంలో మహిళలపై వివక్ష గురించి ప్రశ్నించగా అన్ని రంగాల్లోనూ మహిళలు రాణిస్తున్నారని, కానీ వారికి సమ ప్రాధాన్యత లభించడం లేదని, ఆ దిశగా పాలకులు ప్రయత్నించాల్సిన అవసరం ఉందని రాహుల్ చెప్పారు. విద్యార్థినులతో ముఖాముఖి కార్యక్రమం సెప్టెంబరు 23న జరిగింది. ఈ వీడియోను ఇప్పుడు పోస్టు చేశారు.

అసమానతలు సహించలేకపోతున్నా

- అందుకే మంత్రిపదవికి రాజీనామా
- పుదుచ్చేరి ఏకైక మహిళా మంత్రి

పుదుచ్చేరి: పుదుచ్చేరి మంత్రివర్గంలో గల ఏకైక మహిళా మంత్రి ఎస్.చందిరా ప్రియాంక మంగళవారం రాజీనామా చేశారు. కుట్ర రాజకీయాలు, ధనబలం, కులతత్వం, లింగవివక్ష వంటి అసమానతలను సహించలేకే తన మంత్రి పదవికి రాజీనామా చేసినట్లు ఆమె చెప్పారు. పుదుచ్చేరిలో ఏఐఎన్ఆర్‌సీ-బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం కొనసాగుతున్న విషయం విదితమే. ప్రియాంక ఒక్కరే మహిళా ఎమ్మెల్యే. ఆమెకు కేబినెట్‌లో స్థానం కల్పించారు. అయితే, అధికార సంకీర్ణంలో అడుగడుగునా కుట్రలు, లింగ వివక్ష ప్రదర్శిస్తున్నట్లు ఆమె ఆరోపించారు. దాదాపు 40 ఏళ్ల తర్వాత 2021లో ఓ మహిళకు పుదుచ్చేరి మంత్రివర్గంలో స్థానం దక్కింది. ఎన్.రంగస్వామి నేతృత్వంలోని ప్రభుత్వంలో రవాణాశాఖ బాధ్యతలు ప్రియాంకకు అప్పగించారు. చందిరా ప్రియాంక గత అసెంబ్లీ ఎన్నికల్లో ఏఐఎన్ఆర్‌సీ టికెట్‌పై కరైకల్‌లోని నెడుంకడు రిజర్వుడ్ నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. ప్రియాంక మంగళవారం తన కార్యదర్శి ద్వారా రాజీనామా లేఖను ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపారు. రాజీనామా లేఖ అందినట్లు సీఎంఓ వర్గాలు నిర్ధారించాయి. లేఖను ముఖ్యమంత్రికి పంపుతామని, రాజీనామాపై ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకుంటారని ఈ వర్గాలు వెల్లడించాయి. రాజీనామా లేఖ ప్రతులను మీడియాకు అందజేశారు. నియోజకవర్గంలో తనకు గల ప్రజాబలం ద్వారానే తాను అసెంబ్లీలో అడుగుపెట్టానని, అయితే, కుట్ర రాజకీయాలను అధిగమించడం అంత తేలికకాదని ప్రియాంక పేర్కొన్నారు. డబ్బుబలంపై తాను పోరాడలేనని చెప్పారు. కులం, లింగ వివక్షను సైతం తాను ఎదుర్కొంటున్నానని ఆమె ఆరోపించారు. తనను లక్ష్యంగా చేసుకున్నారని, కుట్ర రాజకీయాలను తాను సహించలేనని, ప్రతి అంశానికీ ఓ పరిమితి ఉంటుందని ప్రియాంక వ్యాఖ్యానించారు.

విపక్ష నేతలపైనే కేసులు

ఆప్ నేత రాఘవ్ చద్దా విమర్శ

న్యూఢిల్లీ: కేంద్ర దర్యాప్తు సంస్థలు సీబీఐ, ఎన్‌ఫోర్సుమెంటు డైరెక్టరేట్(ఈడీ)పై ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) మంగళవారం మండిపడింది. ప్రతిపక్ష నాయకులపై 95 శాతం కేసులు సీబీఐ, ఈడీలే నమోదు చేశాయని తెలిపింది. గతేడాది బెయిల్ తీసుకొన్న తమ ఎమ్మెల్యే అమానుల్లాఖాన్ ఇంటిపై ఈడీ దాడి చేసిందని విమర్శించింది. మనీలాండరింగ్ కేసులో భాగంగా ఢిల్లీలోని అమానుల్లాఖాన్ ఇంటిపై ఈడీ మంగళవారం దాడి చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. 49 ఏళ్ల అమానుల్లాఖాన్ ఓఖ్లా అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అమానుల్లాఖాన్ ఇంటిపై ఈడీ దాడి అనంతరం ఆప్ నాయకుడు రాఘవ్ చద్దా విలేకరులతో మాట్లాడుతూ ప్రతిపక్ష ఇండియా కూటమిని చూసి బీజేపీ భయపడుతోందని చెప్పారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మౌనం వహిస్తున్న సీబీఐ, ఈడీ...బీజేపీ యేతర రాష్ట్రాలలో మాత్రం చెలరేగిపోతున్నాయని విమర్శించారు. ఇండియా కూటమికి చెందిన ప్రతిపక్ష నేతలపై సీబీఐ, ఈడీలే 95 శాతం కేసులు నమోదు చేశాయని తెలిపారు. ఇండియా ఐక్య సంఘటన ఏర్పడిన నాటి నుంచి కాంగ్రెస్, శివసేన, తృణమూల్ కాంగ్రెస్, ఇతర భాగస్వామ్య పార్టీల నాయకులు లక్ష్యంగా కేసులు, దాడులు పెరిగాయన్నారు. ప్రతిపక్ష కూటమి అంటే భయం వల్లే బీజేపీ ఇలాంటి చర్యలకు దిగుతోందన్నారు. ఆప్‌పై బీజేపీకి ప్రత్యేక అభిమానం ఉన్నట్లు కనిపిస్తోందని చద్దా ఎద్దేవా చేశారు. ఎలాంటి ఆధారాలు లేకపోయినా తమ పార్టీ నాయకులు సత్యేందర్ జైన్, మనీశ్ సిసోడియా, సంజయ్‌సింగ్‌లను అరెస్టు చేసినట్లు గుర్తుచేశారు. 'నేడు ఎమ్మెల్యే అమానుల్లాఖాన్ ఇంటిలో సోదాలు జరిగాయి. ఏసీబీ అరెస్టు చేసిన తర్వాత గతేడాది సెప్టెంబరులో అమానుల్లాఖాన్ ఇదే కేసులో బెయిల్ తీసుకున్నారు. ఈ విషయంలో ఏసీబీకి కోర్టు చీవాట్లు పెట్టింది' అని కోర్టు బెయిల్ ఆర్డర్‌ను చదివి వినిపించారు.

'సెంటర్ ఫర్ బ్రెయిన్ అండ్ మైండ్' ప్రారంభం

బెంగళూరు: ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరో సైన్సెస్ (ఎన్ఐఎంహెచ్ఏఎన్ఎస్) మంగళవారం బెంగళూరులో 'సెంటర్ ఫర్ బ్రెయిన్ అండ్ మైండ్'ని ప్రారంభించింది. దీనిని కేంద్ర ఆరోగ్య మంత్రి మన్సుఖ్ మాండవ్య వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ వైద్య పరిశోధన కేంద్రాన్ని నేషనల్ సెంటర్ ఫర్ బయోలాజికల్ సైన్సెస్ (ఎన్‌సీబీఎస్) సహకారంతో రోహిణి నీలేకని ఫిలాంత్రోపీస్ అందజేసిన రూ. 100 కోట్ల ఉదార సహాయంతో ప్రారంభించినట్లు ఎన్ఐఎంహెచ్ఏఎన్ఎస్ వెల్లడించింది. మూల కణాలను (ఏడీబీఎస్ ప్రాజెక్ట్) ఉపయోగించి మెదడు రుగ్మతలకు గల కారణాలు, చికిత్సలపై ఈ కేంద్రం పరిశోధనలు చేస్తుంది. అత్యాధునిక సౌకర్యాలతో దీనిని నిర్మించారు.

సంపన్నులపై భారీ పన్నులతోనే

పేదల జీవితాల్లో వెలుగులు

ప్రభాత్ పట్నాయక్



కోల్‌కతా: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం విదేశీ పెట్టుబడిదారుల ప్రయోజనాల కంటే దేశ పౌరుల అవసరాలను పరిశీలించాలని ప్రముఖ ఆర్థికవేత్త ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్ సూచించారు. సంపన్నులపై భారీగా పన్నులు విధించకపోతే దేశంలోని పేద ప్రజల పరిస్థితులు ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంటాయని చెప్పారు. దేశంలోని వామపక్ష వాదులు ఇదే విషయాన్ని పదే పదే చెపుతూనే ఉన్నారని గుర్తు చేశారు. 'ప్రస్తుత పరిస్థితులలో దేశ స్వావలంబన' అనే అంశంపై కలకత్తా యూనివర్సిటీ ఇన్‌స్టిట్యూట్ హాలులో జరిగిన చర్చా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పశ్చిమబెంగాల్ సైన్స్ ఫోరమ్, శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులతో కూడిన వేదిక (ఎఫ్ఒఎస్ఈటీ) సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాయి., 'ఉత్పత్తి, దేశీయ వనరులను దేశ ప్రజల కోసమే పూర్తిగా వినియోగించాలి. విదేశాల నుంచి డబ్బు వస్తే దేశంలో ఆదాయం ఉండదు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి దేశం మరింత వ్యవసాయ, పారిశ్రామిక ఉత్పత్తిని సాధించాల్సిన అవసరం ఉంది. దేశాన్ని నడిపేందుకు మనం విదేశీ పెట్టుబడులపై ఆధారపడితే, ఆ సొమ్ము దేశాన్ని విడిచి వెళితే అప్పుడు ప్రజలు రోడ్ల మీద కూర్చోవాల్సి వస్తుంది. ప్రస్తుత పరిస్థితి దీనినే సూచిస్తోంది' అని ప్రభాత్ పట్నాయక్ హెచ్చరించారు. విద్యను ప్రైవేటీకరించడం ప్రమాదకరమని ప్రభాత్ హెచ్చరించారు. విద్యాసంస్థలు, యూనివర్సిటీలలో దేశ చరిత్ర, సంస్కృతికి ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఉన్నదని, ఇందుకు ప్రభుత్వం తోడ్పాటు అందించాలని ఆయన కోరారు. 'విదేశాలను అనుసరించ కూడదు. అలా చేస్తే ఉన్నత విద్యలో మనం వెనుకబడిపోతాం. నయా సరళీకరణ విధానాలతో సమస్య ఉంటే అది దేశ ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఆహార స్వావలంబన, ఉపాధి, ప్రభుత్వ సాయంతో నడుస్తున్న విద్య, ఆరోగ్య రంగం మెరుగుదల, వృద్ధాప్య పెన్షన్లు వంటి వాటిపై ప్రభుత్వం దృష్టి సారించాలి' అని ప్రభాత్ సూచించారు. దేశ ఆర్థిక వ్యవస్థపై ఆయన మాట్లాడుతూ నయా ఉదారవాద విధానాల వ్యూహం కొనసాగితే దేశం ప్రమాదంలో పడుతుందని, ఆహారోత్పత్తి, విద్య, ఆరోగ్య రంగాలు దెబ్బతింటాయన్నారు. ఎగుమతులు తగ్గిపోయాయని, రూపాయి విలువ పడిపోతోందని చెప్పారు. 'ప్రపంచంలోనే ఆర్థిక పురోగతికి అవరోధాలు ఎదురవు తున్నాయి. దేశానికి ఆహార స్వయం సమృద్ధి అవసరం. అయితే ఆహారోత్పత్తిలో దేశం వెనుకబడుతోంది. దేశంలోని చాలా భూమి, వనరులు వృథాగా పడి ఉన్నాయి. అవి ఉపయోగంలో లేవు. మరోవైపు ప్రభుత్వమేమో సబ్సిడీలను ఉపసంహరిస్తోంది. దీంతో రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయి' అని వివరించారు. విదేశీ మారక లావాదేవీల ద్వారా ప్రభుత్వం ఖరీదైన ఉత్పత్తులపై దృష్టి పెడితే ప్రజల ముందు పెను ప్రమాదం కన్పిస్తుందని ప్రభాత్ అన్నారు. 'ఎందుకంటే ప్రజల కొనుగోలు శక్తి తగ్గు తుంది. రైతులకు కొనుగోలు శక్తి ఉండదు. దీనివల్ల దేశం స్వావలంబన సాధించడం సాధ్యం కాదు. పరిశ్రమ, వ్యవసాయం వంటి కీలక రంగాలకు ప్రభుత్వ మద్దతు అవసరం' అని చెప్పారు. 'బ్యాంక్ బచావో - దేశ్ బచావో' కన్వీనర్ సౌమ్య దత్తా మాట్లాడుతూ విలీనాలు లేదా ప్రైవేటీకరణ ద్వారా ప్రభుత్వరంగ బ్యాంకింగ్ వ్యవస్థను బలహీన పరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల సామాన్యులు దోపిడీకి గురవుతా రని చెప్పారు. దేశంలో శాస్త్ర, సాంకేతిక పరిశోధన లను సరిగా వినియోగించుకోవడం లేదని జాదవ్ పూర్ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ సిద్ధార్థ దత్తా అన్నారు.

మీడియాతో మాట్లాడొద్దు

సంజయ్‌సింగ్‌కు కోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: ఎక్సైజ్ కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన ఆప్ ఎంపీ సంజయ్‌సింగ్‌ను మీడియాతో మాట్లాడరాదని ఢిల్లీ కోర్టు మంగళవారం ఆదేశించింది. ఇది శాంతి భద్రతల సమస్యను సృష్టిస్తుందని కోర్టు పేర్కొంది. మంగళవారం కోర్టు హాలులోకి ప్రవేశించే ముందు ఆప్ నాయకుడు విలేకరులతో మాట్లాడిన తర్వాత ప్రత్యేక న్యాయమూర్తి ఎంకే నాగ్‌పాల్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆయనను కోర్టులో ప్రవేశపెట్టే సమయంలో మీడియా సిబ్బందిని ప్రశ్నలు అడగవద్దని న్యాయమూర్తి ఆదేశించారు. 'ఇది భద్రత సమస్యను కూడా సృష్టిస్తుంది' అని న్యాయమూర్తి అన్నారు. సంజయ్‌సింగ్ విలేకరులతో మాట్లాడుతూ... 'నిజాయితీ లేని వ్యక్తులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వద్ద ఉండగా, నిజాయితీపరులు మాతో ఉన్నారు' అని సింగ్ పేర్కొన్నారు. ఈడీ దాఖలు చేసిన తదుపరి రిమాండ్ దరఖాస్తుపై ప్రస్తుతం వాదనలు జరుగుతున్నాయి. 2021-22 ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసుకు సంబంధించి మనీలాండరింగ్ విచారణకు సంబంధించి ఈడీ అక్టోబర్ 4న సింగ్‌ను అరెస్టు చేసిన సంగతి విదితమే.

మిజోరం స్వతంత్ర ఎమ్మెల్యేలు ఐదుగురి రాజీనామా

ఐజ్వాల్: ఈశాన్య రాష్ట్రం మిజోరంలో నవంబరు 7న జరిగే అసెంబ్లీ ఎన్నికలకు నెల రోజుల లోపే రాష్ట్రానికి చెందిన ఐదుగురు స్వతంత్ర ఎమ్మెల్యేలు మంగళవారం తమ రాజీనామాలు సమర్పించారు. ఐజ్వాల్ పశ్చిమ-3 నియోజకవర్గానికి చెందిన వి.ఎల్.జైతంజామా, ఐజ్వాల్ ఉత్తరం-2కి చెందిన వన్‌లాల్‌తలానా, ఐజ్వాల్ దక్షిణం-2కి చెందిన లాల్చువాంతంగా, ఐజ్వాల్ దక్షిణం-1కి చెందిన సి లాల్సావివుంగా, ఐజ్వాల్ ఉత్తరం-1 నియోజకవర్గానికి చెందిన వన్‌లాల్‌హ్లానా రాజీనామా చేసిన ఐదుగురిలో ఉన్నారు. వారు వాస్తవానికి జోరామ్ పీపుల్స్ మూవ్‌మెంట్ (జెడ్‌పీఎం) కు చెందినవారు. కానీ 2018లో స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేశారు. గత ఎన్నికలు జరిగినప్పుడు అది రాజకీయ పార్టీగా నమోదు కాలేదు. శాసనసభ సభ్యత్వానికి వారు రాజీనామా చేయడం చాలా కీలకమని, ఇప్పుడు వారు జెడ్‌పీఎం టికెట్‌పై నామినేషన్లు దాఖలు చేయగలరని వివరించారు. దీంతో 40 మంది సభ్యులున్న అసెంబ్లీకి రాజీనామా చేసిన వారి సంఖ్య ఏడుకు చేరింది. గతంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే కె.టి.రోఖా, మాజీ మంత్రి కె.బీచువా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. రోఖా ఇప్పటికే అధికార మిజోరం నేషనల్ ఫ్రంట్ (ఎంఎన్ఎఫ్) లో చేరి తన సొంత గడ్డ అయిన పాలక్ స్థానం నుంచి పోటీ చేశారు. జనవరిలో ఎంఎన్ఎఫ్ నుంచి బహిష్కరణకు గురైన బీచువా అక్టోబరు 6న బీజేపీలో చేరారు. సియాహా నుండి పోటీ చేస్తారు. అక్కడ నుంచి 2013 నుంచి పార్టీ టికెట్‌పై రెండు సార్ల గెలుపొందారు.

పలస్తీనాకు కేరళ ముస్లిం మేధావుల సంఘీభావం

రాజ్ భవన్ వరకు ప్రదర్శన

తిరువనంతపురం: పలస్తీనాకు మద్దతుగా కేరళలోని సున్నీ ముస్లిం మేధావుల కేరళ మధ్య, దక్షిణ ప్రాంతానికి చెందిన ఒక సంఘం మంగళవారం గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ అధికారిక నివాసమైన రాజ్ భవన్‌కు ప్రదర్శన నిర్వహించింది. దక్షిణ కేరళ జమియ్యతుల్ ఉలమా సభ్యుల చిన్న బృందం 'లా ఇలాహ ఇల్లల్లాహ్' అని నినదిస్తూ, పలస్తీనా 'విమోచకులకు' సంఘీభావం తెలిపే బ్యానర్‌ను పట్టుకుని రాష్ట్ర రాజధాని నడిబొడ్డు గుండా రాజ్ భవన్‌కు చేరుకుంది. అయితే పోలీసులు రాజ్‌భవన్‌కు 100 మీటర్ల దూరంలోనే ప్రదర్శకులను అడ్డుకున్నారు. తదనంతరం, పలస్తీనా ప్రజలకు చేసిన వాగ్దానాలు నిరాకరణకు గురయ్యాయని నాయకులు సంఘటనా స్థలంలో ప్రసంగించారు. హమాస్ తీవ్రవాద సంస్థ, ఇజ్రాయిల్ రక్షణ దళాల మధ్య కొనసాగుతున్న యుద్ధంలో 1,600 మంది ప్రాణాలు కోల్పోయారు.

'సెమీ పోరు'కు కాంగ్రెస్ సిద్ధం

ఐదు రాష్ట్రాల ఎన్నికలకు పటిష్ట వ్యూహం

న్యూఢిల్లీ: 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను సెమీ ఫైనల్‌గా పరిగణిస్తున్నందున, ఐదు రాష్ట్రాలలో అత్యంత కీలకమైన పోటీలో విజయం సాధించేందుకు కాంగ్రెస్ సర్వశక్తులు ఒడ్డుతోంది. ఈ ఎన్నికలు పరీక్ష మాత్రమే కాకుండా 'ఇండియా కూటమి'లో దాని బేరసారాల సామర్థ్యాన్ని కూడా నిర్ణయిస్తాయి. అసెంబ్లీ ఎన్నికలు 2024 లోక్‌సభ ఎన్నికల పోటీకి గేమ్‌చేంజర్‌గా మారగలవని అర్థం చేసుకున్న కాంగ్రెస్, ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో 'ఎన్నికల హామీలు', కుల గణన కోసం డిమాండ్‌తో తన వ్యూహాన్ని పటిష్టం చేస్తోంది. కాంగ్రెస్ రాజస్థాన్, చత్తీస్‌గఢ్‌ల్లో అధికారాన్ని నిలుపుకోవాలని చూస్తోంది. అయితే ఎన్నికలు జరగనున్న ఇతర మూడు రాష్ట్రాలయిన మధ్య ప్రదేశ్, తెలంగాణ, మిజోరంలో అధికారంలోకి రావాలని కోరుకుంటోంది. ఐదు ఎన్నికలు జరగనున్న రాష్ట్రాలు మొత్తం 83 లోక్‌సభ స్థానాలను కలిగి ఉన్నందున, ఈ రాష్ట్రాల్లో ఎన్నికల పనితీరు పార్లమెంటు ఎన్నికలపై కొంత ప్రభావం చూపుతుంది. అయితే 2019లో రాజస్థాన్, మధ్య ప్రదేశ్, చత్తీస్‌గఢ్‌ల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించింది. కొన్ని నెలల తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఘోరమైన ప్రదర్శన కనబరిచింది. ఎన్నికల షెడ్యూల్ ప్రకటనపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పందిస్తూ, ప్రజాసంక్షేమం, సామాజిక న్యాయం, ప్రగతిశీల అభివృద్ధే తమ హామీలుగా కాంగ్రెస్ పార్టీ తమ బలంతో ప్రజల్లోకి వెళుతుందని అన్నారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) కీలక సమావేశంలో పార్టీ నేతలను ఉద్దేశించి ఖర్గే ఎన్నికలకు ముందు ఐక్యత, క్రమశిక్షణ కోసం పిలుపునిచ్చారు. రానున్న అసెంబ్లీ ఎన్నికలు, సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పార్టీ నిశిత సమన్వయంతో, పూర్తి క్రమ శిక్షణతో, ఐక్యతతో పనిచేయడం చాలా ముఖ్యమని సమా వేశంలో ఆయన అన్నారు. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నిక లకు సమర్థవంతమైన వ్యూహం అవసరమని కూడా ఖర్గే నొక్కి చెప్పారు. హిమాచల్ ప్రదేశ్, కర్నాటకలో నిర్ణయా త్మక విజయాల తర్వాత పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం ఉందని, ఐదు రాష్ట్రాల్లో గెలవడానికి 'మన శక్తి' పెట్టాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. కాంగ్రెస్ నాయకత్వం ఎన్నికలలో మంచి ప్రదర్శన కనబరుస్తుందనే నమ్మకంతో ఉంది. అయితే హిందీ ప్రధాన రాష్ట్రాల్లో ముఖ్యంగా రాజస్థాన్‌లో ఎన్నికలకు ముందు ఎదురయ్యే భయంకర మైన సవాళ్ల గురించి కూడా తెలుసు. మంచి ప్రదర్శనపై విశ్వాసం వ్యక్తం చేస్తూ, రాహుల్ గాంధీ గత నెల చివరిలో మాట్లాడుతూ ప్రస్తుతానికి మధ్య ప్రదేశ్, చత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ కచ్చితంగా గెలుస్తోందని, బహుశా తెలంగాణను గెలుస్తుందని, రాజస్థాన్‌లో 'చాలా దగ్గరి' పోటీ ఉందని, అది ఆవిర్భవించగలదని పార్టీ విశ్వసిస్తోందని అన్నారు. గాంధీ వ్యాఖ్యలు చేసిన మరుసటి రోజు, ముఖ్యమంత్రి అశోక్ గహ్లోత్ మధ్య ప్రదేశ్, చత్తీస్‌గఢ్‌ల్లో కంటే రాష్ట్రంలో పార్టీ పెద్ద విజయాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. 'ఆయన (రాహుల్ గాంధీ) మాకు సవాలు విసిరారు. మేము దానిని స్వీకరిస్తాము. పార్టీ విజయంలో రాజస్థాన్, మధ్య ప్రదేశ్, చత్తీస్‌గఢ్‌లను అధిగమిస్తుందని మేము ఆయనకు చూపిస్తాము' అని గహ్లోత్ అన్నారు. అయితే రాజస్థాన్‌లో కాంగ్రెస్‌కు కఠిన పరీక్ష తప్పదని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. అక్కడ కాంగ్రెస్, బీజేపీ అంతర్గత పోరు ఎదుర్కొంటున్నప్పటికీ, రానున్న ఎన్నికలు కఠినమని గ్రహించి బహిరంగంగా ఐక్యతను ప్రదర్శి స్తున్నాయి. చత్తీస్‌గఢ్, మధ్య ప్రదేశ్‌ల్లో కాంగ్రెస్ మెరుగ్గా ఉంది. పేదల సంక్షేమ పథకాల నేపథ్యంలో చత్తీస్‌గఢ్‌లో తిరిగి అధికారంలోకి రావాలని ఆశపడుతుండగా, మధ్య ప్రదేశ్‌లో 2020లో ప్రభుత్వం పడగొట్టిన తర్వాత మళ్లీ అధికారంలోకి రావాలని చూస్తోంది. తెలంగాణలో బీఆర్ఎస్‌కి చెందిన కె.చంద్రశేఖర్‌రావు ప్రభుత్వం నుంచి అధికారాన్ని చేజిక్కించుకోవాలని, బీజేపీతో త్రిముఖ పోటీని నెలకొల్పాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. మిజోరంలో 40 మంది సభ్యుల అసెంబ్లీలో కేవలం ఐదు స్థానాలతో కాంగ్రెస్‌తో మిజో నేషనల్ ఫ్రంట్ అధికారంలో ఉంది. అయితే ఈ రాష్ట్రంలో మంచి ప్రదర్శనతో ఈశాన్య ప్రాంతంలో పునరుజ్జీవనాన్ని కాంగ్రెస్ పార్టీ కోరుకుంటోంది. అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పని తీరు 2024లో బీజేపీని ఎదుర్కొనే ప్రతిపక్ష పార్టీగా దాని స్థితిని ప్రభావితం చేయడమే కాకుండా, ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇన్‌క్లూజివ్ అలయన్స్ (ఇండియా) ఇతర కూటమి భాగస్వాములతో బేరసారాల శక్తిని కూడా ప్రభావితం చేస్తుంది. విశేషమేమిటంటే, సెప్టెంబరు 1న ముంబై సమావేశం ముగిసిన వెంటనే కూటమిలోని భాగస్వాముల మధ్య సీట్ల భాగస్వామ్యాన్ని ఖరారు చేయాల్సి ఉంది. అయితే బేరసారాలపై ప్రభావం చూపే అసెంబ్లీ ఎన్నికల తర్వాత మాత్రమే ఆ కూటమిలో వివిధ పార్టీల మధ్య ఏదైనా ముఖ్యమైన కదలిక జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. 2024లో బీజేపీకి బలీయమైన పోటీ దారుగా 'ఫైనల్'లోకి ప్రవేశించేందుకు కాంగ్రెస్ తన సంక్షేమ 'హామీలు, కుల జనాభా గణన వాగ్దానాలను అమలు చేయాలని భావిస్తోంది.

హామీల అమలుకు ఉద్యమం

- రైతులకు నష్టదాయకంగా మోదీ తీరు
- విద్యుత్ సంస్కరణలు ఉపసంహరించాలి
- బెంగళూరు సదస్సులో రావుల వెంకయ్య డిమాండ్

విశాలాంధ్ర ప్రత్యేక ప్రతినిధి-బెంగళూరు: మూడు నల్ల వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతాంగం మొక్కవోని దీక్షతో ఆందోళన చేసిన సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రైతు సంఘాలకు రాతపూర్వకంగా ఇచ్చిన హామీలు ఏడాది గడిచిన ఏ ఒక్కటి అమలుకు నోచుకోలేదనీ, వెంటనే వాటిని అమలుచేయాలని అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) అధ్యక్షులు రావుల వెంకయ్య డిమాండ్ చేశారు. కిసాన్‌మోర్చా (ఎస్‌కేఎం) కర్నాటక రాష్ట్ర సదస్సు బెంగుళూరులోని కొండాజీ బసప్ప హాలులో జరిగింది. వివిధ జిల్లాల నుంచి 500 మందికిపైగా రైతుప్రతినిధులు సదస్సుకు హాజరయ్యారు. ముఖ్య అతిధు లుగా రావుల వెంకయ్య, ఎఐకెఎస్ జాతీయ కార్యదర్శి బిజ్జు కృష్ణన్, కిసాన్ క్రాంతి యూనియన్ అధ్యక్షులు అవతార్‌సింగ్ పాల్గొన్నారు. ఈ సదస్సుకు అధ్యక్ష వర్గంగా హెచ్.ఆర్. బసవరాజప్ప, రసమాలీ పాటీల్, వి. బస్వరాజ్, సయ్యద్ మూజీబ్, స్వర్ణబట్, రమ్యమాలిక్ వ్యవహరించారు. కర్నాటక రాష్ట్రానికి చెందిన ఎఐకెఎస్ అధ్యక్ష, కార్యదర్శులు సిద్దన్నగౌడ్ పాటీల్, లోకేశ్, ఎఐకెఎస్ (సీపీఎం) దివాకర్, ఏఐకేకేఎం నుంచి నాగేంద్ర పాల్గొన్నారు. యస్వంత్ తీర్మానం ప్రవేశపెట్టగా సదస్సు ఆమోదించింది.

సదస్సులో రావుల వెంకయ్య మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ రైతు చట్టాలు ఉపసంహరించుకుంటూ యావత్ రైతు జాతికి క్షమాపణలు చెప్పడం రైతు ఉద్యమం సాధించిన ఘన విజయం అన్నారు. నాడు రైతుసంఘాలకు వ్రాతపూర్వకంగా ఇచ్చిన హామీలు సంవత్సరం దాటినా ఏ ఒక్కటీ అమలు జరపలేదన్నారు. పంటల మద్దతు ధరలకు సి2+50 చట్టబద్ధ హక్కుగా రాలేదన్నారు. కేరళలో ఎల్డీఎఫ్ ప్రభుత్వం ధాన్యానికి మద్దతు ధరకు అదనంగా క్వింటాల్‌కు 780 బోనస్‌గా చెల్లిస్తున్నదన్నారు. రైతులను అప్పుల భారీ నుంచి రుణవిమోచన కలిగించడానికి కేరళ తరహా రుణ విమోచనను చట్టబద్ధ హక్కుగాకేంద్రం తీసుకురావాలన్నారు. రైతులకు అత్యంత నష్టదాయకంగా ఉన్న విద్యుత్ సంస్కరణల బిల్లును ఉపసహంరించుకోవాలన్నారు. లఖింపూర్‌ఖేరి ఘటనకు బాధ్యులైన హోంశాఖ సహాయమంత్రి, ఆయన కుమారుడిని కఠినంగా శిక్షించాలన్నారు. ఇవి సాధించాలంటే తిరిగి దేశవ్యాప్తంగా బలమైన రైతు ఉద్యమాన్ని విస్తృత పర్చాల్సిన అవసరం ఉందన్నారు. దానిలో భాగంగానే రెండుమూడు రాష్ట్రాలకు పరిమితంగా ఉన్న ఎస్‌కేఎంని దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో సదస్సుల రూపంలో జరిపి ఐక్య పరచడానికి కార్యక్రమం జరుగుతున్నదన్నారు. ఇప్పటికి 15 రాష్ట్రాలలో పూర్తయి 16వ రాష్ట్రంగా కర్నాటకలో నేడు జరుగుతున్నదన్నారు. నవంబరు 25,26,27 తేదీలలో దేశవ్యాపితంగా నిరవధిక దీక్షలను నిర్వహించాలని పిలుపు నిచ్చారు. ఇవి సాధించాలంటే నరేంద్రమోదీని గద్దెదించడమే పరిష్కారం తప్ప మరొకటి కాదన్నారు. అందుకే నరేంద్ర మోదీ హఠావో,దేశ్‌కా బచావో, కిసాన్ బచావో అనే నినాదంతో దేశవ్యాప్త ఉద్యమాన్ని తిరిగి ప్రారంభించడానికి రైతులంతా ఐక్యంగా ముందుకు రావాలన్నారు.బిజ్జు కృష్ణన్ మాట్లాడుతూ రైతాంగ ఉద్యమాన్ని దేశవ్యాప్త ఉద్యమంగా తిరిగి బలంపొందేట్లు చూడాలన్నారు. కిసాన్ క్రాంతికార్ యూనియన్ అధ్యక్షులు అవతార్ సింగ్ మాట్లాడుతూ సంవత్సరానికి పైగా ఢిల్లీ సరిహద్దుల్లో జరిగిన ఉద్యమంలో పంజాబ్ రైతులు అగ్రభాగాన నిలిచారని అదే స్ఫూర్తితో దక్షిణ భారత దేశ రైతులు కూడా తిరిగి జరిగే ఈ ఉద్యమంలో కీలకభాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

కులగణన దేశానికి 'ఎక్స్-రే' వంటిది

కేంద్రం దీనిని అమలు చేయాలి: రాహుల్ గాంధీ

బియోహరి (మధ్య ప్రదేశ్): కుల గణన దేశానికి 'ఎక్స్-రే' వంటిదని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ మంగళవారం అభివర్ణించారు. ఇది ఓబీసీలు, దళితులు, గిరిజనుల స్థితిగతులపై వెలుగునిస్తుందని తెలిపారు. దీనిని అమలు చేయాలని కేంద్రంపై తమ పార్టీ ఒత్తిడి తీసుకు వస్తుందని ఆయన అన్నారు. కుల గణన అంశంపై కూడా ప్రధాని మోదీ మాట్లాడడం లేదని ఆరోపించారు. దేశంలోని ఓబీసీలు, దళితులు, గిరిజనుల స్థితిగతులపై నిజానిజాలు తెలుసుకు నేందుకు కుల గణన చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని బలవంతం చేస్తాం. రాజస్థాన్, చత్తీస్‌గఢ్‌లోని మా ప్రభుత్వాలు దాని కోసం ప్రక్రియను ప్రారంభించాయని రాహుల్ గాంధీ చెప్పారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల తేదీలను ప్రకటించిన మరుసటి రోజు మధ్య ప్రదేశ్‌లోని షాడోల్ జిల్లా బియోహారీలో జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. 'కుల గణన అనేది దేశానికి ఎక్స్‌రే అని, దేశంలోని గిరిజనులు, దళితులు, ఓబీసీలు గాయపడ్డారు. తనిఖీ చేద్దాం. అది స్పష్టమైన చిత్రాన్ని ఇస్తుంది' అని ఆయన అన్నారు. కాంగ్రెస్ చేసిన కుల గణన సమాచారాన్ని విడుదల చేయమని మేము ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి సవాలు చేశాము. కానీ దాని గురించి మాట్లాడ టానికి బదులుగా, అతను పాకిస్తాన్, ఆఫ్గనిస్తాన్ దక్షిణం గురించి మాట్లాడతాడు. కుల జనాభా గణన గురించి మాట్లాడండి' అని కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు పేర్కొన్నారు. బీజేపీ ప్రముఖ నేత ఎల్.కె.అద్వానీ రాసిన పుస్తకాన్ని ప్రస్తావిస్తూ, గుజరాత్ కాదు, మధ్యప్రదేశ్ బీజేపీ, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ప్రయోగశాల అని పేర్కొన్నారని అన్నారు. అయితే మధ్య ప్రదేశ్ మరణించిన వారికి వైద్యం, వ్యాపం, మధ్యాహ్న భోజనం, గిరిజనులు, మహిళలపై అఘాయిత్యాలు వంటి అనేక కుంభకోణాలకు ప్రయోగశాల అని ఆయన రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం లక్ష్యంగా విమర్శించారు. కాగా, మధ్య ప్రదేశ్‌లో ఒకే దశ అసెంబ్లీ ఎన్నికలు నవంబరు 17న జరగనున్నాయి.

నా తండ్రి క్షేమమే...

ప్రముఖ ఆర్థికవేత్త అమర్త్యసేన్ కుమార్తె వెల్లడి

న్యూదిల్లీ : ప్రముఖ ఆర్థిక వేత్త, నోబెల్ గ్రహీత అమర్త్యసేన్ క్షేమంగానే ఉన్నారని ఆయన కుటుంబ సభ్యులు మంగళవారం స్పష్టం చేశారు. అమర్త్యసేన్ కన్నుమూశారంటూ సామాజిక మాధ్యమాల్లో వచ్చిన వదంతులను ఆయన కుమార్తె నందనా సేన్ ఖండించారు. తన తండ్రి పూర్తి ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు. అమర్త్యసేన్ గురించి వదంతులు రాగానే తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన మిత్రులందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ ఆమె 'ఎక్స్' లో పోస్ట్ చేశారు. తన తండ్రి అమర్త్యసేన్ గురించి వచ్చిన వార్తలు అవాస్తవమని నందనా సేన్ పేర్కొన్నారు. అమర్త్యసేన్ పూర్తిగా క్షేమంగా ఉన్నారని అన్నారు. తామంతా కేంబ్రిడ్జిలో కుటుంబ సభ్యులతో కలిసి ఎంతో ఆనందంగా సమయాన్ని గడిపిన విషయాన్ని వెల్లడించారు. హార్వర్డ్‌లో వారంలో రెండు కోర్సులు బోధిస్తున్నారని, అలాగే, ఒక పుస్తకం రాసే పనిలో నిమగ్నమై... ఎప్పటిలాగే బిజీగా ఉన్నట్లు తెలుపుతూ నందన ఒక ఫొటోను షేర్ చేసుకున్నారు. అమర్త్యసేన్ మృతి చెందినట్లు మంగళవారం సాయంత్రం వచ్చిన వదంతులతో అనేక మంది తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఆయన పూర్తిగా క్షేమంగానే ఉన్నట్లు అమర్త్యసేన్ కుమార్తె స్పష్టత ఇవ్వడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఆయన ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షిస్తూ పోస్టులు పెడుతున్నారు.

నవంబర్ 26, 27, 28 తేదీల్లో

రాజభవన్ వద్ద మహా ధర్నాలు

జయప్రదం చేయాలని రైతుసంఘాల సమన్వయ సమితి-కార్మిక సంఘాల పిలుపు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): రైతు, కార్మి కుల వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న మోదీ ప్రభుత్వాన్ని సాగనంపాలని సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపు మేరకు దేశవ్యాప్తంగా జరుగుతున్న ఉద్యమంలో భాగంగా నవంబర్ 26, 27, 28 తేదీలలో (72గంటలు) నిర్విరామంగా ఆట, పాట, మాటలతో విజయవాడ రాజభవన్ వద్ద జరిగే మహా ధర్నాలను జయప్రదం చేయాలని రైతు సంఘాల సమన్వయ సమితి-కార్మిక సంఘాలు సంయు క్తంగా నిర్వహించిన సమావేశం తీర్మానించింది. మంగళవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు అధ్యక్షతన రైతు సంఘాల సమన్వయ సమితి నాయకులు- కార్మిక సంఘాలు సంయుక్తంగా నిర్వహిం చారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వడ్డే మాట్లా డుతూ.... దుష్ట పాలన చేస్తున్న కేంద్రంలో మోదీ సర్కారు ను, రాష్ట్రంలో జగన్ ప్రభుత్వాలను గద్దె దించేందుకు ప్రజానీకాన్ని చైతన్యపరిచి, సంఘటిత పరిచేందుకు రైతులు, కౌలు రైతులు, కార్మికులు సంఘటి పోరాటానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు.

కృష్ణా జలాలకోసం సుప్రీంకోర్టుకు వెళతాం: ఓబులేసు

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు మాట్లాడుతూ... కార్మిక, కర్షకుల జీవితాలను పణంగా పెట్టి లక్షల కోట్ల రూపాయల ప్రజా సంపదను అదానీ, అంబానీలకు కేంద్ర ప్రభుత్వం దోచిపెడుతోందన్నారు. ప్రభుత్వం రంగ సంస్థలను విదేశీ, స్వదేశీ పారిశ్రామిక శక్తులకు చౌకగా విక్రయించటమే ధ్యేయంగా పని చేస్తోందని విమర్శించారు. కార్మికులు అనేక పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి యాజమాన్యా లకు అనుకూలంగా ఉన్న చట్టాలు చేసి కార్మిక వర్గాన్ని నిర్వీర్యం చేయటానికి కుటిల యత్నాలు చేస్తోందని ... వాటిని సంఘటితంగా ప్రతిఘ టించటమే కాకుండా రాబోవు ఎన్నికలో తగిన గుణపాఠం చెప్పాలని సూచించారు. ఒక్క క్షణం కూడా దేశాన్ని పాలించే అర్హత బీజేపీకి లేదన్నారు. కృష్ణా జలాల పంపిణీ సక్రమంగా లేదని, ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం జరుగుతోన్న విషయం తెలిసినప్పటికీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మౌనం దాల్చడం దుర్మార్గం అన్నారు. అన్ని సంఘాలతో చర్చించి తామే కృష్ణాజలాల పంపిణీ కోసం సుప్రీంకోర్టుకు వెళ్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ రైతాంగ సమస్యల పరిష్కారం కోసం రాజ్‌భవన్ వద్ద చేపట్టే నిరసన కార్యక్రమానికి పెద్దఎత్తున రైతాంగం తరలివచ్చి మోదీ ప్రభుత్వానికి కళ్లు తెరిపించాలన్నారు. ప్రీపెయిడ్ స్మార్ట్ ఎలక్ట్రిసిటీ మీటర్లను వెంటనే ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. పంటలకు సమగ్ర ఉత్పత్తి వ్యయానికి అదనంగా 50% కలిపి చట్టబద్ధ మద్దతు ధరలు ప్రకటించాలని... కౌలురైతులతో సహా రైతులందరికీ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు అందించాలన్నారు. కేరళలో మాదిరిగా రైతు రుణ ఉపశమన చట్టాన్ని పార్లమెంటులో చేయాలని, కార్మిక సంక్షేమానికి నష్టం చేసే నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలన్నారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌తో సహా ప్రభుత్వ రంగ పరిశ్రమల్ని విక్రయించడాన్ని అడ్డుకోవాలని, రాజ్యాంగ ప్రసాదించిన ప్రాథమిక హక్కులను రక్షించు కునేందుకు ఆందోళన చేపట్టాలని పిలుపునిచ్చారు. ఉపాధి హామీ పథకాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు యూ ఉమామహేశ్వర రావు మాట్లాడుతూ ప్రజా కంటక ఉపా, దేశద్రోహం, మనీ ల్యాండరింగ్ నిరాధార ఆరోపణలతో ప్రతిపక్ష నాయకులను, సంస్థలను వేధిస్తూ కేంద్ర ప్రభుత్వం రైతు కార్మిక విధానాలను అనుసరిస్తోందన్నారు. 72 గంటల పాటు జరిగే అందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయటానికి 8 మందితో స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. ఇందులో నాయకులు వడ్డే శోభనాద్రీశ్వరరావు, వై.కేశవ రావు, కేవీవీ ప్రసాద్, జి.ఓబులేసు, యు. ఉమా మహేశ్వర రావు, చుండూరు రంగారావు, సింహాద్రి ఝాన్సీ, చిట్టిపాటి వెంకటేశ్వర్లు ఉన్నారు. ఈ కమిటీ త్వరలో సమావేశమై మరికొన్ని సబ్ కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ సమా వేశంలో రైతు,కార్మిక సంఘాల నాయకులు వెంకట సుబ్బయ్య, కుర్రా నరేంద్ర, పి.జమ లయ్య, చుండూరు రంగావు, సింహాద్రీ ఝాన్సీ, వీ వెంకటేశ్వర్లు, దడాల సుబ్బారావు, ఏవీ నాగేశ్వరరావు, వీ కృష్ణయ్య, ఎం.గిరీష్, జొన్న శివశంకర్, కే బసవయ్య, ఎం. రామకృష్ణ, ఎ.రవిచంద్ర, కే వీరబాబు, గొల్లపూడి ప్రసాద్ పాల్గొన్నారు.

గిరిజనులకు పక్కా గృహాలు కట్టించాలి

ఆవుల శేఖర్ డిమాండ్

విశాలాంధ్ర-రైల్వేకోడూరు: అన్నమయ్య జిల్లా, రైల్వే కోడూరు మండలం, రెడ్డివారి పల్లి గ్రామ పంచాయతీలో నివసిస్తున్న గుర్రప్పపాలెం గిరిజనులైన యానాది కుటుం బాలకు ఇళ్ల స్థలాలు లేనివారికి సర్వేనంబర్ 1922, 1599లో ఇళ్ల స్థలాలకు అనువుగా ఉన్న భూమిలో ఇళ్ల స్థలాలు ఇచ్చి ప్రభుత్వమే పక్క గృహాలు కట్టించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఆర్. వెంకట్రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక రెవెన్యూ కార్యాలయము ఎదుట ఇళ్ల స్థలాలు లేని గిరిజను లకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద అనేక సార్లు ఆందోళన కార్యక్రమాలు చేసినప్పటికీ, రెవెన్యూ అధికారులు ఆ భూమిని సర్వే చేసి పేదలకు పంచకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. గుర్రప్పపాలెం గిరిజనుల కోసం రెవెన్యూ అధికారులు సర్వే చేసిన స్థలంలో ఈ నెల 31వ తేదీ లోగా ఇళ్ల స్థలాలు మంజూరు చేసి పట్టాలు ఇవ్వకపోతే, భవిష్యత్‌లో భూ పోరాటాల ద్వారా ఎర్రజెండాలు చేతపట్టి పోరాటాలు చేస్తామన్నారు. ఉంటే భూమిలో ఉంటాం లేదంటే జైలుకైనా రెడీ అనే నినాదంతో, భూ పోరాటాల్లో పేదలను భాగస్వాములు చేస్తామని చెప్పారు. రెవెన్యూ అధికారులు సర్వే చేసిన 1922, 1599 గల భూమిలో ఎర్రజెండాలు నాటి ఇళ్ల స్థలం లేని ప్రతి నిరుపేద కుటుంబానికి మూడు సెంట్లు లెక్కన పంచి, పేదల కోసం గుడిసెలు వేయిస్తామని వారు రెవెన్యూ అధికారులను హెచ్చరించారు, గుర్రప్పపాలెం గిరిజనులు, ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం కార్యకర్తలు భూ పోరాటానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి సి.సుబ్రహ్మణ్యం, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు పండుగోల మణి, జిల్లా ప్రధాన కార్యదర్శి తోపు కిష్టప్ప, నియోజకవర్గ అధ్యక్షులు రేవూరి శంకరయ్య, ప్రధాన కార్యదర్శి షేక్ హజ్మాబి, నియోజవర్గ ఉపాధ్యక్షులు చలంపాటి నరసింహులు, పెనగలూరు మండలం అధ్యక్షులు రేవూరి కృష్ణయ్య, రైల్వే కోడూరు నియోజకవర్గ సహాయ కార్యదర్శి పద్మ, గుర్రప్పపాలెం గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

సెంచరీతో చెలరేగిన మలాన్

బంగ్లాపై ఇంగ్లండ్ విజయం

ధర్మశాల: వన్డే ప్రపంచకప్‌లో ఇంగ్లండ్ తొలి విజయం సాధించింది. తొలి లీగ్ మ్యాచ్‌లో న్యూజిలాండ్ చేతిలో ఘోరంగా ఓడిపోయిన ఇంగ్లండ్... మంగళవారం ధర్మశాలలో బంగ్లాదేశ్‌తో జరిగిన రెండో లీగ్ మ్యాచ్‌లో 137 పరుగుల తేడాతో ఘన విజయం అందుకుంది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 364 పరుగులు చేయగా.. 365 పరుగుల భారీ లక్ష్యంతో బరిలో దిగిన బంగ్లాదేశ్ మరో 10 బంతులు మిగిలి ఉండగానే 227 పరుగులకు ఆలౌట్ అయ్యింది. 137 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. బంగ్లా కెప్టెన్ లిటన్ దాస్ మినహా టాప్ ఆర్డర్ పూర్తిగా విఫలమైంది. ఇంగ్లండ్ బౌలర్ రీస్ టోప్లీ బంగ్లా బ్యాటింగ్ ఆర్డర్ నడ్డి విరిచాడు. రెండో ఓవర్ నాలుగో బంతికే ఓపెనర్ తంజీద్ హసన్ ఒక్క పరుగు చేసి ఔటయ్యాడు. ఆ తర్వాత బంతికే నజ్ముల్ హొసేన్ శాంటోను కూడా ఖాతా తెరవకుండానే టోప్లీ పెవిలియన్‌కు పంపాడు. అప్పటికి జట్టు స్కోర్ 14/2. ఆరో ఓవర్‌లో షకీబ్ ఉల్ హసన్ కూడా ఒక్క పరుగు చేసి ఔటయ్యాడు. మెహిదీ హసన్ మిరాజ్ కూడా సింగిల్ డిజిట్‌కే వెనుదిరిగాడు. ఆ తర్వాత ముష్ఫికర్ రహీమ్ (51), టోవిడ్ హృదయ్ (39) పర్వాలేదనిపించారు. ఇక టెయిలెండర్‌లు కూడా తక్కువ స్కోర్లకే ఔటయ్యారు. దాంతో 48.2 ఓవర్లలో 227 పరుగులకు బంగ్లాదేశ్ ఆలౌట్ అయింది. రీస్ టోప్లీ 4 వికెట్లు, క్రిస్ వోక్స్ 2 వికెట్లు పడగొట్టారు. అంతకుముందు ఇంగ్లండ్ ఓపెనర్‌లు జానీ బెయిర్‌స్టో, డేవిడ్ మలాన్ తమ జట్టుకు శుభారంభాన్ని ఇచ్చారు. ఇద్దరు కలిసి 115 పరుగుల విలువైన భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఆ దశలో షకీబ్ ఉల్ హసన్ బౌలింగ్‌లో బెయిర్‌స్టో (52) క్లీన్ బౌల్డయ్యాడు. తర్వాత జోయ్ రూట్ వన్ డౌన్‌గా వచ్చి డేవిడ్ మలాన్‌కు జత కలిశాడు. ఈ ఇద్దరు కూడా 151 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నమోదు చేశారు. ఈ దశలో మెహదీ హసన్ బౌలింగ్‌లో సెంచరీ హీరో డేవిడ్ మలాన్ (107 బంతుల్లో 140 పరుగులు; 16 ఫోర్లు, 5 సిక్స్‌లు) ఔటయ్యాడు. అప్పటికి ఇంగ్లండ్ స్కోర్ 2 వికెట్ల నష్టానికి 266 పరుగులు. ఆ తర్వాత భారీ స్కోర్ నమోదు చేసే ప్రయత్నంలో బాదుడే పనిగా పెట్టుకుని ఇంగ్లండ్ బ్యాటర్‌లు వెంటవెంటనే వికెట్లు పారేసుకున్నారు. జోయ్ రూట్ (82) నాలుగో వికెట్‌గా వెనుదిరిగాడు. షోరీఫుల్ ఇస్లామ్ బౌలింగ్‌లో ముష్ఫికర్ రహీమ్‌కు క్యాచ్ ఇచ్చి రూట్ ఔటయ్యాడు. చివరికి నిర్ణీత 50 ఓవర్లు పూర్తయ్యేసరికి ఇంగ్లండ్ 8 వికెట్లు కోల్పోయి 364 పరుగులు చేసింది.

ఒలింపిక్స్‌లో క్రికెట్... త్వరలో ఐఓసీ నిర్ణయం

న్యూదిల్లీ: ప్రపంచవ్యాప్తంగా ఆదరణ ఉన్న క్రీడల్లో క్రికెట్ ఒకటి. దాదాపు 128 ఏళ్ల తర్వాత క్రికెట్‌ను మళ్లీ ఒలింపిక్స్‌కు చేర్చేందుకు సన్నాహాలు మొదలయ్యాయి. 2028లో లాస్ ఏంజిల్స్‌లో జరిగే ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను సైతం చేర్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. క్రికెట్‌తో పాటు ఫ్లాగ్ ఫుట్‌బాల్, బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్ సైతం ఎంట్రీ ఇవ్వబోతున్నాయి. ఈ నెల 15 నుంచి ముంబైలో జరుగనున్న ఇంటర్నేషనల్ ఒలింపిక్స్ కమిటీ (ఐఓసీ) సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.

ఒలింపిక్స్‌లో క్రికెట్‌తో పాటు వివిధ క్రీడలను చేర్చాలన్న నిర్ణయాన్ని ఎల్ఏ28 కమిటీ తీసుకోగా... దాన్ని ఆమోదించాల్సిందిగా ఐఓసీకి సిఫార్సు చేసింది. దీన్ని అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) సైతం ధ్రువీకరించింది. చాలా సంవత్సరాలుగా ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను చేర్చాలని ప్రయత్నాలు జరుగుతున్నా కార్యరూపం దాల్చలేదు. అయితే, ఐఓసీ భారత ఉపఖండంలోని మార్కెట్‌పై దృష్టి పెట్టింది. ఈ క్రమంలో లాస్ ఏంజిల్స్‌లో జరిగే ఒలింపిక్స్‌లో పురుషుల, మహిళల టీ-20 క్రికెట్‌ను ఒలింపిక్స్‌లో చేర్చనున్నట్లు తెలుస్తోంది. నివేదిక ప్రకారం... 2024 పారిస్ ఒలింపిక్స్ ప్రసార హక్కులు రూ.158.6కోట్లు కాగా, క్రికెట్‌ను చేరిస్తే 2028 నాటికి ప్రసార హక్కులు రూ.1,525 కోట్లకు చేరుకోవచ్చని అంచనా.

టీమిండియా కంటే మాదే మంచి స్పిన్ ఎటాకింగ్

అఫ్గాన్ కెప్టెన్ హస్మతుల్లా

న్యూదిల్లీ: ప్రపంచ క్రికెట్‌లో మంచి స్పిన్ బౌలర్లు ఉన్న జట్లలో అఫ్గానిస్తాన్ ఒకటి. వారి పేస్ బౌలింగ్, బ్యాటింగ్ విభాగం ఎలా ఉన్నా... అఫ్గానిస్తాన్ ప్రధాన బలం స్పిన్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. ప్రపంచస్థాయి స్పిన్నర్లు రషీద్ ఖాన్, ముజీబ్ ఉర్ రెహమాన్, మహమ్మద్ నబీ వారి సొంతం. వీరికి తోడు నయా సంచలనం నూర్ అలీ ఉండనే ఉన్నాడు. ఈ క్రమంలో భారత్ తో మ్యాచ్‌కు ముందు అఫ్గాన్ కెప్టెన్ తన స్పిన్నర్లను ఆకాశానికెత్తేశాడు. ప్రపంచకప్‌లో బుధవారం దిల్లీలో టీమిండియాతో అఫ్గానిస్తాన్ జట్టు తలపడనుంది. ఈ మ్యాచ్‌లో రోహిత్ సేన హాట్ ఫేవరేట్ గా బరిలోకి దిగుతోంది. తాజాగా దిల్లీలో ఒక ఇంటర్వ్యూ లో మాట్లాడిన అఫ్గాన్ కెప్టెన్ హస్మతుల్లా షాహిదీ భారత్ కంటే మాకు మెరుగైన స్పిన్నర్లు ఉన్నారని... వారి కంటే మేము మంచి స్పిన్నర్లతో రేపటి మ్యాచులో బరిలోకి దిగుతామని తెలిపాడు. ప్రస్తుతం టీమిండియాలో అశ్విన్, జడేజా, కుల్దీప్ యాదవ్ లాంటి నాణ్యమైన స్పిన్నర్లు ఉన్నారు. గత మ్యాచులో బంగ్లా స్పిన్నర్ల ధాటికి కుదేలైన అఫ్గానిస్తాన్... భారత్ పై ఏ మాత్రం పోరాడుతుందో చూడాలి. కాగా ప్రపంచకప్ తొలి మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై భారత్ విజయం సాధించగా... అఫ్గాన్ జట్టు బంగ్లాదేశ్ చేతిలో ఓటమిపాలైంది.

భారత్-పాక్ మ్యాచ్‌కు భారీ భద్రత

అహ్మదాబాద్: ప్రపంచకప్2023 లీగ్ దశలో భాగంగా భారత్-పాకిస్తాన్ మధ్య ఈ నెల 14వ తేదీన ఇక్కడి నరేంద్ర మోదీ స్టేడియంలో జరగనున్న మ్యాచ్‌కు అధికారులు కనీవినీ ఎరుగని రీతిలో భద్రతా ఏర్పాట్లు షురూ చేశారు. ఇటీవల గుర్తు తెలియని వ్యక్తుల నుంచి బెదిరింపు ఈమెయిల్ రావడంతో మరింత అప్రమత్తమైనట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో పోలీసులు మ్యాచ్ జరిగే రోజు నగరాన్ని పూర్తిగా తమ గుప్పెట్లోకి తీసుకోనున్నారు. మ్యాచ్ జరుగుతున్న అహ్మదాబాద్ నగరంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తున్నామని అహ్మదాబాద్ కమిషనర్ జీఎస్ మాలిక్ తెలిపారు. 'స్థానిక పోలీసులు, హోమ్ గార్డులతోసహా నేషనల్ సెక్యూరిటీ గార్డ్- ఎన్ఎస్‌జీ కమాండోలు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్సు రంగంలోకి దించి కట్టుదిట్ట భద్రత కల్పిస్తున్నాం. 7వేల వేల మంది పోలీసులతో పాటు మరో 4వేల మంది హోంగార్డులను మోహరిస్తాం. మ్యాచ్ జరుగుతున్నప్పుడు, స్టేడియం పరిసరాల్లో... నగరంలోని సున్నిత ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భద్రతా ఏర్పాటు కల్పిస్తున్నాం' అని వెల్లడించారు. కాగా మొత్తం 11 వేల మందికి పైగా భద్రతా సిబ్బందితో ఆ రోజు నగరం మొత్తం పోలీసులు ఆధీనంలోకి వెళ్లిపోనుంది.

దాదాపుగా లక్ష మందికి పైగా ప్రేక్షకులు ఈ మ్యాచ్ చూడటానికి వస్తుండటంతో అదే స్థాయిలో భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు జీఎస్ మాలిక్ తెలిపారు. కెమికల్, బయోలాజికల్, రేడియోలాజికల్, న్యూక్లియర్ (సీబీఆర్ ఎన్) వంటి దాడులు జరిగినా వెంటనే స్పందించేలా భద్రత కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందు కోసం ఎస్డీఆర్ ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ దళాలను కూడా మోహరిస్తున్నట్లు తెలిపారు.

షోపియాన్‌లో ఎన్‌కౌంటర్

ఇద్దరు లష్కరే ఉగ్రవాదుల హతం

షోపియాన్: జమ్ముకశ్మీరులోని షోపియాన్‌లో ఉగ్రవాదులు, భద్రతా బలగాలకు మధ్య ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు లష్కరే తొయిబా ఉగ్రవాదులు హతమయ్యారు. మంగళవారం తెల్లవారుజామున షోపియాన్‌లోని అల్షిపొరా ప్రాంతంలో స్థానిక పోలీసులతో కలిసి భద్రతా దళాలు గాలింపు చేపట్టాయి. ఈ క్రమంలో ఉగ్రవాదులు కాల్పులకు తెగబడటంతో ప్రతిగా జరిపిన కాల్పుల్లో ఇద్దరు టెర్రరిస్టులు చనిపోయారని కశ్మీర్ జోన్ పోలీసులు తెలిపారు. మృతులను మోరిఫత్ మక్బూల్, జాజిమ్ ఫరూఖ్ అలియాస్ అబ్రార్‌గా గుర్తించామన్నారు. వీరు ఇద్దరూ లష్కరే తొయిబా ఉగ్రవాద సంస్థకు చెందినవారని సామాజిక మాధ్యమం ఎక్స్ (ట్విట్టర్) వేదికగా వెల్లడించారు. కశ్మీరీ పండిత్ సంజయ్ శర్మ హత్యలో వారి హస్తం ఉందన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో దక్షిణ కశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలోని అచన్ ప్రాంతంలో బ్యాంకు సెక్యూరిటీ గార్డు సంజయ్ శర్మను ఉగ్రవాదులు కాల్చిచంపారు. ఆ ప్రాంతంలో గాలింపులు కొనసాగుతున్నాయని చెప్పారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.